తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
1-7-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 150 పేజీలు: 10+4 వెల: 6.50



మొజాయిక్ గత వారం రోజుల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



'సార్క్'కు ప్రత్యామ్నాయ కూటమికి యత్నం
2029కి 52 మిలటరీ ఉపగ్రహాలు నింగిలోకి
5






# భగ్గుమన్న 'సిగాచి'

పాశమైలారంలోని కెమికల్ ప్లాంట్‌లో భారీ పేలుడు

**15 మంది కార్మికులు దుర్మరణం, పలువురికి తీవ్రగాయాలు**

**100 మీటర్లు పైగా ఎగిరిపడ్డ కార్మికులు**

**11 ఫైరింజన్లు ప్రయత్నించినా ఆరని మంటలు**

**తక్షణమే ఘటనాస్థలానికి వెళ్లిన మంత్రులు దామోదర, వివేక్, ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, హరీష్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, డిజి, కలెక్టర్**

**ప్రధాని మోడీ దిగ్భ్రాంతి.. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు రూ. 50 వేలు పరిహారం**

నేడు పాశమైలారానికి సిఎం రేవంత్



సోమవారం పటాన్ చెరు మండలం పాశమైలారం 'సిగాచి' ప్లాంట్‌లో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

**హైదరాబాద్ (పటాన్ చెరు), జూన్30, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం పాశమైలారం పారి శ్రామికవాడలో సోమవారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. సిగాచీ రసాయన పరిశ్రమలో పాశమైలారం సిగాచి కెమికల్స్‌లో ఎయిర్ డ్రయ్యర్ ప్రెషర్ తోటే పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో 15మంది కార్మికులు

>>2

# బనకచర్ల వెనక్కి!



**పర్యావరణ అనుమతి 'నో'**

**తెలంగాణ ప్రభుత్వం ఆందోళనపై కేంద్రం సానుకూల నిర్ణయం**

'సుప్రీం' గత ఆదేశాలు పేర్కొంటూ కేంద్ర జలశక్తి శాఖకు మంత్రి ఉత్తమ్ ఇటీవల లేఖ

**ఎపి ఇచ్చిన డిపిఆర్‌కు ఒప్పుకోవద్దని కేంద్రాన్ని కోరిన తెలంగాణ సర్కార్**

**హైదరాబాద్, జూన్ 30,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇవ్వలేమని కేంద్ర పర్యావరణశాఖ తెలిపింది. కేంద్ర పర్యావరణం,అడువులు,వాతావర్ణం మార్పులు శాఖ ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ చైర్మన్ జె.చక్రపాణి సెక్రటరీ యోగేంద్రపాల్‌సింగ్,సిడబ్ల్యుసి ప్రతినిధి బలరామ్‌కుమార్,సభ్యులు రాకేష్‌గోయల్‌అజయ్‌కుమార్ లాల్,కార్తీక్‌సపరే, జేవి త్యాగి,ఆర్‌వై ఉదయ్‌కుమార్‌లు సమావేశమై తెలంగాణ ప్రభుత్వం వ్యక్తపరిచిన ఆందోళనపై సానుకూలమైన నిర్ణయం తీసుకొంది. పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు ఏలాంటి పర్యావరణ అనుమతులు ఇవ్వొద్దని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జూన్16న కేంద్ర పర్యావరణ మంత్రి భూపేంద్రయాదవ్‌కు లేఖ రాశారు.2022 సెప్టెంబర్ 6న సుప్రీం కోర్టు గోదావరి పరివాహక రాష్ట్రాలు,కేంద్రజలశక్తి, పర్యావరణ మంత్రిత్వశాఖలు సంయుక్తంగా సమావేశమై పర్యావరణంకు కలిగే ముప్పును చర్చించి ముందుకు పోవాలని సూచించిందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన లేఖలో కేంద్ర పర్యావరణమంత్రికి ఎత్తిచూపారు.పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నేషనల్ ప్రాజెక్టుగా ప్రకటించడంపై ఒడిశా,చత్తీస్‌ఘడ్,తెలంగాణ సుప్రీంకోర్టులో వాజ్యం వేశాయని కోర్టుపరిధిలో ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణంకోసం మొత్తం గోదావరి జలవివాదల ట్రిబ్యునల్ అవార్డును ఉల్లంఘిచి కడుతోందని దీనిని నిలిపివేయాలని కేంద్ర అడువులు,పర్యావరణ మంత్రిత్వశాఖకు కూడా 2025 అక్టోబర్ 23న అభ్యర్థించామని 2011ఫిబ్రవరిలో 8 పనులు నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్‌కు ఆదేశాలు వచ్చాయని తెలిపారు.

>>2

# చార్జీల మోత




**వందే భారత్ సహా అన్ని ఎక్స్‌ప్రెస్ రైలు చార్జీలు పెంపు**

ఎసి, జనరల్ క్లాసు రేట్లు మార్పు

సబర్బన్, సీజన్ టిక్కెట్లు యధాతథం

నేటి అర్ధరాత్రి నుంచి అమలులోకి

**హైదరాబాద్ (తార్నాక), జూన్ 30 ప్రభాతవార్త:** భారతీయ రైల్వే టికెట్ల ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. పెంచిన టికెట్ల ధరలు జులై ఒకటి అర్ధరాత్రి నుంచి అమలులోకి రానున్నాయి. టికెట్ల ధరల పెంపుపై రైల్వే బోర్డు అన్ని జోన్లకు సర్క్యులర్‌ను సోమవారం జారీ చేసింది. రైలు చార్జీల పెంపు మెయిల్, ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు వర్తించనున్నది. పెరిగిన ధరలు జులై ఒకటి నుంచి అమలులోకి వస్తాయని ఇప్పటికే రైల్వే బోర్డు ప్రకటించింది. రైల్వే మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం. పెరిగిన ఛార్జీ జనరల్, స్లీపర్, ఏసీ క్లాస్లకు వర్తించనున్నది. ఏసీ చైర్ క్లాస్, ఏసీ త్రీ టైర్, త్రీ టైర్ ఎకానమీ, ఏసీ టూ టైర్, ఏసీ ఫస్ట్ క్లాస్, ఎగ్జిక్యూటివ్ క్లాస్ లల్లో కిలోమీటరుకు 2 పైసలు పెంచుతున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. నోటిఫికేషన్ ప్రకారం, ఏసీ కోచ్ లతో పాటు, నాన్ ఏసీ కోచ్‌ల ఛార్జీ కూడా పెరిగింది. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సెకండ్, స్లీపర్, ఫస్ట్ క్లాస్ నాన్‌ఏసీ కోచ్‌ల ఛార్జీని కిలోమీటరుకు ఒక పైసా పెరిగింది. జనరల్ క్లాస్‌లో కిలోమీటరుకు అర పైస పెంపు ఉంటుంది. జనరల్ కోచ్లో సెకండ్ క్లాస్ ఆర్డినరీలో 500 కిలోమీటర్ల వరకు చార్జీల పెంపు ఉండదని

>>2

# రాంచందర్‌రావే బిజెపి సారథి



సోమవారం పార్టీ కార్యాలయం వద్ద రాంచందర్‌రావు

**పార్టీ అధ్యక్ష పదవికి ఒకే నామినేషన్.. ఏకగ్రీవంగా ఎంపిక**

**నామినేషన్ దాఖలుకు ఎమ్మెల్యే రాజాసింగ్ విఫలయత్నం**

**చివరిదాకా వినిపించిన పేర్లలో ఈటల, లక్ష్మణ్, అరుణ**



సోమవారం హైదరాబాద్‌లో మీడియాకు రాజీనామా లేఖ చూపుతున్న రాజాసింగ్

2

**అయ్యా మీకో దండం.. మీ పార్టీకో దండం**

**బిజెపికి రాజాసింగ్ రాజీనామా**

**ఎమ్మెల్యేను సస్పెండ్ చేసే అవకాశం?**

**హైదరాబాద్, జూన్ 30 ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి ఉత్కంఠకు తెరపడింది. సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావును పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. ఈ మేరకు ఆయన నామినేషన్ దాఖలు చేయాల్సిందిగా అధిష్టానం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ గడువు ముగిసే సమయానికి ఒకే ఒక్క నామినేషన్ దాఖలు అయింది. దీంతో అధ్యక్షుని ఎన్నిక ఏకగ్రీవం అయింది. ఈ విషయాన్ని అధిష్టానం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఎంపిక మాత్రం లాంఛనమే అయింది. ఎమ్మెల్యే రాజాసింగ్ నామినేషన్ దాఖలు చేసేందుకు ప్రయత్నించారు. పలు కారణాల వల్ల ఆయన నామినేషన్ దాఖలు చేయాలేదు. కాగా అధ్యక్ష పదవి బిసిలకే కేటాయిస్తారని మొదట నుంచి ప్రచారం జరిగింది. ఈ క్రమంలో బండి సంజయ్, అరవింద్, ఈటల రాజేందర్, డాక్టర్ లక్ష్మణ్. పాయల్ శంకర్ పేర్లు వినిపించాయి. దీనికి తోడు డికె అరుణ, రాంచందర్ రావుకు కూడా చాన్స్ ఉందనే ప్రచారం కూడా జరిగింది. పార్టీ విధేయతతో పాటు, ఆర్‌ఎస్‌ఎస్ తో అనుబంధం ఉన్న రాంచందర్ రావుకే ప్రాధాన్యం దక్కింది. సీనియర్ నేతలు పాటు ఎవరూ ఊహించని విధంగా ఒక్కసారిగా రాంచందర్‌రావు పేరు తెరపైకి వచ్చింది. ప్రధానంగా ఆర్‌ఎస్‌ఎస్ నేతలు ఆయన పేరును బలంగా ప్రతిపాదించినట్లు తెలిసింది. ఈ క్రమంలో అధిష్టానం ఆయన్ను ఫైనల్ చేసింది. ఒక్కరే నామినేషన్ దాఖలు చేయాలని ఆదేశించడంతో ఆయన మాత్రం నామినేషన్ దాఖలు చేశారు. ఎన్ రాంచందర్ రావు 1959 ఏప్రిల్ 27న హైదరాబాద్‌లో జన్మించారు. రైల్వే డిగ్రీ కాలేజీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడిగా పనిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీ, స్టూడెంట్స్

>>2

# ఈ యేడాది పాత ఫీజులే


ఇంజనీరింగ్‌తోపాటు ఇతర వృత్తి విద్య కోర్సులకు వర్తింపు

**అధికారుల కమిటీ ప్రతిపాదనల మేరకు ఫీజులు నిర్ణయం**




**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్‌తో పాటు ఇతర వృత్తి విద్య కోర్సులకు 2022-25 బాక్ పిరియడ్ ఫీజులను కొనసాగించనున్నారు. ప్రభుత్వం నియమించే అధికారుల కమిటీ నివేదిక మేరకు తదుపరి సంవత్సరాలకు ఫీజులను నిర్ణయించనున్నారు. ఇందుకు సంబంధించి ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్య ఫీజులపై ప్రభుత్వం స్పష్టత ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను విద్య శాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా సోమవారం జీవో ఎంఎస్ నంబర్ 26ను జారీ చేశారు. రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీల్లో బిఇ,బిటెక్, ఎంఈ, ఎంటెక్, బిఆర్క్, ఎంఆర్క్, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఫార్మా-డి అండ్ ఫార్మ్‌డి(పిబి), ఎంబిఏ, ఎంసిఏ, ఎంబిఏ ఇంటిగ్రేటెడ్, బి ఒకేషనల్ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో గత బ్లాక్ పిరియడ్ 2022-25లో నిర్ణయించిన ఫీజులనే కొనసాగించాలని నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2025-28 బ్లాక్ పిరియడ్‌కి సంబంధించి ఫీజుల ప్రతిపాదనల కోసం తెలంగాణ అడ్మిషన్, ఫీజు రెగ్యులేటరీ

>>2



'ఫార్ములా' కేసు:

# నేడు అర్వింద్ విచారణ

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో నిందితుడుగా వున్న సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్ మంగళవారం నాడు ఎసిబి విచారణకు హాజరు కానున్నారు. ఇందుకు సంబంధించి వారం రోజుల క్రితం ఎసిబి అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేయడం తెలిసిందే. ఈ సమయంలో ఆయన విదేశీ పర్యటనలో వుండడంతో విచారణకు హాజరయ్యేందుకు గడువు కోరారు. అయితే మంగళవారం నాటి విచా రణకు అర్వింద్ కుమార్ హాజరయ్యేది అనుమానంగానే వుందని తెలుస్తోంది. ఒకవేళ ఆయన రాకుంటే మరోసారి విచారణకు పిలిచే వీలుంది. ఈ కేసులో ఇంత కు ముందు ఒకసారి ఎసిబి అధికారులు అర్వింద్ కుమార్ వాంగ్మూలం నమోదు చేయడం తెలిసిందే. దీని ఆధారంగానే నాటి మంత్రి బిఆర్‌ఎస్ నాయకుడు కెటి ఆర్‌ను ఎసిబి అధికారులు ఇటీవలే ప్రశ్నించారు.

# బిడ్డల జీతాల్లో 15% తల్లిదండ్రులకే

వృద్ధులకు సాయం కోసం ప్రభుత్వం యోచన

**నివేదిక సమర్పించాలని అధికారులకు సిఎం రేవంత్ ఆదేశం**

దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ అంగన్‌వాడీలు


సంక్షేమ శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి



సోమవారం సంక్షేమశాఖపై సమీక్ష చేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు పొన్నం, సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్30:** ఉద్యోగాలు చేస్తున్న పలువురు తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని, అటువంటి వృద్ధులకు ప్రభుత్వం అండగా నిలవాల్సి ఉందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల వేతనాల నుంచి నేరుగా వారి తల్లిదండ్రులకు ఖాతాలకు 10-15 శాతం జమ అయ్యే అంశాన్ని పరిశీలించాలని ఒక నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు. తెలంగాణ అంగన్‌వాడీలు దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచేలా తీర్చిదిద్దాలని.. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు అయిదేళ్ల వరకు వారికి పూర్వ ప్రాథమిక విద్యను అందించి నేరుగా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేలా చూడాలని సీఎం సూచించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారిత శాఖలపై తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీలకు నూతన భవనాలు నిర్మించే విషయంలో అధునాతన సాంకేతికతను వినియోగించుకోవాలని, పిల్లల అవసరాలకు తగినట్లు కంటైనర్లతో డిజైన్ చేయించే అంశాన్ని అధ్యయనం చేయించాలని సీఎం పేర్కొన్నారు. సోలార్ ప్లేట్లు, బ్యాటరీ బ్యాకప్‌తో కంటైనర్ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తే తక్కువ వ్యయం, ఎక్కువ సౌకర్యం ఉంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో ఉన్న కంటైనర్ కేంద్రాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సీఎం సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రతి పిల్లవానికి పౌష్టికాహారం అందించాలని, ఇందుకు ఎన్జీవోల సేవలు వినియోగించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బాలామృతం ప్లస్‌ను పెద్ద మొత్తంలో ఇచ్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. కర్ణాటకలో జొన్న రొట్టెలను వినియోగిస్తున్నారని, పౌష్టికాహార నిపుణులతో చర్చించి వాటిని మహిళా సంఘాలతో పిల్లలకు అందించే అంశంపైనా దృష్టిసారించాలని సీఎం తెలిపారు.అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందజేత, అంగన్‌వాడీల పర్యవేక్షణ, నిర్వహణపై వంద రోజుల కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం విషయంలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు కలిసే పని చేయాలని సీఎం అన్నారు. అనాథ పిల్లలకు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కల్పిస్తున్నారని, అదే సమయంలో ఏటీసీల్లోనూ వాళ్లకు ప్రవేశాలు కల్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. మన పిల్లలను సింగపూర్‌లోని నైపుణ్య శిక్షణ కేంద్రాలకు పంపే ఒప్పందం చేసుకున్నామని, అక్కడకు పంపే వారిలో అనాథ పిల్లలకు చోటు కల్పించాలని సీఎం ఆదేశించారు. ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని మురికివాడలు, వలస కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని పిల్లల కోసం

>>2



# కాళేశ్వరం కీలక ఫైళ్లు మాయం?

**జలసౌధలో ఎటువంటి వివరాలు లేవని సమాచారం**

**హైదరాబాద్,జూన్30,ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన పలు డాక్యుమెంట్లు మాయమైనట్లు తెలుస్తుంది. జలసౌధలో కాళేశ్వరం ప్రాజెక్టు సంబంధించిన వివరాలు ఏవీ లేనట్లు ఇంజనీరు అధికారులు అశక్తత వ్యక్తం చేస్తున్నారని వినికిడి. జూన్ 30వ తేదీతో గడువుతో ముగిసిపోయిన కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ అడుగుతున్న పలు డాక్యుమెంట్లు ఇచ్చేందుకుతమకు మరికొంత సమయం ఇవ్వాలని ఉన్నతాధికారులను ఇరిగేషన్ అధికారులు కోరినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పరిధిలో పని చేసిన ఈఎన్‌సీల నుంచి వివరాలు సేకరించేందుకు తమకు సమయం పడుతుందని ఉన్నతాధికారులకు ఇరిగేషన్ అధికారులు స్పష్టం చేశారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కేబినెట్‌లో జరిగిన చర్చపై

>>2

## భోపాల్ గ్యాస్ వ్యర్థాల తొలగింపు ప్రక్రియ పూర్తి

5




సోమవారం కోల్‌కతాలో ఆందోళన చేస్తున్న జూనియర్ లాయర్లు

## సహాయక చర్యల పర్యవేక్షణకు
# సిఎస్ నేతృత్వంలో కమిటీ
### నేడు పాశమైలారం వెళ్లనున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్30:** సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలో జరిగిన ఘోర ప్రమాదం పై ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సహాయక చర్యలను ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు అక్కడున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు అక్కడ జరుగుతున్న సహాయక చర్యలపై ముఖ్యమంత్రి డీజీపీ, సీఎస్‌తో సమీక్ష నిర్వహించారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న సహాయక చర్యలను నిరంతరాయంగా కొనసాగించేందుకు, వాటిని పర్యవేక్షించేందుకు ప్రభుత్వం తరఫున ఒక కమిటీని ఏర్పాటు చేశారు. సీఎస్ రామకృష్ణారావు అధ్వర్యంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ సీఎస్, లేబర్ డిపార్టుమెంట్ పీఎస్, హెల్త్ సెక్రెటరీ, ఫైర్ సర్వీసెస్ అడిషనల్ డీజీని ఈ కమిటీలో సభ్యులుగా నియమించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలను సిఫారసు చేసే బాధ్యతలను ఈ కమిటీకి అప్పగించారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు, మంగళవారం ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాశమైలారంలో ప్రమాదం జరిగిన ఘటన స్థలానికి వెళుతారు.

## గ్రూప్1 పిటిషన్లపై హైకోర్టులో విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్30:** తెలంగాణ హైకోర్టులో సోమవారం గ్రూప్ 1 పిటిషన్లపై విచారణ జరిగింది. టిజిపిఎస్‌సి నిర్వహించిన గ్రూప్1 మెయిన్స్ పరీక్ష సమాధాన పత్రాల మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై సోమవారం విచారణ జరగగా.. ఈ విచారణ మంగళవారం కూడా కొనసాగనుంది. పరీక్ష కేంద్రాల కేటాయింపు, హాల్ టికెట్ నంబర్ల మార్పిడి, పేపర్ వాల్యుయేషన్ ప్రక్రియలో అవకతవకలు వంటి అక్రమాలు జరిగాయని.. పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని పిటిషన్లో కోరారు. అయితే గ్రూప్ 1 నియామక ప్రక్రియను గతంలోనే హైకోర్ట్ తాత్కాలికంగా నిలిపివేసింది. కానీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుపుకోడానికి అనుమతించింది.

## ఎస్సై భార్య ఆత్మహత్య!

**ఖమ్మం / రఘునాథపాలెం, జూన్30, ప్రభాత వార్త:** రఘునాథపాలెం మండలానికి చెందిన జిఆర్పి ఖమ్మం ఎస్సై రాణా ప్రతాప్ భార్య రాజేశ్వరి ఆత్మహత్య కు పాల్పడ్డారు.కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి పోలీసులు దర్యాప్తం చేస్తున్నారు.

# చార్జీల మోత

>> రైల్వేశాఖ తెలిపింది. 501 కిలోమీటర్ల నుంచి 1500 కిలోమీటర్ల వరకు రూ.5.. ఇక 1501 కిలోమీటర్ల నుంచి 2055 కిలోమీటర్ల వరకు రూ.10 పెరగనుండగా.. 2501 కిలోమీటర్ల నుంచి 3వేల కిలోమీటర్ల వరకు రూ.15 చార్జీ పెంచింది. మరో వైపు ఫస్ట్ క్లాస్, స్లీపర్ క్లాస్లో కిలోకు మీటర్‌కు అరపైసా వైపు ఫస్ట్ క్లాస్, స్లీపర్ క్లాస్లో కిలోకు మీటర్కు అరపైసా పెరిగింది. అయితే, స్థానిక, సీజనల్ టికెట్లపై ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొం ది. స్థానిక రైళ్లు, ఎంఎస్టీ హోల్డర్ల ప్రయాణికు లకు రైల్వే ఉపశమనం కల్పించింది. రైల్వేలు సబర్బన్, సీజన్ టిక్కెట్ల ఛార్జీలను పెంచలేదు. ఎంఎస్టీ, క్యూఎస్టి ప్రయాణికులపై పెరిగిన చార్జీల ప్రభావం ఉండదని పేర్కొంది.ఇదిలా ఉండగా.. రైల్వే పరిధిలోని అన్ని ప్రీమియం రైళ్లలో టికెట్ల ధరలు పెరిగాయి. తేజస్, రాజధాని, శతాబ్ది, దురంతో, వందే భారత్, హమ్సఫర్, అమృత్ భారత్, మహామన, గతి మాన్, అంత్యోదయ, గరీబ్ రథ్, జన శతాబ్ది, యువ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లలో సాధారణ సర్వీసుల (నాన్‌సబర్బన్), అనుభూతి కోచెస్, ఏసీ విస్టాడోమ్ కోచ్లలో తరగతి వారీగా చార్జీలను సవరించింది. ఈ చార్జీలు జులై ఒకటి నుంచి అమలులోకి రానున్నాయి. అయి తే, జూన్ 30వ తేదీ వరకు బుక్ చేసుకున్న టికెట్ల ధరలపై ఎలాంటి ప్రభావం ఉండదని.. ఒకటి తర్వాత ప్రయాణం చేసినా ఎలాంటి అదనపుచార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని రైల్వేశాఖ వర్గాలు తెలిపాయి. పెరిగిన చార్జీలు జులై ఒకటి నుంచి బుక్ చేసుకునే టికెట్లకే వర్తిస్తుందని రైల్వేశాఖ స్పష్టం చేసింది.

# కీలక ఫైళ్లు మాయం?

>> రికార్డులను ఆర్థిక శాఖ, సాధారణ పరి పాలన శాఖ ఉన్నతాధికారులు వెలికి తీసినట్లు సమాచారం. అయితే జస్టిస్ పిసిఘోష్ కమిషన్‌కు ఫిజికల్ డాక్యుమెంట్లను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాణహిత తుమ్మడిహట్టి స్థలం మార్పుచేసికట్టిన కాళేశ్వరంలోని మేడిగడ్డ బ్యారేజి 2023 అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందు కుంగిపోయింది. దీని కారణంగా ఆపార్టీ అధికారం కోల్పోయింది. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదీనిపై పిసిఘోష్ కమీషన్ వేశారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, ఈటల రాజేందర్‌లతోపాటు అనేక మంది ఐఎఎస్,రిటైర్డు ఐఎఎస్, ఇంజనీర్లు, రిటైర్డు ఇంజనీర్లను కాంట్రాక్టుకంపెనీలను ఇప్పటికే విచారణ చేసింది. తుదిదశలో విచారణ ఉంది. ఇలాంటిసమయంలో కీలకమైన ఫైళ్ళు గల్లంతు కావడం ఆందోళనకలిగిస్తున్నదని ప్రజలు అనుకుంటున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 01-07-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
షష్ఠి ఉ.10.23
పూర్వఫల్గుణి ఉ.8.55
వర్జ్యం సా.4.47-6.32
దు.ఉ.8.16-9.08, 2) రా.11.59-12.51
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. సంతానం నూతన విద్యావకాశాలు పొందుతారు

**వృషభం :** ఉద్యోగాలలో పదోన్నతులు పొందుతారు. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ధన,వస్తు లాభాలు..

**మిథునం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**కర్కాటకం:** ఆరోగ్యం, వాహనాల విషయాలలో నిర్లక్ష్యం తగదు. రాజకీయ, పారి శ్రామిక కళారంగాలలోని వారికి కొంత అనుకూలం.

**సింహం :** భాగస్వామ్య వ్యాపారాలలో లాభాలు పొందుతారు. పట్టుదలతో ముందుకుసాగుతారు. వాహనసౌఖ్యం.

**కన్య :** పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. నూతన మిత్రులు పరిచయమై సహాయ సహకారాలు అందిస్తారు

**తుల :** గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. నూతన ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

**వృశ్చికం:** పెట్టుబడులలో తొందరపాటు వద్దు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

**ధనుస్సు:** కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకొంటారు. ఇంటర్వ్యూలు, పోటీపరీక్షలకు హాజరుతారు.

**మకరం:** గృహనిర్మాణ ఆలోచనలలో తొందరపాటు వద్దు. ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**కుంభం :** శ్రమ తప్ప ఫలితం అంతగా ఉండదు. కొత్త కార్యక్రమాలు చేపట్టినా ముందుకు సాగవు. స్వల్పధనలాభం.

**మీనం :** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో ప్రోత్సాహకరంగా వుంటుంది. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అయ్యా మీకో దండం.. మీ పార్టీకో దండం
## బిజెపికి రాజాసింగ్ రాజీనామా

**హైదరాబాద్, జూన్ 30 ప్రభాతవార్త:** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ బిజెపికి రాజీనామా చేశారు. రాజీనామా తన లేఖ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపించారు. రాష్ట్ర ఎన్నికల చీఫ్ ఎన్నిక తీరును తప్పు పడుతూ వీడియో విడుదల చేశారు. అయ్యా మీకో దండం, మీ పార్టీకో దంటూ అంటూ వీడియోను విడుదల చేశారు. నావాడు నీవాడు అనే ధోరణితో పదువులు ఇచ్చుకుంటూ పోతే పార్టీకి తీవ్ర నష్టం తప్పదన్నారు. తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావాలంటే అధ్యక్ష పదవికి ఖచ్చితంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు.
అధ్యక్ష పదవికి నామినేషన్ చేసేందుకు వచ్చిన రాజాసింగ్ పార్టీ కార్యాలయానికి వచ్చారు. పార్టీ కార్యాలయానికి వచ్చిన రాజాసింగ్‌కు ఊహించని పరిణామాలు ఎదురయ్యాయి. అధ్యక్ష పదవికి నామినేషన్ వేసే సమయంలో అనుకోని పరిస్థితులు ఎదురు కావడంతో రాజీనామా చేశారు. రాజీనామా విషయంలో పలువురు నేతలు బుజ్జగింపులు చేసినప్పటికీ ఫలించలేదు. తాను అధ్యక్ష పదవిని నామినేషన్ వేసేందుకు పార్టీ ఆఫీసుకు వచ్చానని తనకు మద్దతు నిలిచిన వారిని కొందరు బెదిరించారంటూ రాజాసింగ్ ఆరోపించారు. తనకు మద్దతుగా ముగ్గురు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సంతకం చేశారని అన్నారు. పలువురు నేతలు వాళ్లకు ఫోన్ చేసి పార్టీలో ఉంటావా? సస్పెండ్ చేయాలా అంటూ బెదిరించారని ఆరోపించారు. పదిమంది సంతకం చేసిన తరువాత ఎన్నికల అధికారి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ వారు అప్పటికే రాష్ట్ర అధ్యక్షుడిని ఫైనల్ చేసుకున్నారని ఆరోపించారు. బిజెపికి అధికారం రావద్దనుకునే వారి సంఖ్య పెరిగిందన్నారు. తనకు మద్దతుగా నిలిచిన వారందరికి దన్యవాదాలు అంటూ పేర్కొన్నారు.

**రాజాసింగ్‌ను సస్పెండ్ చేసే అవకాశం?**

బిజెపికి రాజీనామా చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యవహార శైలిపై ఆ పార్టీ అగ్ర నాయకత్వం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. అయితే రాజాసింగ్ రాజీనామాను ఆమోదించడం గానీ పార్టీ నుంచి సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. రాజాసింగ్ రాజీనామా నేపత్యంలో కీలక నేతలు సునీల్ బన్సాల్, అభయ్ పాటిల్ రంగంలోకి దిగి రాజాసింగ్‌ను బుజ్జగించే ప్రయత్నం చేసినప్పటికీ రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలపై అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే రాజాసింగ్ చేసిన రాజీనామా లేఖను జాతీయ నాయకత్వానికి రాష్ట్ర నాయకత్వం పంపిందని తెలుస్తుంది. అధ్యక్ష ఎన్నికల వేళ నామినేషన్ అడ్డుకోవాలనుకుంటే తాము నామినేషన్ పత్రాలే రాజాసింగ్‌కు ఇచ్చే వారమే కాదని అగ్రనాయకత్వం వివరణ ఇచ్చినట్లు సమాచారం.

**అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ పార్టీ నియమావళికి అనుగుణంగానే జరిగింది:పాయల్ శంకర్**

బిజెపి రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ పార్టీ నియమావళికి అనుగుణంగానే జరుగుతుందని, రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలో మిగతా వారికి నామినేషన్ అవకాశం ఇవ్వలేదని కొన్ని వర్గాలు, మీడియాలో వచ్చిన వార్తలను పూర్తిగా ఖండిస్తున్నామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. నామినేషన్ విషయంలో జరిగిందంతా తప్పుడు ప్రచారమే తప్ప వాస్తవం కాదని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా, పార్టీకి చెందిన అర్హులైన ఏ నాయకుడైనా నామినేషన్ వేసేందుకు కేంద్ర పరిశీలకులుగా వచ్చినవారు తగిన అవకాశాన్ని కల్పించారని అన్నారు.

# రాంచందర్‌రావే బిజెపి సారథి

>> యూనియన్ కార్యదర్శిగా సేవలందించారు. తర్వాత బిజెవైఎం తొలి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఎల్ఎల్‌బి పట్టభద్రుడైన ఆయన హైకోర్టు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. చాలా కాలం పాటు పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ గా, జాయింట్ కన్వీనర్‌గా సేవలందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బిజెపి అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. తర్వాత బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా కూడా విధులు నిర్వర్తించారు. 2015 నుంచి 2021 వరకు పట్టభద్రుతల ఎమ్మెల్సీగా మండలిలో గళం వినిపించారు.

1986లో అడ్వకేట్‌గా ప్రాక్టీస్ ప్రారంభించిన ఆయన, జిల్లా కోర్టులు, నాంపల్లి మెట్రోపాలిటన్ కోర్టులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయ సేవలందించారు. 2012లో హైకోర్టు ఆయనను సీనియర్ అడ్వకేట్‌గా గుర్తించింది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో, హైకోర్టులు, ట్రిబ్యూనల్స్‌లలో క్రిమినల్, సివిల్, రాజ్యాంగ సంబంధిత కేసుల్లో ప్రాక్టీస్ చేస్తున్నారు. ప్రజల పక్షాన అనేక కేసులు వాదించి గెలిచారు. ఇక బిజెపి నేతలకు న్యాయ సహాయం విషయంలో రామచంద్రరావు ఎప్పుడూ ముందుండే వారు. ప్రజా సమస్యలపై, పార్టీ కార్యక్రమాల్లో భాగంగా ఉద్యమాలు చేసి జైలు పాలైన బీజేపీ నేతల పక్షాన న్యాయపోరాటం చేసి జైలు నుండి బయటకు తీసుకురావడంలో ప్రధాన పాత్ర పోషించారు.

ప్రత్యక్ష రాజకీయాల విషయానికొస్తే...

1986లో బిజెపిలో చేరి హైదరాబాద్‌లోని రవీంద్రనగర్ డివిజన్ నుండి కార్పొరేటర్‌గా పోటీ చేశారు. బిజెవైఎం రాష్ట్ర కార్యదర్శిగా (1980-82), నగర ఉపాధ్యక్షుడిగా (1986-90) పనిచేశారు. బిజెపి రాష్ట్ర లీగల్ సెల్‌లో రామచంద్రరావు క్రియాశీల పాత్ర పోషించారు. లీగల్ సంయుక్త కన్వీనర్ (1999-2003), కన్వీనర్ (2003-06)గా బాధ్యతలు నిర్వర్తించారు. జాతీయ లీగల్ సెల్ సంయుక్త కన్వీనర్ (2006-10), బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా (2007-09), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా (2009-12), ముఖ్య అధికార ప్రతినిధిగా (2012-15) పనిచేశారు. 2015లో హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుండి శాసనమండలి సభ్యుడిగా ఎన్నికై 2021 వరకు ఫ్లోర్ లీడర్గా సేవలందించారు. బిజెపి హైదరాబాద్ నగర అధ్యక్షుడిగా కూడా సేవలందించారు.

రామచంద్రావు పార్టీలో, బయట కలుపుగోలు మనిషిగా పేరుంది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరితో నవ్వుతూ సఖ్యతగా మాట్లాడే నాయకుడు అంటారు. పాత, కొత్త తరం నాయకులందరినీ కలుపుకుపోయే వ్యక్తిత్వం ఆయన సొంతం. రామచంద్రరావు ఎక్కడ ఉంటే అక్కడ నవ్వులుంటాయని, టెన్షన్ మటుమాయమవుతుందని పార్టీ నేతలంతా సరదాగా వ్యాఖ్యానిస్తుంటారు. విధేయతకు కేరాఫ్ అడ్రస్ గా రామచంద్రరావు నిలుస్తారని, హైకమాండ్ ఒక పని అప్పగించిందంటే అది పూర్తి చేసేదాకా కష్టపడతారని ఆయన సన్నిహితులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇన్ని సుగుణాలు, రాజకీయ నేపథ్యం ఉన్నందునే పార్టీ జాతీయ నాయకత్వం రామచంద్రావుకు రాష్ట్ర పగ్గాలు అప్పగించేందుకు సిద్ధమైందని, దీనిని దృష్టిలో ఉంచుకునే పార్టీలోని సీనియర్ నేతలంతా ఆయనకు సంపూర్ణంగా మద్దతు పలికారని పార్టీ వర్గాలు పేర్కొనడం గమనార్హం.

## నేడు బిజెపి అధ్యక్షుడిని అధికారికంగా
## ప్రకటించనున్న అధిష్ఠానం

**హైదరాబాద్, జూన్ 30 ప్రభాతవార్త:** రాష్ట్ర బిజెపి అధ్యక్షుడి ఎన్నిక కోసం సోమవారం నామినేషన్‌లను స్వీకరించడం జరిగిందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడితో పాటు జాతీయ కౌన్సిల్ సభ్యుల ఎన్నికల నామినేషన్లు కూడా స్వీకరించారని తెలిపారు. సంస్థాగత ఎన్నికల ప్రక్రియ భాగంగా, కేంద్రమంత్రి, సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి శోభా కరంద్లాజే మంగళవారం ఉదయం 10 గంటలకు మన్నెగూడలోని వేద కన్వెన్షన్ సెంటర్లో తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక, జాతీయ కౌన్సిల్ సభ్యుల ఎన్నికలకు సంబంధించిన అధికారిక ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, రాష్ట్ర, జాతీయ కౌన్సిల్ సభ్యులు హాజరవుతున్నారని తెలిపారు.

# బనకచర్ల వెనక్కి!

>> పోలవరంబనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం ముందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ముందస్తు సాధ్యత నివేదికతో ప్రతిపాదనలు తీసుకెళ్లింది. పోలవరం నుంచి బనకచర్లకు నీటి తరలింపు ప్రాజెక్టుపై కేంద్ర ఆర్థిక శాఖకు రాష్ట్ర అధికారులు సుమారు 2 గంటలపాటు వివరించారు. రూ.81,000 కోట్లతో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుతో రైతులు, ప్రజలకు కలిగే ప్రయోజనాలను ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర ఆర్థిక, నీటిపారుదల శాఖ అధికారులు కేంద్రానికి ఆంధ్రప్రదేశ్ వివరించింది.మే నెలలో జరిగిన భేటీల్లో ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనలపై పూర్తి వివరాలు ఇవ్వాలని గతంలో కేంద్ర ఆర్థిక శాఖ కోరింది. ఈ క్రమంలో ఇవాళ మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి అజయ్ సేత్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి పీయూష్ కుమార్, నీటిపారుదల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆయన సిడబ్ల్యుసికి డిపిఆర్ ఇవ్వాలని సూచించడంతో ఉత్తమ్ కుమార్‌రెడ్డి కేంద్రజలశక్తి మంత్రి డిపిఆర్‌ను ఒప్పుకోవద్దని టెండర్లు నిర్వహించకుండా అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ లేఖ రాశారు.

## బనకచర్లపై కేంద్ర నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: హరీష్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్30:** ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని కేంద్రం ఏపీకి తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. పర్యావరణ అనుమతులు ఇచ్చేది లేదని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ తేల్చి చెప్పడాన్ని స్వాగతిస్తున్నట్లు బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. ఈ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న సమయంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇటు రాష్ట్ర ప్రభుత్వాన్ని,అటు కేంద్ర ప్రభుత్వాన్ని పూర్తి వివరాలు,ఆధారాలతో నిలదీయడం వల్లే కేంద్రం దిగివచ్చిందని పేర్కొన్నారు.ఇది తమ పోరాటం విజయం. తెలంగాణ ప్రజల విజయమన్నారు. బనకచర్ల పేరిట తెలంగాణ గోదావరి జలాలను అక్రమంగా తరలించుకుపోయే ఏపీ కుట్రలకు ఇది చెంపపెట్టు అని చెప్పారు. తెలంగాణ నీటి హక్కులకు అన్యాయం చేసే విధంగా రూపొందించిన బనకచర్ల ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిలిపివేసే వరకు బిఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

## ఈ యేడాది పాత ఫీజులే

>> కమిటీ(టిఏఎఫ్ఆర్‌సి) జూన్ 18న జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఏఎఫ్ఆర్‌సి ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. 2025-28 బ్లాక్ పిరియడ్ కోసం ప్రైవేట్ అన్ ఎయిడెడ్ ప్రొఫెషనల్ కాలేజీలు చేసిన ప్రతిపాదనలు సుప్రీంకోర్టు, హైకోర్టులు సూచించిన పారామీటర్స్, నిబంధనలు, షరతులకు భిన్నంగా ఉన్నాయని తెలిపింది. ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ ప్రొఫెషనల్ కాలేజీలకు సంబంధించి ఫీజు స్థిరీకరణకు పారామితులను పరిశీలించడానికి, సవరించిన పారామితులను సూచించడానికి అలాగే ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న ప్రక్రియను సక్రమంగా అధ్యయనం చేయడానికి, సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అధికారుల కమిటీని నియమించవచ్చని ఏఎఫ్ఆర్‌సి సిఫారసు చేసింది.కమిటీ నివేదిక సమర్పించే వరకు.. 2022-25 బ్లాక్ పిరియడ్‌కు నిర్ణయించిన రుసుములే వర్తిస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం.. తెలంగాణఅడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ(టిఏఎఫ్ఆర్‌సి) (ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో అందించే ప్రొఫెషనల్ కోర్సుల కోసం) రూల్స్, 2006లోని రూల్ 4లోని సబ్‌రూల్(5) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ ఇంజనీరింగ్‌తోపాటు ఇతర వృత్తి విద్య కోర్సులకు 2022-25లో నిర్ణయించిన ఫీజులనే 2025-26 విద్యా సంవత్సరం వరకు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంతో జూన్ 28 నుంచి ప్రారంభమైన ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్‌కి ఎటువంటి ఆటంకం కలగకుండా కొనసాగే వీలు ఏర్పడింది. నేటి(జులై1-మంగళవారం) నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను ప్రారంభించనున్నారు. ఈ నెల 6 నుంచి వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు.



సోమవారం పటాన్ చెరు మండలం పాశమైలారం 'సిగాచి' ప్లాంట్ వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు



ఘటనాస్థలాన్ని సందర్శించిన మంత్రి వివేక్

# భగ్గుమన్న 'సిగాచి'

>> మృతిచెందగా... మరింత పెరిగే అవకాశం ఉంది.. ఇప్పటికే పదుల సంఖ్యలో తీవ్రగాయాలయ్యాయి. మంటల్లో ఐదుగురు కార్మికులు సజీవదహనమయ్యారు. ఇక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో పది మంది చనిపోయారు. పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారు. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా, మరో భవనానికి బీటలు వచ్చాయి. ఇంకా పరిశ్రమ లోపల మరికొందరు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అయితే కార్మికుల్లో పలువురు ఫోన్లు పనిచేయకపోవడంతో వారి కుటుంబ సభ్యుల్లో సైతం ఆందోళన నెలకొంది. గాయపడిన వారిని చందానగర్, ఇస్నాపూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. 11 ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు యత్నించారు.

**ఘటనాస్థలాన్ని సందర్శించిన మంత్రులు, ఎమ్మెల్యేలు....**

ప్రమాదం జరిగిన వెంటనే హుటాహుటీన మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామిలు సందర్శించి మృతుల కుటుంభాలను పరామర్శించారు. పేలుడులో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సాయాన్ని అందించాల్సిందిగా జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యేలు కుర సత్యనారాయణ, చంటి క్రాంతి కిరణ్, ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి, డిఐజి ఇక్బాల్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్, ప్రజాశాంతి అధ్యక్షుడు కేఏ పాల్ లు పరిశీలించారు. పరిశ్రమ నుంచి ఘాటైన వాసనలు వెలువడుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని విచారం వ్యక్తంచేశారు.కాగా పరిశ్రమలో గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితలు ప్రభుత్వాన్ని సూచించారు. అలాగే పటాన్‌చెరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను మాజీ మంత్రి హరీష్ రావు వారికి పరామర్శించారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు, గాయపడిన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండి న్యాయం చేయాలని ఆయన సూచించారు. పేలుడు జరిగిన సంఘటన స్థలాన్ని బీకాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్, పటాన్ చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కాట శ్రీనివాస్ గౌడ్, పటాన్ చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ జడ్పిటిసి గడీల శ్రీకాంత్ గౌడ్, మాజీ కార్పొరేటర్ తోట అంజయ్య, తదితరులు పరిశీలించారు.

**బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం : కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్**

రియాక్టర్ పేలుడుతో కాదని, ఎయిర్ ఫైర్ సిస్టమ్‌లో ప్రెషర్‌తోనే ప్రమాదం చోటు మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు, గాయపడిన కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ప్రభుత్వం తరఫున మెరుగైన ఎక్స్‌గ్రేషియా (సహాయ నిధి) అందించడంతో పాటు క్షతగాత్రులకు ఉత్తమ వైద్య సౌకర్యాలు కల్పిస్తాం. ఈ తరహా ఘటనలు మళ్లీ జరగకుండా పరిశ్రమల్లో అవసరమైన భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలుచేస్తాం. సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటన బాధాకరం, దురదృష్టకరం. వెంటనే పోలీస్, ఫైర్ సహా అన్ని డిపార్ట్‌మెంట్లు వేగంగా స్పందించి సహాయక చర్యలు చేపట్టాయి. మూడు అంతస్తుల భవనం కూలిపోయింది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటన సమయంలో సుమారు 65 మంది కార్మికులు ఉన్నారని అధికారులు చెబుతున్నారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నాం. వారికి పూర్తి చికిత్స ఉచితంగా అందించే బాధ్యత మా ప్రభుత్వానిది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని తెలిపారు. ప్రతి కార్మికుని కుటుంబాన్ని కాపాడుకునే బాధ్యత, ఆదుకునే బాధ్యత మా ప్రభుత్వానిది అన్నారు. ఇలాంటి దుర్ఘటనలను రాజకీయం చేసి, వ్యక్తిత్వం దిగజార్చుకోవద్దు. ఇలాంటి పరిస్థితుల్లో అందరం బాధితులకు అండగా ఉండాల్సిన బాధ్యత మనందరిది. పటాన్ చెరు, మదీనగూడలోని ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శించారు.

**అగ్ని ప్రమాదం..బాధకరం: నరేంద్రమోడీ, ప్రధాని**

అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారికి సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. మరణించిన ప్రతి ఒక్కరి బంధువులకు పిఎంఎన్ఆర్ఎఫ్ నుండి రూ.2 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటిస్తున్నాను. గాయపడిన వారికి రూ.50 వేల పరిహారం అందజేస్తాం.

**పరిశ్రమలో పేలుడు విషాదకరం: రాహుల్ గాంధీ**

పేలుడు సంభవించడం చాలా విషాదకరం. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.మృతులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తు న్నాను. రాష్ట్ర ప్రభుత్వం, పరిపాలన సహాయ, రక్షణ కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నాయి. బాధిత ప్రజలకు సాధ్యమైనంత సహాయం అందించడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ క్లిష్ట సమయంలో, మేము అన్ని విధాలుగా బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం. మృతుల కుటుంబాలకు నా సానుభూతిని తెలియజేస్తున్నాను. నా ఆలోచనలు, ప్రార్థనలు గాయపడిన వారితో ఉన్నాయి. వారు త్వరగా కోలుకోవాలని మేము కోరుకుంటున్నాము. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు వారి సహాయక చర్యలలో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. గాయపడిన వారికి తక్షణ వైద్య, ఇతర సహాయం అందిస్తున్నారు.

# జీతాల్లో 15% తల్లిదండ్రులకే

>> మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, నిర్దేశిత సమయంలో అక్కడి పిల్లలకు ఆయా వాహనాల ద్వారా పౌష్టికాహారం అందేలా చూడాలని సీఎం ఆదేశించారు.విశ్రాంత ఉద్యోగులు, ఐటీ ఉద్యోగులు ఆయా పిల్లలకు బోధన చేసేందుకు ఆసక్తి చూపితే అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. తెలంగాణ ఫుడ్స్, విజయా డెయిరీ ఉత్పత్తులను అంగన్‌వాడీలకు అందేలా చూడాలని సీఎం అన్నారు. ట్రాన్స్‌జెండర్లకు ప్రస్తుతం ట్రాఫిక్ విభాగంలో అవకాశం కల్పించామని,వారి సేవలను రవాణా, దేవాదాయ శాఖ, వైద్యారోగ్య శాఖలతో పాటు ఐటీ, ఇతర కంపెనీల సేవల్లో వినియోగించుకునేలా చూడాలని సీఎం ఆదేశించారు.తెలంగాణ రైజింగ్2047 డాక్యుమెంట్‌లో చిన్నారులు, మహిళలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై విధానాలు రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దివ్యాంగుల మధ్య వివాహాలు, వివిధ పథకాల్లో దివ్యాంగులకు ప్రోత్సాహకాలు కల్పించే విషయంపై అధ్యయం చేసి వచ్చే క్యాబినెట్ సమావేశం నాటికి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు.. సమీక్షలో మంత్రులుసీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ కార్యదర్శి చిత్రా రామచంద్రన్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సృజన, తెలంగాణ ఫుడ్స్ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సీ కులాల అభివృద్ధి, ట్రాన్స్‌జెండర్లసాధికారిత శాఖడైరెక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

# దోస్త్-2025 సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు పెంపు

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరం లో ప్రవేశాల నిర్వహించిన డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) సెల్ఫ్ రిపోర్టింగ్ గడువును పొడిగించారు. అలాగే కాలేజీల్లో చేరడానికి సైతం గడువును ఈ నెల 5 వరకు పెంచారు. దోస్త్ ద్వారా ఇప్పటి వరకు మూడు విడతల్లో సీట్లు పొందిన విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి గడువు సోమవారంతో ముగియగా దానిని కాస్త ఈ నెల 3 వరకు పొడిగించారు. సెల్ఫ్ రిపోర్టింగ్ ఇచ్చిన వారు కాలేజీల్లో చేరడానికి నేటి(మంగళవారం) వరకు ఉన్న గడువును కాస్త ఈ నెల 5 వరకు పొడిగిస్తున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, దోస్త్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు మూడు విడతలుగా డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించిన డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025 అడ్మిషన్ల ప్రక్రియ నేటితో ముగియనుండగా గడువును పొడిగించారు. మొదటి విడతలో 65వేల మందికి సీట్ల కేటాయింపు చేపట్టగా వారిలో సుమారు 43 వేల మంది కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ ఇచ్చారు. ఇక రెండో విడతలో 43వేల సీట్ల కేటాయింపు చేయగా.. మూడో విడతలో 85,680 మంది విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేశారు. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 30 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని .. నేటి వరకు కాలేజీల్లో చేరాలని ఉత్తర్వులు జారీ చేశారు. దోస్త్ మూడో విడత సీట్ల కేటాయింపును శనివారం విడుదల చేశారు. దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్‌లో భాగంగా 82,770 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మూడో విడతలో 96,015

## 3వ తేదీ వరకు అవకాశం.. కాలేజీల్లో 5 లోపు చేరాలి

మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 85,680 మందికి సీట్ల కేటాయింపు చేపట్టారు. తక్కువ ఆప్షన్లు ఇచ్చిన కారణంగా 10,335 మందికి మొదటి విడతలో సీట్ల కేటాయింపు చేయలేదు. మొదటి ప్రాధాన్యత ఇచ్చిన వారిలో 64,181 మందికి.. ద్వితీయ ప్రాధాన్యత ఇచ్చిన వారిలో 21,499 మందికి సీట్ల కేటాయింపు చేసినట్టు బాలకిష్టారెడ్డి తెలిపారు. మూడో విడత సీట్ల కేటాయింపులో కామర్స్ విద్యార్థులు 35,402 మందికి కేటాయించారు. లైఫ్ సైన్సెస్ 16,099 మందికి, ఫిజికల్ సైన్స్‌లో 20,890 మంది ఉన్నారు. మూడో విడతలో సీటు పొందిన వారు రూ. 500 ..రూ. 1000 ఫీజు చెల్లించి ఈ నెల 30 లోగా సీటు రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు మూడు విడతల్లోనూ సీట్లు పొంది సెల్ఫ్ రిపోర్టింగ్ చేయని వారు ఈ నెల 3లోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని.. ఈ నెల 5 వరకు కాలేజీల్లో చేరడానికి అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు.



## పాక్‌తో యుద్ధం ఆపిన మోడీ మావోయిస్టులపై కాల్పులు ఎందుకు ఆపలేరు?

### వారితో చర్చలు జరపాల్సిందే

### ఎల్‌బి స్టేడియాన్ని పరిశీలించిన పిసిసి చీఫ్ మహేష్‌కుమార్, మంత్రులు పొన్నం, వాకిటి

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** పాకిస్థాన్‌తో యుద్ధం ఆపిన మోడీ మావో యిస్టులపై ఎందుకు కాల్పుల విరమణ చేయడం లేదని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ నిలదీశారు. సోమవారం ఎల్బిస్టేడియాన్ని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, విహెచ్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, శాట్ ఛైర్మన్ శివసేన రెడ్డి, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ వైస్‌చైర్మన్ ఫహీం ఖురేషి సందర్శించారు. ఇక్కడ జూలై 4 జరిగే గ్రామస్థాయి అధ్యక్షుల సమావేశం ఏర్పాట్లను పరిశీలించారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఆ సభకు హాజరవుతుండటంతో సభకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు, స్టేజి, పార్కింగ్, వీఐపీ ఎంట్రన్స్ తదితర ఏర్పాట్లపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ అమిత్‌షా ఆయుధాలు చేతపట్టుకున్న వారితో చర్చలు జరపలేం అంటూనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశించారని అమాయకులు ప్రాణాలు బలిగొంటున్న పాకిస్థాన్‌లో శిక్షణ పొందుతున్న మిలిటెంట్లపై పోరాటం చేయకుండా యుద్ధం ఆపారని ఇదా వీరి ప్రభుత్వ విధానం అని నిలదీశారు.

**మావోయిస్టులను కేంద్రం నిర్ధాక్షిణ్యంగా చంపుతోంది : ఎంపి రేణుకాచౌదరి**

మావోయిస్టులను కేంద్రం నిర్దాక్షిణ్యంగా చంపుతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకు రాలు, కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ ఎంపి రేణుకా చౌదరి మండిపడ్డారు. కనీసం వారితో చర్చలు కూడా చేయడం లేదన్నారు. సోమ వారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి పాలన ఆదర్శంగా నిలిచిందని అన్నారు.

## రేవంత్‌రెడ్డి పాలనావైఫల్యం వల్లే గురుకులాలు నిర్వీర్యం

### మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 30:** బీఆర్ఎస్ పాలనలో దేశానికే ఆదర్శమైన గురుకులాలు, రేవంత్ రెడ్డి పాలనా వైఫల్యం వల్ల నిర్వీర్యం అవుతుండటం దారుణమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. విద్యావ్యవస్థ పట్ల కాంగ్రెస్ చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరి లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నదని సోమవారం ఎక్స్ వేదికగా ఆరోపించారు. రేవంత్ పాలనలో గురుకుల పాఠశాలలు, కళాశాలల పరిస్థితి రోజురోజుకు దిగజారుతుండటం శోచనీయమని వెల్లడించారు. జనవరి నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో కోడిగుడ్లు, మాంసం, అరటి పండ్ల సరఫరా నిలిచిపోయాయని చెప్పారు. బకాయిలు చెల్లించకుంటే జులై 1 నుంచి అన్ని రకాల ఆహార పదార్థాలు, ఇతర సామాగ్రి సరఫరాను నిలిపేస్తామని హెచ్చరించే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. మరోవైపు 13 నెలలుగా రూ.450 కోట్లకుపైగా అద్దె బకాయిలు చెల్లించక భవనాల యజమానులు తాళాలు వేస్తున్న దుస్థితి నెలకొన్నదని చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఇన్ని రోజులు అవుతున్నా ఇప్పటికీ యూనిఫాం, టై, బెల్ట్, బూట్లు, స్కూల్ బ్యాగులు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో యూనిఫామ్ ఇవ్వకపోవడంతో పిల్లలు పాత, చినిగిపోయిన దుస్తులు వేసుకుంటున్నారని తెలిపారు. పదేండ్లలో అద్భుతంగా నడిచిన గురుకులాల వ్యవస్థ, రేవంత్ పాలనలో కుదేలవుతుండటం దురదృష్టకరమన్నారు. దిగజారుతున్న గురుకులాల ఖ్యాతిని నిలబెట్టాలని, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేద పిల్లల భవిష్యత్తును కాపాడాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుకుల కాంట్రాక్టర్ల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు.

అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు బకాయిలు వెంటనే చెల్లించాలని తెలిపారు. ఆహార పదార్థాలు, ఇతర సామగ్రి సరఫరా అంతరాయం లేకుండా చూడాలన్నారు. యూనిఫామ్, బూట్లు, స్కూల్ బ్యాగులు.. తక్షణమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు



## తీవ్ర ఉత్కంఠ మధ్య వన్ బ్యూటిఫుల్ బిల్లుకు సెనేట్ ఆమోదం

**వాషింగ్టన్, జూన్ 30:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ పాలకవర్గం తీసుకువచ్చిన బిల్లుపై సెనేట్‌లో ఆమోదం పొందింది. పన్ను విరామంతో పాటు, ప్రభుత్వ వ్యయంలో కోతలు అక్రమ వలసదారులను వెనక్కిపంపే కార్యక్రమాలకు నిధులను కేటాయిం చేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రవేశపెట్టిన'వన్ బ్యూటిఫుల్ బిల్'కు భారీ ఉత్కంఠ నడుమ అర్థరాత్రి సెనేట్ ఆమోదించింది. వాదనల అనంతరం ఉపాధ్యక్షుడు జెడివాన్స్ సమక్షంలో బిలులకు 51-49తేడాతో సెనేట్ ఆమోదం తెలిపింది. ఉత్కంఠ తీవ్రస్థాయిలో ఉండటంతో ఓటింగ్ 3 గంటలపాటు నిలిచిపోయింది. ఇద్దరు రిపబ్లికన్లు బిల్లుకు వ్యతిరేకంగా ఓటువేసారు. బిల్లులోని మెడికల్ ఎయిడ్‌ను, ఆహార కూపన్లను తగ్గించేప్రతిపాదనలు, 3.8 ట్రిలియన్ డాలర్ల పన్ను విరామాన్ని పలువురు రిపబ్లికన్లు వ్యతిరేకించారు. బిల్లుపై ఓటింగ్ సమయంలో ట్రంప్ వర్జీనియాలోని గోల్ఫ్ కోర్స్ గెస్ట్‌హౌస్‌లోనేగడిపారు. బిల్లు వ్యతిరేకించినవారిలో నార్త్ కరోలినా సెనేటర్ థామ్ టిల్లిస్‌కూడా ఉన్నారు. తన రాష్ట్రంలో మెడికల్ ఎయిడ్‌కోతలవల్లనష్టం కలుగుతుం దన్నారు. బిల్లును మరోసెనేటర్ కెంటకీకి చెందిన రాండ్‌పాల్ వ్యతిరేకించారు. 940 పేజీల ఈ బ్యూటిఫుల్ బిల్లును ముందురోజు రాత్రే సెనేటర్లకు అందించారు. సెనేట్ ఆమోదం పొందడంతో ఈబిల్లు ప్రతినిథుల సభకు వెళుతుంది. అక్కడ ఆమోదం పొందాకఅధ్యక్షుడు ట్రంప్ వద్దకు చేరుతుంది. ఈ బిల్లును ముందునుంచి వ్యతిరేకిస్తున్న ఎలాన్ మస్క్ మరోసారి తీవ్రంగా విమర్శించారు. తాజా బిల్లు అమెరికాలో లక్షలమంది ఉద్యోగాలను నాశనంచేస్తుందని, దేశానికి తీవ్రనష్టం కలిగిస్తుందన్నారు. పాతపరిశ్రమలకు చేయూతనిచ్చినా కొత్తసంస్థలను దారుణంగా దెబ్బతీస్తుందని, రిపబ్లికన్‌పార్టీకి రాజకీయ ఆత్మహత్య అని మస్క్ తన సోషల్‌మీడియా పోస్టులతో ధ్వజమెత్తారు.

# ఐపిఎల్ జరిమానా మీరే కట్టాలి!

### మాజీ ఛైర్మన్ లలిత్‌మోడీకి సుప్రీం ఝలక్



**న్యూఢిల్లీ, జూన్ 30:** ఐపీఎల్ వ్యవస్థాపకుడు, మాజీ ఛైర్మన్ లలిత్ మోదీకి సుప్రీంకోర్టులో భారీ షాక్ తగిలింది. ఫెమా (విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం) నిబంధనల ఉల్లంఘన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనకు విధించిన జరిమానాను బీసీసీఐ చెల్లించేలా ఆదేశించాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం సోమవారం తోసిపుచ్చింది. దీంతో ఆ జరిమానా భారం లలిత్ మోదీపైనే పడింది. ఐపీఎల్ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో ఫెమా నిబంధనలను ఉల్లంఘించారన్న ఆరోపణలపై లలిత్ మోదీకి ఈడీ రూ.10.65 కోట్ల జరిమానా విధించింది. అయితే, ఈ మొత్తాన్ని బీసీసీఐ చెల్లించేలా ఆదేశించాలని కోరుతూ ఆయన గతేడాది డిసెంబర్‌లో మొదట బాంబే హైకోర్టును ఆశ్రయించారు. తాను ఐపీఎల్ పాలకమండలికి ఛైర్మన్‌గా అధికారిక హోదాలో ఉన్నప్పుడు ఈ వ్యవహారం జరిగిందని, బీసీసీఐ నిబంధనల ప్రకారం సంస్థ ప్రతినిధులు ఎదుర్కొనే చట్టపరమైన ఖర్చులను సంస్థే భరించాలని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన వాదనలను బాంబే హైకోర్టు అంగీకరించలేదు.

పిటిషన్‌లో పసలేదంటూ కొట్టివేయడమే కాకుండా, లలిత్ మోడీకి అదనంగా రూ.లక్ష జరిమానా కూడా విధించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం.. బాంబే హైకోర్టు తీర్పును సమర్థించింది. బీసీసీఐ జరిమానా చెల్లించాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. అయితే, చట్ట ప్రకారం ఈ కేసులో తనను తాను రక్షించుకునేందుకు లలిత్ మోదీకి పూర్తి హక్కు ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఐపీఎల్‌కు సారథ్యం వహించిన సమయంలో కోట్ల రూపాయల మేర ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారనే తీవ్ర ఆరోపణలతో లలిత్ మోదీ 2010లో దేశం విడిచి లండన్‌కు పారిపోయారు.

అప్పటి నుంచి ఆయన అక్కడే తల దాచుకుంటుండగా, ఆయన్ను భారత్‌కు రప్పించేందుకు అధికారులు ప్రయత్నాలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. తాజా తీర్పుతో ఆయనకు న్యాయపరంగా మరో ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

## ఢిల్లీలో ఘనంగా బోనాలు

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** సింహవాహిని మహంకాళి అమ్మవారి ఉత్సవాలు జూన్ 30 నుంచి జూలై 2వ తేదీ వరకు తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఢిల్లీలో ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లోఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయగా. జూలై 1న (మంగళవారం) ఇండియా గేట్ నుంచి తెలంగాణభవన్ వరకు మహంకాళి అమ్మవారి ఊరేగింపు ఉంటుంది. గత పదేళ్ల నుంచి ఢిల్లీలో తెలంగాణ భవన్‌లో సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఢిల్లీలో ఉన్న తెలుగువారంతా పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొనాలని ప్రభుత్వం ఆహ్వానం పలికింది.లాల్ దర్వాజా బోనాలు ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో పలువురు ప్రముఖులు హాజరుకానున్నారని సింహవాహిని శ్రీమహంకాళి దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



## భారీ వర్షాలకు కుప్పకూలిన భవనం

### హిమాచల్‌ప్రదేశ్‌లో పది జిల్లాలకు వరద హెచ్చరికలు

**సిమ్లా, జూన్ 30:** ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో గత కొన్ని రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో ఐదంతస్తుల భవంతి కుప్పకూలిపోయింది. అయితే, భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడుతుండటంతో అందులోని నివాసితులను ముందుగానే ఖాళీ చేయించినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాణ నష్టం తప్పింది. భవనం పేకమేడలా కుప్పకూలుతున్న దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని 10 జిల్లాలకు భారత వాతావరణ శాఖ వరద హెచ్చరికలు అంటే రెడ్ అలర్ట్ జారీ చేసింది. బిలాస్‌పూర్, సోలన్, సిమ్లా, సిర్మౌర్, హమీర్‌పూర్, మండి, కాంగ్రా జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. 'కులు, ఉనా, చంబా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది' అని తెలిపింది. రాబోయే 3 నుండి 4 గంటల్లో కిన్నౌర్, లాహుల్, స్పితి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు గత 24 గంటల్లో రాష్ట్రంలో విస్తృతంగా వర్షాలు కురిశాయని, కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదైందని ఐఎండీ సిమ్లా కేంద్రంలోని సీనియర్ అధికారి సందీప్ కుమార్ శర్మ తెలిపారు.

## బుద్ధవనం ప్రత్యేక అధికారికిగా మల్లేపల్లి లక్ష్మయ్య

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాత వార్త:** నాగార్జునసాగర్ సమీపం లోని బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేక అధికారిగా ప్రముఖ పాత్రికే యుడు, సామాజికవేత్త మల్లేపల్లి లక్ష్మయ్య నియామకం అయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం జీవో జారీ చేసింది. రెండేళ్ల పాటు ఆయన ఈ బుద్ధవనం ప్రాజెక్టు, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషనణ్ స్పెషల్ ఆఫీసర్‌గా కొనసాగనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2016 -24 వరకు బుద్ధవనం ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్‌గా ఆయన ఉన్నారు. ఈ నేపథ్యం లోనే ఆయనకు ఉన్న అవగాహన ను దృష్టిలో ఉంచుకొని మళ్లీ నియమించినట్లు తెలుస్తోంది.


**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL -II**
1st Floor, Triveni Complex, Abids, At: Hyderabad
OA No. 303 OF 2025

BETWEEN:
M/s. Yes Bank Ltd. ....APPLICANT
Vs
Mr. Kalavala Sunil Sagar ....Defendant

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
Mr. Kalavala Sunil Sagar, S/o. Mr. Vijay Kumar Kalavala, Flat No.202, Sri Sai Ram Residency, Kistareddypet, Behind Lake View, Palancheru, Hyderabad-502319.
Also At: Mr. Kalavala Sunil Sagar, S/o.Mr. Vijay Kumar Kalavala, Building No.20, 10th Floor, SEZ, Mindspace, Near Inorbit Mall, Madhapur, Hyderabad-500081
Permanent Address: Mr.Kalavala Sunil Sagar, S/o. Mr. Vijay Kuma Kalavala, 10-2-102, Mamillagudem, Near Bus Stop, Khammam (Urban), Khammam, Andhra Pradesh-507001.
....Defendant

Please take the summons in the above O.A.No. 303 OF 2025 filed by the Applicant for Recovery of Rs. 23,22,993.18/- (Rupees Twenty Three Lakh Twenty Two Thousand Nine Hundred Ninety Three and Eighteen Paise Only) against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA" Telugu Newspaper and posted the matter on 31/07/2025.

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application; (iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties; (iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on 31/07/2025 at 10.30 a.m. at Debts Recovery Tribunal - II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.

Take Notice that in case of default the Application will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this day 26th of June, 2025.

(By order of the Tribunal)
Sd/- Registrar
Debts Recovery Tribunal-II, Hyderabad



**శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానము, కొమురవెల్లి, సిద్దిపేట జిల్లా**
**బహిరంగ వేలము కమ్ సీల్డు టెండర్ ప్రకటన**
ఆర్‌సి.నెం.యస్.యం.డి.కె/63/2025, తేది: 29.06.2025

ఈ దిగువ తెలిపిన వివిధ ఐటమ్‌లకు గాను తేది: 10.07.2025 రోజున సాయంత్రం 4.00గం.లకు దేవాలయ కార్యాలయము నందు టెండర్ కం బహిరంగ వేలము నిర్వహించబడును.

| క్ర. సం. | వివరములు | టెండర్ షెడ్యూలు ధర | ధరావత్తు సొమ్ము | కాల పరిమితి |
|---|---|---|---|---|
| 01 | 02 | 03 | 04 | 05 |
| 01 | శ్రీ ఎల్లమ్మ అమ్మవారి దేవాలయం వద్ద షెల్టర్ నందు కూల్ డ్రింక్స్ మరియు పూజాసామాగ్రి అమ్ముకొను లైసెన్సు హక్కు | 2,000-00 | 3,00,000-00 | 11.07.2025 నుండి 09.07.2026 |
| 02 | అన్నదాన సత్రము ముందుగల దేవాలయం షాపింగ్ కాంప్లెక్స్ నందు షాపులలో తాత్కాలికలైసెన్స్ పద్ధతి పై వ్యాపారము చేసుకొను హక్కు (షాపునెం.1 నుండి 4 వరకు మరియు 6 నుండి 10 వరకు) | 2,000-00 | 30,000-00 షాపు ఒక్కింటికి | 11.07.2025 నుండి 09.07.2026 |
| 03 | పూలు, పూలదండలు సరఫరా | 2,000-00 | 10,000-00 | 01.08.2025 నుండి 31.07.2026 |

క్రమ సంఖ్య 01 నుండి 02 వరకు బహిరంగ వేలము కమ్ సీల్డు టెండర్ క్ర.సం.3నకు సీల్డు టెండర్ నిర్వహించబడును. పై టెండర్ నందు పాల్గొనుటకు ఆసక్తి కలవారు టెండర్ షెడ్యూల్ కొరకు కాలమ్ నెం.3లో తెలిపిన విధముగా రూ.2,000-00 దేవస్థాన ధనాగారము నందు ప్రకటన జారీచేసిన తేది నుండి తేది: 08.07.2025 సా.5.00గం.లోగా జమ చేసిన వారికి తేది: 09.07.2025 రోజున సా.5.00గం.లకు వరకు టెండర్ షెడ్యూల్ జారీ చేయబడును మరియు టెండర్‌లో పాల్గొనువారు టెండర్ షెడ్యూల్‌తో పాటుగా కాలమ్ నెం.4లో చూపిన డిపాజిట్ సొమ్మును ఏదేని జాతీయ బ్యాంక్ నందు కార్యనిర్వహణాధికారి శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానము, కొమురవెల్లి వారి పేరున చెల్లుబాటు అయ్యే విధముగా డి.డి.లను తేది: 10.07.2025 రోజున మధ్యాహ్నం 01.00గం.ల వరకు షెడ్యూలుతో జతపర్చి టెండర్ బాక్స్ నందు వేయవలెను. గమనిక: ముందుగా బహిరంగ వేలము నిర్వహించి హెచ్చుపాట మీద పాటలకు ఆ తదుపరి సీల్డు టెండర్ బాక్స్ తెరచి ఈ రెండింటి యందు ఏది హెచ్చుపాట ఉండునో అట్టి పాటను హెచ్చుపాటగా నిర్ణయించి టెండరు ఖరారు చేయబడును.

DIPR.NO. 4365-PP/CL/ADVT/1/2025-26 తేది: 30.06.2025 సం/-. యస్.అన్నపూర్ణ, కార్యనిర్వహణాధికారి.


## పేదలకు గృహవసతి కల్పనలో దేశానికే తెలంగాణ తలమానికం

### ఇప్పటివరకు 3 లక్షల ఇళ్లు మంజూరు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** నిరుపేదలకు గృహవసతి కల్పించడంలో భారత దేశంలోనే తెలంగాణరాష్ట్రం తలమానికంగా నిలిచేలా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌం సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం కూడా రూ. 5లక్షలతో ఇండ్లను నిర్మించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ఇండ్లతో సంబంధం లేకుండా రాష్ట్రంలో అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని వెల్లడించారు. పేదవాడికి మరింత చేయూత ఇవ్వాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఒక్కో ఇంటికి 40 మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లపై సోమవారం మంత్రి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున 22,500 కోట్ల రూపాయిలతో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని ఈ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఇప్పటి వరకు 3 లక్షల ఇండ్లను మంజూరు చేశామని ఇందులో 1 లక్షా 23 వేల ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ బిల్లుల కోసం లబ్దిదారులు ఎదురు చూడాల్సిన పరిస్థితి లేకుండా ప్రతి సోమవారం నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లోకే నిధులను జమ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నిర్మాణంలో కొన్ని జిల్లాల పనితీరు మెరుగుపడాల్సిన అవసరం ఉందని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ కొలిక్కివచ్చిన నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలని ఇందుకు అవసరమైన స్థలాలను గుర్తించాలని వీలైనంత త్వరలో పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులకు సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ,తదితర పట్టణాలలో కూడా ఇదే విధానాన్ని అమలుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# మా శాఖకు అదనపు నిధులు మంజూరు చేయండి

### కేంద్రమంత్రి అన్నపూర్ణాదేవికి మంత్రి సీతక్క విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవితో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క భేటీ అయ్యారు. మహారాష్ట్ర నుంచి ఢిల్లీకి తిరుగు ప్రయాణమైన కేంద్ర మంత్రి కాసేపు శంషాబాద్ ఉన్న క్రమంలో కేంద్ర మంత్రిని మహిళా సంక్షేమ శాఖ కార్యదర్శి అంతా రామచంద్రన్‌తో కలిసి సీతక్క పలు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క రాష్ట్రంలో అమలవుతున్న పథకాల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని కేంద్ర మంత్రికి అందజేశారు. ఆరోగ్యలక్ష్మీ, పోషణ్ 2.0, సంక్షేమ అంగన్వాడీ వంటి పథకాల ద్వారా తెలంగాణలో మహిళా, శిశు సంక్షేమానికి ప్రభుత్వం అధిక నిధులు వెచ్చిస్తోందని ఆమె తెలిపారు.ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా అంగన్వాడీ ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలు కల్పిస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రికి వివరించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల జీతాల్లో కేంద్ర వాటాను పెంచాలని కోరారు. అంగన్వాడీ టీచర్లకు, హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ. 10,950, రూ.6450 చెల్లిస్తుండగా కేంద్రం తన వాటాగా నామమాత్రంగా కేవలం రూ.1,350 నుంచి 2,700 మాత్రమే చెల్లిస్తుందని, ఈ మొత్తాన్ని పెంచాల్సిన అవసరాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతోపాటు రాష్ట్రంలో 11 వేలకుపైగా అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, వాటికి సొంత భవనాల నిర్మాణానికి కేంద్ర నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య లక్ష్మీపథకం ద్వారా గర్భిణీలకు, బాలింతలకు ప్రతిరోజు 200 మిల్లీ లీటర్ల విజయ మిల్క్‌ను అందిస్తున్నామని, త్వరలో చిన్నారులకు సైతం ఈ పథకాన్ని వర్తింప చేసే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, కేంద్ర ప్రభుత్వం తన వంతు సహకారం అందించాలని మంత్రి సీతక్క కోరారు.మంత్రి సీతక్క వినతులను కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి సానుకూలంగా స్పందించారు.తెలంగాణ రాష్ట్రం చేపడుతున్న పథకాలు అభినందనీయం అని ప్రశంసిం చారు. దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్రాల మహిళా శిశు సంక్షేమ మంత్రులు, అధికారులతో కలిసి తెలంగాణలో జాతీయ సదస్సు నిర్వహించి ఇక్కడి బెస్ట్ ప్రాక్టీస్‌ను ఇతర రాష్ట్రాలకు పరిచయం చేస్తామని తెలిపారు.కేంద్ర ప్రభుత్వంతో చర్చించి అధిక నిధుల మంజూరు పై నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.

## కేరళ డిజిపిగా తెలుగు అధికారి రావాడ చంద్రశేఖర్



**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** కేరళ రాష్ట్ర డిజిపిగా తెలుగు అధికారి రావాడ చంద్రశేఖర్ (59) నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని యుపి ఎస్‌సి సోమవారం నాడు ఖరారు చేసింది. సోమవారం నాడే పదవీ విరమణ చేసిన డిజిపి షేక్ దర్వేష్ సాహెబ్ స్థానంలో చంద్ర శేఖర్ రెండు రోజుల్లో బాధ్య తలు చేబట్టనున్నారు. ప్రస్తుతం కేంద్ర ఇంటె లిజెన్స్ బ్యూరో (ఐబి)లో సీని యర్ అధికారిగా వున్న చంద్రశేఖర్ 1991 బ్యాచ్ ఐపిఎస్ అధికారి. ఆయన స్వస్థలం ఎపిలోని పశ్చిమ గోదావరి జిల్లా. డిజిపి ఎంపిక కోసం కేరళ సిఎం పినరయి విజయన్ చంద్రశేఖర్‌సహా ఐదుగురు సీనియర్ అధికా రుల పేర్లను కేంద్రానికి పం పగా అందులో నుంచి చంద్రశేఖర్ సహా ముగ్గురి పేర్లను యుపిఎస్‌సి ఎంపిక చేసింది. ఈ ముగ్గురి నుంచి చంద్రశేఖర్ పేరును డిజిపిగా ఎంపిక చేస్తూ కేరళ సర్కారు సోమవారం అధికారికంగా నిర్ణయించింది.

చంద్రశేఖర్ పదవీ బాధ్యతలు చేబట్టేవరకు శాంతి భద్రతల అదనపు డిజిగా వున్న మరో తెలుగు అధికారి హెచ్. వెంకటేష్ ఇఛార్జి డిజిగా వ్యవహరిస్తారు. వెంకటేష్ స్వస్థలం హైదరాబాద్.

## ద.మ.రైల్వే జిఎం అరుణ్‌కుమార్‌జైన్‌కు ఘనంగా వీడ్కోలు



వీడ్కోలు సందర్భంగా గౌరవ వందనం స్వీకరిస్తున్న అరుణ్‌కుమార్‌జైన్

**హైదరాబాద్ (తార్నాక), జూన్ 30, ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్ తన పదవీ విరమణ సందర్భంగా మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే అనేక గొప్ప విజయాలు సాధించడానికి వీలు కల్పించిన అధికారుల అవిశ్రాంత కృషి, విధి పట్ల అంకిత భావానికి బృందాన్ని ప్రశంసించారు. అరుణ కుమార్‌జైన్ పదవీ విరమణచేసిన సందర్భంగా ఆయనకు దక్షిణ మధ్య రైల్వే బృందం హృదయపూర్వక వీడ్కోలు పలికింది. దక్షిణ మధ్య రైల్వేలో ఎక్కువ కాలం పనిచేసిన జనరల్ మేనేజర్‌గా ఆయన గుర్తింపు పొందారు. ఆయన చురుకైన నాయకత్వం, మార్గదర్శకత్వంలో, దక్షిణ మధ్య రైల్వే అపూర్వమైన వృద్ధి సాదించిందిని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం అరుణ్‌కుమార్‌జైన్‌కు సికిందరాబాద్‌లోని రైల్ నిలయంలో జీఎం కార్యాలయ అధికారులు, సిబ్బంది వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించి ఆయనను జ్ఞాపిక, శాలువా, పూల దండలతో సత్కరించారు.

దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్ దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌జె. వినయన్, ఇతర సీనియర్ అధికారులు తమ అనుభవాన్ని పంచుకున్నారు. అంతకు ముందు తెల్లవారు జామున, దక్షిణ మధ్య రైల్వే రక్షణ దళం (ఆర్.పి.ఎఫ్) హైదరాబాద్ లోని మౌలాలీలోని ఆర్.పి.ఎఫ్ శిక్షణ కేంద్రంలో జనరల్ మేనేజర్ విలువైన మద్దతు, డైనమిక్ నాయకత్వం, మార్గదర్శకత్వానికి గౌరవం మరియు కృతజ్ఞతా చిహ్నంగా ప్రత్యేక ఉత్సవ వీడ్కోలు పరేడ్‌ను నిర్వహించారు. సికిందరాబాద్, హైదరాబాద్ డివిజన్ల ప్రధాన విభాగాధిపతులు, డివిజనల్ రైల్వే మేనేజర్లు, ఇతర సీనియర్ అధికారులు, జోన్ వ్యాప్తంగా ఉన్న ఆర్.పి.ఎఫ్ సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. జనరల్ మేనేజర్ అరోమాసింగ్ ఠాకూర్ మాట్లాడుతూ దార్శనిక నాయకత్వం, కరుణా స్వభావాన్ని, ఆర్.పి.ఎఫ్‌కు అవిశ్రాంత మద్దతును ప్రశంసించారు. తన వీడ్కోలు ప్రసంగంలో అరుణ్‌కుమార్‌జైన్ ప్రయాణీకులను రక్షించడంలో, జాతీయ భద్రతను కాపాడడంలో ఆర్.పి.ఎఫ్ అసాధారణమైన పనితీరుపై ప్రశంసలు వ్యక్తం చేశారు. పోలీసింగ్ విధులతో పాటు, ఆపదలో ఉన్న పిల్లలను రక్షించడంలో ఆర్.పి.ఎఫ్ యొక్క మానవీయ దృక్పథాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. మౌలాలీలోని ఆర్‌పిఎఫ్ శిక్షణా కేంద్రం సైబర్ నేరాల దర్యాప్తు కేంద్రంగా గుర్తింపు పొందడం పట్ల అరుణ్ కుమార్ జైన్ గర్వాన్ని వ్యక్తం చేశారు. గౌరవం, కృతజ్ఞతతో వీడ్కోలు పలికేందుకు సికింద రాబాద్‌లోని రైల్ నిలయంలో అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

వార్త

జీవితంలో సంతృప్తిపడడం నేర్చుకున్న వ్యక్తి ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు.

-జార్జ్ ఇలియట్

# తొక్కిసలాటలు తప్పవా?


తొక్కిసలాటల దుస్సంఘటనల పరంపరలో మరో ఉదంతం చేరింది. ఈసారి పూరీ జగన్నాథస్వామి ఆలయం ఆ వరుసలోకి వచ్చింది. జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట జరిగి ముగ్గురు భక్తులు మరణించగా 50 మందికిపైగా భక్తులు గాయపడ్డారు. ఇలాంటివి ప్రభుత్వ అసమర్థత, దేవాలయ యాజమాన్య నిర్లక్ష్యం వలన చోటు చేసుకు న్నాయని భావించడం సహజం. విశేషమేమిటంటే అంత పెద్ద రథయాత్రలోనూ ప్రాణనష్టం అదీ లేకుంటే బాగుం డేది. జగన్నాథ రథచక్రాలొస్తున్నానగానే జగన్నాథుడు మనల్ని రక్షించేందుకు వస్తున్నాడు భక్తులంతా కదలిరం డని ఓ అర్థం స్ఫురిస్తే అంతటి భక్తజన సందోహంతో జగన్నాథ రథ చక్రాలు వడివడిగా లాగబడ్తున్నాయి.కనుక జాగ్రత్తగా ఉండండని హెచ్చరికగా కూడా భావించవచ్చు. ఈ రెండూ నిజమే. ఎందుకంటే పూరీ జగన్నాథ స్వామి రథానికి 16 చక్రాలుంటాయి. తాళధ్వజానికి 14 చక్రాలు, సుభద్ర రథానికి 12చక్రాలుంటాయి. ఆ రథయాత్రలో భక్త శిఖామణులు ఆధ్యాత్మిక తన్మయత్వంతో ఏ చక్రం కింద పడతారోనని అన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. అయినా జనం ఊహించనంత మంది వచ్చినప్పుడువారిని నియంత్రించడం సాధ్యం కానప్పుడు ఇలాంటి దుర్ఘటనలే చూడాల్సి వస్తుంది. తొక్కిసలాట దుర్ఘటనలు పునరావృ తం కాకూడదని ఎప్పటికప్పుడు తగుజాగ్రత్తలు తీసుకుం టున్నా మళ్లీ మళ్లీ జరగడం యాదృచ్ఛికమే అయినా వాంఛనీయం కాదు. భద్రతా నిర్లక్ష్యం క్షమించరానిదని ముఖ్యమంత్రి మాంఝి బాధ్యులపై కఠినచర్యలు తీసుకు నేందుకు ఉపక్రమించారు. తొక్కిసలాట దురదృష్టకరమని పూరీ రాజు గజపతి మహారాజ దివ్యసింగ్ దేవ్ విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి సందర్భాలలో ముందుజాగ్రత్త చర్యగా అంబులెన్స్‌లు కూడా అందుబాటులో ఉంచకపో వడంతో ప్రణాళికలో లోపమని భక్తులు ఆందోళన చెందు తున్నారు. తొక్కిసలాట జరిగినా జరుగకపోయినా జాగ్రత్త లు తీసుకోవడం కూడా ప్రణాళికలో భాగమే. అలాంటి సంప్రదాయ జాగ్రత్తలు పాటించడంలో ప్రభుత్వం వైఫల్య మైంది. సమయానికి రథాలకు బయలుదేరకపోవడం వల్లనే భక్తుల సంఖ్య బాగా పెరిగిపోయి ఈ ప్రమాదానికి కారణమయ్యిందని విపక్షాలు, కొందరు భక్తులు కూడా దేవాలయ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. ఇదంతా భయంకర గందరగోళంగా మారిందని, దీనికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బిజెపి అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ విమర్శించారు. ఏమైతే నేం గుండిచా ఆలయానికి నిర్ణీత సమయానికే రథాలు చేరుకున్నాయని బిజెపి సరిపెట్టుకుంటోంది. ఎవరెలా విశ్లేషించినా,సమయాసమయ నిర్ణయంలోనూ, రథయాత్ర లో సమయాలు పాటించడంలోనూ ఎక్కడో అంతుపట్టని మానవ నిర్ణయలోపం జరిగిందని అనుమానం రాకమా నదు. ఇవన్నీ ఇలా ఉండగా రథయాత్ర నిర్వహణలో తప్పిదాలు గతంలోనూ జరిగాయని ప్రభుత్వ పెద్దలు సర్దిచెబుతున్నారు. 1977 నుంచి రథాలు ఏటా రెండో రోజునగుడించా ఆలయానికి చేరుకుంటాని ఒడిశా న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ వివరిస్తున్నారు. సరైన ముహూర్తసమయానికి బయలుదేరి ఎలాంటి తొక్కి సలాటలు జరుగకుండా భక్తజన సందోహంతో గుడించా ఆలయానికి ఎప్పుడు చేరినా దాని ఉత్సవం విజయవం తంగా జరిగిందనే చెప్పుకోవాలి. అంతే తప్పగందరగోళం మధ్య భక్తులలో అలజడి ఏర్పడి సమయానికి గుడించా ఆలయానికి చేరడం అందులోనూ తొక్కిసలాటల జరిగి ముగ్గురు మృతి, వందమందికిపైగా క్షతగాత్రులు అయ్యా రనగానే 'ఎక్కడో తేడా జరిగిందన్న విషయం' తేటతెల్ల మే. 1993లో గురుగళ జాపకాయణ (నాగార్జున పూజ) సందర్భంలో ఆరుగురు, 2006 నవంబరు 4న శ్రీవారి మంగళహారతి సమయంలో జగమోహన్‌లో తూటపై తొక్కిసలాట జరిగి ముగ్గురు మరణించారు. 2008 జులై 4,5 తేదీలలో రథయాత్ర తొక్కిసలాటలో ఆరుగురు, 2008 సెప్టెంబరు 30న దేవాలయం వద్ద జరిగిన తొక్కిసలాటలో నలుగురు, 2010 జులై 19 రథయాత్ర తొక్కిసలాటలో బలభద్ర రథం పక్కన భక్తులు ఎక్కువగా పోగవడం వల్ల జరిగిన రద్దీలో ఇద్దరు ప్రాణం కోల్పోయా రు. 2015లోనూ రథయాత్ర తొక్కిసలాటలో ఇద్దరు, 2023లో నవంబరు 10న గుడిలో ఏడడుగుల ద్వారం సప్తాహచ వద్ద రద్దీతో 30 మంది క్షతగాత్రులయ్యారు. తాజాగా రథయాత్రలో రద్దీని నియంత్రించలేక జరిగిన వైఫల్యంతో సరైన ప్రణాళిక లేకపోవడమేనని చెప్పుకో వాలి. ప్రమాదాలు జరగడమూ మామూలే, కష్టనష్టాలూ మామూలే అయినా గుణపాఠాలు నేర్వకపోవడమూ అతి సాధారణంగా మారినపరిస్థితిని హర్షించలేము. ఆదివారం తెల్లవారుఝామున 4.20 గంటలకు తొక్కిసలాట జరిగిం ది. దేవతామూర్తులను ప్రత్యక్షంగా చూడాలని రథాల దర్శనానికి వేచి ఉన్నభక్తులు రథాలపై సేవాయత్‌లు 'పహుదా' తెర తొలగించిన వెంటనే ఒక్కసారిగా భక్తులు ముందుకు కదలడంతో తోపులాట మొదలైంది. ఆ రోజు సాయంత్రం జరిగే పొహండి వేడుకకోసం తెచ్చినచారమా లల (కలప)తో ఉన్నలారీలు అడ్డుగా ఉండటంతో తోపు లాట ఎక్కువైంది. దాంతో నియంత్రణ చాలా కష్టమైంది. అక్కడ కలప లారీలు ఉండకపోతే ఎట్లుండేదో? ఇలాంటి సమయాల్లో భక్తుల మార్గానికి మధ్యలో కలప లారీలను ఉంచకుండా చూస్తే ఇంత తొక్కిసలాట తప్పేదని జరిగే పరిస్థితి ఉండేదికాదు. ఏమయితే ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాంఝి జగన్నాథ భక్తులను క్షమాపణ లు కోరి విషాదాంతానికి ముగింపు పలికారు.

మంచి కార్యం తలపెట్టిన వాడికి దృఢచిత్తము, సింహబలము వాటంతట అవే సమకూరుతాయి.



థామస్ ఫుల్లర్

అధికారంలో ఉన్న వారికి చదవడానికి తీరిక ఉండదు. అయితే చదవడానికి తీరిక లేనివారు అధికారానికి అనర్హులు.



ఆస్కార్‌వైల్డ్

# ప్రజావాక్కు



## పునరావృతం కాకుండా చూడాలి

కోల్కతాలోని ప్రముఖ లాకళాశాలలో ఓ విద్యార్థినిపై జరి గిన అత్యంత పాశవికమైన అత్యాచార ఘటన సమాజం లోనిసురక్షితతపై తీవ్రమైనప్రశ్నలు రేపుతోంది. న్యాయా న్ని అధ్యయనం చేసే స్థలంలోనే ఇలా ఘోరమైన నేరం చోటుచేసుకోవడం భారత దేశం మొత్తం తలవంచుకునే విషాదకరమైన పరిణామం.ఇదికేవలం ఒకవ్యక్తిపై జరిగిన నేరం మాత్రమేకాదు, ఇది మనవిద్యాసంస్థల విశ్వాసంపై జరిగినదాడి.ఈఘటనపై పూర్తిగా స్వతంత్రంగా, వేగంగా విచారణ జరగాలి. నిందితులకు న్యాయపరంగా అత్యంత కఠినమైన శిక్షలు విధించాలి. విచారణపై న్యాయస్థానం లేదా మహిళా కమిషన్ పర్యవేక్షణ ఉండాలి. ఇలాంటి ఘటనల పునరావృతం నిరోధించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ముసుగుంటేగా తొలగించేందుకు?

**గాంధీనెహ్రూ** కుటుంబ పైశాచికత్వానికి ప్రతీక రాహుల్ గాంధీ ఈ ప్రకటన. భారత రాజ్యాంగ పరిషత్ ఆమోదిం చిన రాజ్యాంగాన్ని అమలుచేయాలని అడగడం మను ధర్మాన్ని అమలు చేయమని అడగడమా?అంటే, మను ధర్మం అంటే ఏంటో తెలియని ఈ ఉన్మాది ఆ పేరుతో హిందూదేశంలో హిందువుల్నివిభజించి బలహీనపరచాల నే ఆలోచనతోనే రాజ్యాంగానికి సంబంధం లేని మను వాదంఅనేపదాన్ని వాడాడేమో.ఇప్పటికే 42 వ రాజ్యాంగ సవరణ ద్వారా 1976 లో రాజ్యాంగంలో చేర్చి నిర్వచిం చిన లౌకికవాదానికి పూర్తి భిన్నంగా హిందూధర్మాన్ని మాత్రమే ద్వేషిస్తూ, కొన్ని మతస్తుల కొమ్ముకాస్తున్న పరిస్థితుల్లో లౌకికవాదాన్ని,రాజ్యాంగపీఠికలో బలవంతం గా చేర్చిన లౌకికసామ్యవాద పదాలని తొలగించాలనడం సహేతుకం, సమర్థనీయం.

- వీరుభొట్ల పేరయ్య శాస్త్రి, విజయవాడ

## పసుపు బోర్డు అభివృద్ధికి కంకణం

**తెలంగాణకు** పసుపుబోర్డ్ రావడం గొప్పవిషయం దానిని అందరూ ఆహ్వానించవలసిందే. దానితోపాటు కనీస మద్ద తుధర 15వేలవరకు ఉంటే రైతులకు లాభసాటిగా ఉండ గలదు.అలాగే పసుపురీసెర్చ్ సెంటర్‌పట్టుకొని వస్తే నిజా మాబాదుకుతిరుగుండదు అభివృద్ధికికంకణం కట్టుకోవాలి.

- భారత అవినాష్, జనగామ

## సెన్సార్‌బోర్డు చర్య తీసుకోవాలి

సినిమాలు సంఘంలో ఎంత అత్యంత ప్రభావం చూపుతాయో మనకు తెలుసు. ఎందరో స్టూడెంట్స్, కుర్రాళ్ళు తమ హీరో వేష భాషలను విపరీతంగా అనుకరిస్తారు. అటువంటి చిత్రాలు తీసే డైరెక్టర్లు గాని, ప్రొడ్యూసర్స్‌గాని ఒళ్ళు, కళ్ళు, బుర్ర దగ్గర పెట్టుకుని తియ్యాలి. డబ్బులు మావే కదా అని ఎదో కులాన్ని, పనులను, వృత్తులను వెటకారం చేస్తూ, అసహ్యంగా చూపిస్తూ తీసి దాన్ని మళ్లీ సమర్థించుకునేందుకు ఏవో కాకమ్మ కారణాలు చెబితే సరిపోదు. ఇది ఇప్పుడేకాదు పేరున్న డైరెక్టర్లు ప్రొడ్యూసర్లకి కూడా చాలా కాలంనుంచి వస్తున్న పెద్ద జబ్బు. దీనికి వాళ్ళ దరిద్రపుగొట్టు జవాబు ఏమిటంటే 'సినిమాను సినిమాగా చూడాలి'.అని.దీనిని సెన్సార్‌బోర్డు వారే మార్చాలి. కచ్చితమైన రూల్స్ ఉండి అమలు పరిచే వారిని వెయ్యాలి.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

## కాంగ్రెస్ ప్రజా సంక్షేమం అడుగులు

గత పదేండ్ల పాలన గురించి మళ్లీ ఇప్పుడు గుర్తు చేయాల్సిన అవసరం లేదు.ఇనుప కంచెలతో లోపలికి పోవడానికే వీలులేని అధికార దర్పాన్ని బిఆర్ఎస్ ప్రదర్శించింది. ప్రజాయుద్ధనౌక గద్దర్‌ను కనీసంగా ఆ ప్రదేశంలోకి రాకుండా నో ఎంట్రీ బోర్డు పెట్టేశారు. గంటల తరబడి ఆయన అక్కడ వెయిట్ చేసినా పట్టించుకోలేదు.ఆగోడలను హస్తంపార్టీ సర్కారు బద్ధలుగొట్టిం ది. ఏ స్థలమైతే సామాన్యులకు ప్రవేశం లేకుండా నిషేధింప బడిందో అదేచోట (ప్రజాభవన్)లో సామాన్యుల గోడు వినడా నికి ప్రతీ మంగళవారం, శుక్రవారం ప్రజావాణి అనే ప్రోగ్రామ్ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందు లున్నా ప్రజాసంక్షేమం కోసం బలమైన అడుగులు వేస్తోంది.

- మద్దుల ప్రశాంత్, హైదరాబాద్

## లింగ సమానత్వం ఆందోళనకరం

**వరల్డ్** ఎకనామిక్ ఫోరం విడుదల చేసిన గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ 2025 దేశంలో లింగసమానత్వాన్ని వేలెత్తి చూపుతోం ది. ప్రపంచంలో లింగ సమానత్వంలో మొత్తం 148 దేశాల్లో మన దేశం 131 స్థానంలో నిలిచింది. భారత్ కంటే పొరుగు దేశాలైన బంగ్లాదేశ్,భూటాన్ నేపాల్, శ్రీలంక ముందున్నాయి. లింగ సమానత్వంలో ఐస్‌ల్యాండ్ అగ్రస్థానంలో ఉంది. భారత్ మహిళల విద్యలో పురోగతి సాధించడం, జనన సమ యంలో లింగ నిష్పత్తి కూడా మెరుగుపడటం ఈ రిపోర్టులో సానుకూల అంశాలు.పార్లమెంటులోమహిళలసంఖ్య13.8శాతానికి తగ్గింది.

-చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పాక్, చైనాతో వ్యవహరించడం ఎలా?

*శ్రీలంక, నేపాల్ దేశాలను కూడా ఆర్థిక సహాయం పేరుతో భారత్‌కు వ్యతిరేకంగాచైనా రంగంలోకి దింపాలని చూస్తున్నది కానీ, ఆ రెండు దేశాలు ప్రస్తుతానికి పూర్తిగా పాకిస్థాన్, చైనాల వైపు మొగ్గటం లేదు. ఏదిఏమైనా భారత్ నిరంతరం ఈ దేశాలతో అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారత్ టెర్రరిజంను అణచి వేసేందుకు దక్షిణ ఆసియా దేశాల సహాయ సహకారాలను అభ్యర్థిస్తున్నది. అలాంటి నేపథ్యంలో చైనా, పాకిస్థాన్‌ల చర్యలు అడ్డుకట్టలుగా మారొచ్చు. భారతదేశం వెనక్కి తగ్గకుండా ఆదేశాలతో సత్సంబంధాలు కొనసాగించకతప్పదు. భారత్ బలాన్ని తప్పుగా అంచనా వేసి ఏ దేశం పాకిస్థాన్‌కూ, చైనాకూ తోడ్పడి టెర్రరిజం లాంటి సమస్యలు సృష్టిస్తే తగు రీతిలో భారత్ ఆపరేషన్ సింధూర్‌లా తిరుగులేని జవాబు ఖాయం. ఆర్థిక, మిలటరీ రాజకీయ సమస్యలు ఎదుర్కోకతప్పదు అని ఆదేశాలకు సంకేతాలు అందుతే అటువైపు మొగ్గుచూపకపోవచ్చు.*



రావులపాటి సీతారాంరావు

భారత్, పాకిస్థాన్‌తో సంఘర్షణలో కానీ, రాజ్యాంగేతర టెర్రరిజంతో పోరాటం అప్పుడుకానీ పక్కలో బెల్లం లా చైనా వ్యవహరిస్తూనే ఉంది. 1962 యుద్ధం తర్వాత చైనా పాకి స్థాన్‌ను నిజమైన మిత్రుడిగా మల్చు కుంది. చైనా అవసరాల కోసం పాకి స్థాన్ నమ్మకమైన స్నేహితుడిగా, భారత్ మీద ఉన్న ద్వేషం వల్ల అనా దిగా వస్తున్న శత్రుభావాల వల్ల సిద్ధంగా ఉండటం జగమెరిగిన సత్యమే. దీనివల్ల పాకిస్థాన్‌కు ఆర్థికంగా చైనా చేయూత, ఆయుధ సామాగ్రి అందచేత సత్వరంగా ఏర్పడిన లాభాలు! ఆపరేషన్ సిందూర్ తర్వాత ఎవరు నమ్మటానికి సిద్ధంగా ఉన్నా లేకపోయినా, పాక్ మరింత బలహీనపడింది. ఆ మాత్రం భారత్‌తో నిలవగలిగిందంటే చైనా అరమరికలు లేని ఆయుధ సహాయంతో పాటు అమెరికా అందించిన మాటసాయం వల్లనే. ప్రస్తుత యుద్ధ వాతావరణంలో పశ్చి మాసియా దేశాలు దినమొక గండంగా కాలం గడుపుతున్నా యి. గతకాలంలో యుద్ధంవస్తే మిత్ర దేశాలు, శత్రుదేశాలూ ఉండేవి. ఈ ఆధునిక సాంకేతిక యుగంలో శాశ్వతంగా ఎవర్నీ మిత్రులుగా ఉంచుకోవాల్సిన అవసరం కానీ, శత్రు వులుగా దూరంగా పెట్టటం కానీ అవసరం లేదని, ఇప్పటి రాజకీయ నిపుణులూ, అధినేతలూ కొత్త యుద్ధశాస్త్రాలు చెలామణిలోకి తెచ్చారు. రష్యా, అమెరికాతో స్నేహం నటి స్తూనే ఉక్రెయిన్ ఖనిజ సంపదను దోచుకోటానికి, కాసేపు యుద్ధ విరమణ, మరికాసేపు యుద్ధంలో విజృంభణ పాటి స్తూ ఉక్రెయిన్ లాంటి చిన్నదేశాలను చికాకులపాలు చేస్తు న్నది. అమెరికాను నమ్మటం కష్టమైనా, ఇష్టంలేని నమ్మ కాన్ని ఉక్రెయిన్ స్వీయరక్షణ కోసం ప్రదర్శించక తప్పటం లేదు. ఖనిజసంపద తాకట్టుపెట్టయినా, ఖరీదైన శాంతిని కొనటానికి సిద్ధంగానే ఉండక తప్పటం లేదు. కొన్ని కొత్త ఎలయన్సులు తెరమీదికి వస్తున్నాయి. చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లు చైనాలోని కుమ్మింగ్‌లో కలిసాయి. చైనా, పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్‌లు కూడా అటు తర్వాత కొద్ది కాలానికే (మే నెలలో) చైనా, పాకిస్థాన్ కారిడార్‌ను పొడి గించే పేరుతో సహకారం మరింతగా పెంపొందించుకోవటా నికి కలవటం భారత్ దేశమే కాదు పశ్చిమాసియా దేశాలు కూడా గమనించి ఉండవచ్చు. ఇండియాతో యుద్ధం తర్వాత పాకిస్థాన్ నిర్వీర్య పరిస్థితితోపాటు, అఫ్ఘానిస్థాన్ భారత్‌కు దగ్గరవుతుందేమోనన్న దుగ్ధతో చైనా ఈ సమా వేశాలను ఏర్పాటు చేసిందన్న విషయం అందరికీ తెలిసిందే!

చైనాకు రెండు ఆలోచనలు నిరంతరం వెంటాడుతూనే ఉం టాయి. ఒకటి పాకిస్థాన్ బలహీనపడకూడదు. పాకిస్థాన్ మీద ప్రేమవల్లో స్నేహభావంతోనో కానేకాదు. చైనా, తన దౌత్యావసరంలో ఒక భాగంగా ఇండియాను బలపడనివ్వ కూడదు. అందుకే పాకిస్థాన్‌ను బలంగా ఉంచాల్సిన అగ త్యం తనకు ఉందని చైనా నమ్మిన ఆలోచన. రెండవది జనాభా విషయంలో మొదటిస్థానానికి ఎగబాకింది. చైనాకు తెలుసు మానవ వనరులు దేశానికి ముఖ్యమని. భారత్ ఏ విషయంలోనూ తనను అధిగమించటం చైనాకు ఇష్టం ఉం డదు. అమెరికా, రష్యాలు క్రమంగా బలహీనపడుతున్నా యి. చైనా, భారత్‌లు బలాన్ని పుంజుకుంటున్నాయి. ఇప్ప టివరకూ చైనా అన్ని విషయాల్లో ఒక్క జనాభా విషయం



లో తప్ప భారత్‌కు ముందుగానే ఉంది. పాకిస్థాన్ ఈ రోజున పూర్తిగా చైనా మీదనే ఆధారపడి ఉంది. దాదాపు 80 శాతం పాకిస్థాన్ ఆయుధాలు చైనా నుంచి వచ్చినవే. 2024 చివరి వరకూ దాదాపు 29 బిలియన్ డాలర్ల అప్పు చైనా ఇచ్చిందే. అంతేకాదు యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్‌లో కానీ, ఇతర అంతర్జాతీయ వేదికలపైనా పాకి స్థాన్‌ను ఉగ్రవాదం విషయంలో నిర్మొహమాటంగా సమర్థిం చేది చైనాయే! భారత్‌కు అఫ్ఘానిస్థాన్ దగ్గర కానివ్వకూడ దని, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లను తన ప్రక్కన ఉంచుకొని భారత్‌ను అంతర్జాతీయ ప్రముఖస్థానానికి రానివ్వకుండా సరిహద్దు సమస్యలతోనో, ఉగ్రవాదల చర్యలతోనో ఎంగేజ్ చేయటమే చైనా లక్ష్యంగా కనపడుతున్నది. ఇతర అగ్రదేశా లు కూడా భారత్ ఎదుగుదలను సహించలేని పరిస్థితికి వచ్చాయి. ఇరాన్, ఇరాక్, టర్కీ లాంటి ఇస్లామ్ దేశాలు ఇజ్రాయిల్‌తో సతమతమవుతున్నాయి. రష్యా ఒకప్పుడు, సిద్ధాంతాలు ఏవైనప్పటికిని,పశ్చిమాసియా దేశాల విషయం లో స్పష్టమైన అవగాహనతో సానుకూల దృక్పథంలో వ్యవ హరించేది. యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్ విచ్ఛిన్నమైన తర్వాత రష్యన్ ఫెడరేషన్‌గా బలహీ నపడి పూర్వవైభవాన్ని కోల్పోయింది. రష్యాగా ప్రస్తుతం ఒక దేశంగా వెలిసింది. అమెరికాను కానీ, మరే ఇతర పెద్ద దేశాన్ని కానీ ఆర్థికంగా మిలటరీపరంగా సమాన స్థాయి హోదా ప్రదర్శించే అవకాశం కోల్పోవటంతో నిర్మాణాత్మకం గా, నిర్ణయపరంగా బలహీనపడింది. అందుచేత చైనా, పహెల్గాం ఘటనలో భారతదేశాన్నే తప్పుపట్టింది. భారత్‌కు గట్టి సపోర్ట్ సెక్యూరిటీ కౌన్సిల్ కానీ, మరే ఇతర అంతర్జా తీయ వేదికల్లో కానీ లభించటం దుర్లభంగా మారింది. బాలెన్స్ ఆఫ్ పవర్ ఒకవిధంగా ఊగిసలాడుతున్నది.భారత్ ఈ రెండు దశాబ్దాల నుంచి అనేకరంగాల్లో స్వయం కృషితో అభివృద్ధి సాధించటంతో ఎవరి సహారం లేకుండానే సంకట పరిస్థితులను విజయవంతంగా ఎదుర్కొగల్గుతున్నది. భారత దేశం బలంగా ఈమధ్య పోరాటాలు చేసి బలమైన దేశంగా నిరూపించుకోవటం పాకిస్థాన్‌కూ, చైనాకు మింగుపడటం లేదు. పాకిస్థాన్ వెనుక ఉండి చేయించిన ఉగ్రవాదచర్యలు, యురిలో (2016) పుల్వామాలో (2019) పహెల్గాం ఘట న తర్వాత ఆపరేషన్ సిందూర్‌తోసహా భారతదేశం సమర్థ వంతంగా తిప్పికొట్టిన తీరు చైనానే ఇరుకులో పడేసింది. పాకిస్థాన్ ప్రతిసారీ కాశ్మీర్ సమస్యను లేవనెత్తటం ఆపు చేయడానికి కాశ్మీర్ కాదు సమస్య (పి.ఒకె)పాకిస్థాన్ ఆక్యు పైడ్ కాశ్మీరు సమస్య! దానిని మేము పరిష్కరించుకోవాల్సి న తప్పని పరిస్థితులు ఉన్నాయి. అంతేకాక ఇండస్ వాటర్ ట్రీటీని కూడా ఉగ్రవాద చర్యల వల్ల సస్పెండ్ చేస్తున్నాం అని చెప్పటంతో పాకిస్థాన్ నిర్వీర్యమైపోయింది. అమెరికాను బతిమిలాడుకోవటంతో పాకిస్థాన్ వైపు మొగ్గినట్లు ఒక ప్రక టన ట్రంప్ ఇచ్చాడు కానీ ఎంతవరకు ట్రంప్ ఒకే మాట మీద స్థిరంగా ఉండగలడో ఎవరూ చెప్పలేని పరిస్థితి. అం దుకే చైనా రంగంలోకి దిగి ఏదోవిధంగా బంగ్లాదేశ్, అఫ్ఘాని స్థాన్‌లు పాకిస్థాన్‌ను బలపరచడానికి చైనా ఈ దేశాలతో సమావేశాలు ఏర్పాటు చేసింది. శ్రీలంక, నేపాల్ దేశాలను కూడా ఆర్థిక సహాయం పేరుతో భారత్‌కు వ్యతిరేకంగాచైనా రంగంలోకి దింపాలని చూస్తున్నది కానీ, ఆ రెండు దేశాలు ప్రస్తుతానికి పూర్తిగా పాకిస్థాన్, చైనాలవైపు మొగ్గటం లేదు. ఏదిఏమైనా భారత్ నిరంతరం ఈ దేశాలతో అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారత్ టెర్రరిజంను అణచి వేసేందుకు దక్షిణ ఆసియా దేశాల సహాయ సహకారాలను అభ్యర్థిస్తున్నది. అలాంటి నేపథ్యంలో చైనా, పాకిస్థాన్‌ల చర్యలు అడ్డుకట్టలుగా మారొచ్చు. భారతదేశం వెనక్కి తగ్గ కుండా ఆదేశాలతో సత్సంబంధాలు కొనసాగించకతప్పదు. భారత్ బలాన్ని తప్పుగా అంచనా వేసి ఏ దేశం పాకిస్థాన్ కూ, చైనాకూ తోడ్పడి టెర్రరిజం లాంటి సమస్యలు సృష్టిస్తే తగు రీతిలో భారత్ ఆపరేషన్ సిందూర్‌లా తిరుగులేని జవాబు ఖాయం. ఆర్థిక, మిలటరీ రాజకీయ సమస్యలు ఎదుర్కోకతప్పదు అని ఆదేశాలకు సంకేతాలు అందుతే అటువైపు మొగ్గుచూపకపోవచ్చు. •

# రైతు సౌభాగ్యమే దేశాభివృద్ధికి మూలం

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రతి సంవత్సరం జూలై 1న నిర్వహించే ప్రపంచ వ్యవ సాయ దినోత్సవం, మానవ జాతి జీవనాధారమైన వ్యవసాయ రంగ ప్రాముఖ్యతను గుర్తుచేసే సందర్భం. ఈ రోజు అన్నదాతల కృషిని గౌరవించడం, వ్యవసాయ రంగా నికి అంకితభావంతో పని చేసే ప్రతి ఒక్కరికి అభినందన తెలిపే ఉదాత్త సందేశాన్ని ప్రసారం చేస్తుంది. ఇది కేవలం ఒక దినోత్సవం మాత్రమే కాదు భవిష్యత్తు ఆహారభద్రతకు, పర్యావరణ పరిరక్షణకు, గ్రామీణాభివృద్ధికి, సమాజ సమతు ల్యతకు మూలమైన వ్యవసాయాన్ని మనస్ఫూర్తిగా ఆలో చించే రోజు. వ్యవసాయం కేవలం పంటలు పండించడం అనే అర్థానికి మాత్రమే పరిమితమయ్యే రంగం కాదు. ఇది ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక, కోట్లాది మందికి ఉపాధిమార్గం, సమాజ సంస్కృతికి ప్రాణనాడి, పర్యావరణ సమతుల్యతకు నిర్ధారక శక్తి. గ్రామీణ జీవితానికి పునాది వేసే వ్యవసాయం మన సంస్కృతి, ఆచారాలతో సైతం జతపడి ఉంది.పండు గలు, పంటల కట్టుబాట్లు, వర్షాకాలపు వేడుకలు అన్నీవ్యవ సాయ దశల ఆధారంగా రూపుదిద్దుకున్నవే. వ్యవసాయ రంగం ప్రపంచ జనాభాలోదాదాపు 26శాతం మంది ఉద్యో గ అవకాశాలపై ప్రభావం చూపుతోంది. ప్రపంచ వ్యాప్తంగా రెండు బిలియన్ మందికి పైగా ప్రజలు నేరుగా వ్యవసాయ సంబంధిత రంగాల్లో పనిచేస్తున్నారు. భారతదేశంలోనే సుమారు 54 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధా రపడి జీవిస్తున్నారు. 2023-24 గణాంకాల ప్రకారంభారత దేశంలో వ్యవసాయ రంగం జాతీయ స్థూల ఉత్పత్తిలో సుమారు 18.3 శాతం వాటా కలిగిఉంది. ఈరంగంద్వారా ముడిసరుకులు, ఆహారం, జాతికి జీవనాధారం లభించడమే కాకుండా, పలు పరిశ్రమలకు మౌలిక మద్దతు లభిస్తోంది. ఉదాహరణకు, పత్తి, చెరకు, నూనె గింజలు, ధాన్యాలు వంటి పంటల ద్వారా వస్త్ర, చక్కెర, నూనె పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయి. వ్యవసాయ రంగం ఎదుర్కొం టున్న ప్రధాన సవాళ్లలో వాతావరణ మార్పులు కీలకంగా ఉన్నాయి. అంతర్జాతీయ స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరుగుతు న్న నేపథ్యంలో పంటల దిగుబడిపై దుష్ప్రభావం పడుతోం ది. ఐపీసీసీ నివేదికల ప్రకారం 2050 నాటికి వర్షాధారిత సాగు ప్రాంతాలలో 10-25 శాతం దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. భారత దేశంలో తూర్పు రాష్ట్రాల నుంచి పశ్చిమ ప్రాంతాల దాకా వాతావరణ అస్థిరతలు రైతులకు నష్టాలను కలిగిస్తున్నాయి. నీటి కొరత, భూసార హీనత, వ్యవసాయ రుణ భారం, మార్కెటింగ్ లో అసమతుల్యత, మధ్యవర్తుల వలయంలో రైతు ఆదాయం తగ్గిపోవడం వంటి అంశాలు రైతుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇంకా, భారత దేశంలో రైతు ఆదాయం నామమాత్రంగా పెరుగుతోంది. 2017 నుండి 2023 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా రైతుల సగటు నెలవారీ ఆదాయం రూ. 8,000-10,000 మధ్య గానే ఉందని ఎన్ఎస్ఎస్ఓ నివేదికలు సూచిస్తున్నాయి. ఈ ఆదాయంతో కుటుంబ ఖర్చులు, విత్తనాలు, ఎరువులు, కూ లీల ఖర్చులు మిళితం చేస్తే వ్యవసాయాన్ని కొనసాగించటం చాలా కష్టమైనదిగా మారింది. ఫలితంగా యువత వ్యవ సాయాన్ని వదిలి ఇతర రంగాల్లో ఉద్యోగాల కోసం వలస బాట పడుతున్నారు.ప్రపంచ జనాభా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, భవిష్యత్తు ఆహార అవసరాలను తీర్చాలంటే వ్యవసాయ రంగం సామర్థ్యాన్ని గణనీయంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ రంగానికి ఆధుని కతను చేర్చడం అత్యవసరమవుతోంది. స్మార్ట్ ఫార్మింగ్, డ్రోన్ సాంకేతికత, భూసార పరీక్షా పద్ధతులు, మైక్రో ఇరి గేషన్ పద్ధతులు, డిజిటల్ మార్కెట్ ప్లాట్‌ఫామ్‌లు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (నీశిప్పీ) వంటి ఆధునిక విధానాల ద్వారా వ్యవసాయాన్ని సమర్థవంతంగా తీర్చిదిద్దవచ్చు. •

# భాషా పరిశోధకులకు కల్పతరువు ఆచార్య దొణప్ప



డాక్టర్ టి. గౌరీ శంకర్

ఈ లోకం ఒక వ్యక్తిని నూరేళ్ల దాకా గుర్తుపెట్టుకొని ఆ వ్యక్తికి వందేళ్ల పండుగ చేస్తోంది అంటే? ఆ వ్యక్తి ఈ సమాజానికి ఎంతో విలువైనది ఏదైనా అందించి ఉండాలి. అది ఏ రంగమైనా కావచ్చు. ఆ వ్యక్తి ఎవ రైనా కావచ్చు. ఆ రకంగా సాహిత్య రంగానికి సంబంధించి అపూర్వసాహి త్యాన్ని సృష్టించిన వారైనా అనితర సాధ్యమైన పరిశోధనా కృషిని సలి పిన వారైనా తన తరువాతి తరానికి విజ్ఞాన భాండాగారాన్ని అందించిన వారైనా, విలువలతో కూడిన విద్యానిధిని పంచిన వారైనా అటువంటి వారికి శత జయంతి మూర్తుల పేరిట ఉత్సవాలు నిర్వహించి, వారి సేవలు స్మరించుకొని వారి నుంచి స్ఫూర్తిని పొందడం ఆన వాయితీ. ఆ సంప్రదాయ పరంపరలో భాగంగా ఈయేడాది కొందరు తెలుగు కవి పండితుల శతజయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా 2025 జులై ఒకటవ తేదీ నుంచి 2026 జులై ఒకటో తేదీ వరకు దివంగత ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతి ఉత్సవాలు నిర్వ హిస్తున్న సందర్భంగా వారి గురించి కొన్ని విశేషాలు. పండి త పరిశోధకులు, విమర్శ కాగ్రేసరులు, భాషాశాస్త్ర నిపుణు లైన ఆచార్య తూమాటి దొణప్ప 1926 జులై ఒకటవ తేదీ న జన్మించినట్లు వారి పాఠశాల రికార్డులలో నమోదై ఉంది. కానీ 1926 కార్తీక మాసంలో పౌర్ణమినాడు పుట్టారని అం టారు. అనంతపురం జిల్లా, ఉరవకొండ మండలం, రాకట్ల గ్రామంలో పుట్టిన వీరి తల్లిదండ్రులు కీ.శే. తిమ్మక్క, కీ.శే. సంజీవప్ప. వీరి అసలు పేరు దొణ తిమ్మారాయ చౌదరి. అది క్రమేణ దొణప్పగా స్థిరపడింది. ఇంటిపేరు 'తూమాటి' జతపడి తూమాటి దొణప్పగా తెలుగు సాహితీ విద్యారంగా లలో లబ్ధప్రతిష్టులయ్యారు. పన్నెండేళ్ల వరకు వీరి చదువు సంప్రదాయ రీతిలో కొనసాగింది. ఆ తర్వాత 1948లో అనంతపురంలో ఇంటర్మీడియేట్ చదివారు. 1949-53లలో ఆంధ్రవిశ్వవిద్యాలయంలో బిఏ (ఆనర్స్) చేశారు. అదే విశ్వవిద్యాలయంలో 1954లో ఎం.ఎ(తెలుగు) పూర్తిచేసి అదే ఏడు పూణేలోని దక్కన్ కాలేజీలో భాషాశాస్త్రంలో శిక్షణ పొందారు. 1965లో 'వైకృత పద స్వరూప నిరూ పణం' అనే అంశంపై ఆచార్య గంటి జోగి సోమయాజులు పర్యవేక్షణలో పరిశోధన చేసి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్‌డి,డాక్టరేట్ పట్టా పొందారు. ఈ పరిశోధనకు విశ్వవిద్యాలయం ఉత్తమ పరిశోధన అవార్డును ప్రకటించిం ది. 1982లో వీరు రచించిన 'తెలుగు హరికథా సర్వస్వం' గ్రంథానికి ఆంధ్రవిశ్వవిద్యాలయం డి.లిట్ ప్రదానంచేసింది. విద్యార్థి దశ నుంచే వీరు చదువులన్నింటిలో ఉత్తమ శ్రేణి లో నిలిచారు. 1958లో ఆంధ్రవిశ్వవిద్యాంలోని తెలుగు శాఖలో లెక్చరర్‌గా వీరి ఉద్యోగ జీవితం ప్రారంభమైది. అక్కడ తెలుగు శాఖ చేపట్టిన తెలుగు వ్యుత్పత్తి కోశ నిర్మా ణంలో ఒకపుష్కర కాలం క్రియాశీలంగా పనిచేశారు. 1970 లో నాగార్జున విశ్వవిద్యాలయం స్థాపించిన తొలి రోజులలో అక్క డికి వెళ్లి తెలుగుశాఖాధిపతిగా, రిజిస్ట్రార్‌గా, ప్రిన్సిపాల్‌గా వివిధ హోదాలలో సేవలందించి, ఆ శాఖను పటిష్టం చేశారు. పాతి కేళ్లకుపైగా బోధాన రంగంలో పనిచేసి ఎంతో మంది విద్యార్థు లను తీర్చిదిద్దారు. ప్రొఫెసర్ స్థాయిలో పరిశోధక విద్యార్థులకు పర్యవేక్షకునిగా వ్యవహరించారు. వీరి పర్యవేక్షకత్వంలో 20 మంది ఎంఫిల్, 40 మంది పిహెచ్‌డి పట్టాలు పొందారు. ఆచార్య తూమాటి దొణప్ప విద్యార్థి దశ నుంచే రచనలు చేయడం ప్రారంభించారు. తొలి రోజులలో ఆశువుగా కవిత్వం చెప్పే వారు. అలవోకగా పద్యాలు అల్లేవారు. ఇది గమనించిన కొందరు ఆయనను అవధానాలు చేయమని కూడా ప్రోత్స హించారు. ఎనిమిదవ తరగతి చదివేటప్పుడు చిత్రగుప్తఅనే పేరుతో ఒక కథ రాశారు. ఆ తరువాత వర్ణాంతర వివా హం ఇతివృత్తంగా 'చంద్రుడు కలువ' కథ, 'ఆదర్శశిఖరాలు' అనే ఏకాంకిక, 'అన్వేషణ' అనే గేయం దేశచరిత్రకు పేరడ్ గా, హాస్టల్ చరిత్ర, మొదలైన రచనలు చేశారు. వీటితో పాటు అనంతర కాలంలో అనేక సృజనాత్మక, పరిశోధనా త్మక, విమర్శనాత్మక రచనలు ఎన్నో చేశారు. ఇవి ఆనాటి 'వినోదిని' 'రూపవాణి' 'ఆనందవాణి' 'ఢంకా', 'సూర్యప్రభ' వంటి పలు పత్రికలలో అచ్చయ్యాయి. ఆనాటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమివారి 'వృత్తి పదకోశాల' నిర్మాణంలోమొద టిదైన 'వ్యవసాయవృత్తి పదకోశం'లో ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తికి సహాయకునిగా పనిచేశారు. ఆ తరువాత 'మత్స్యపరిశ్రమ' నౌకా నిర్మాణానికి సంబంధించిన వృత్తిపదకోశాలకు సంపాదకునిగా పనిచేశారు. సాహితీ వేత్తగా, పండిత పరిశోధకునిగా, భాషాశాస్త్ర నిపుణునిగా వీరికి అత్యంత కీర్తిప్రతిష్టలు తెచ్చిపెట్టిన గ్రంథాలు. 'ఆంధ్ర సంస్థానములు సాహిత్య పోషణము' 'భాషాచారిత్రక వ్యాసా వళి 'తెలుగులో కొత్త వెలుగులు'జానపద కళాసంపద, తెలు గు హరికథా సర్వస్వం, 'వైకృత పద స్వరూపనిరూపణము, (పిహెచ్‌డి, సిద్ధాంత గ్రంథం)ఆకాశ భారతి, బాలల శబ్ద రత్నాకరం (నిఘంటువు) వీరికి సంప్రదాయ వ్యాకరణాల మీద, ఆధునిక భాషాశాస్త్రం మీద ప్రత్యే కాభిమానం. ఇటు శిష్ట సాహిత్యం, జానపద వాఙ్మయంపై కూడా మంచి పట్టుఉంది. ఒకప్పుడు ఆయన రాయలసీమ జానపదగేయా లను స్వయంగా పాడి అలరింపచేసేవారట. ఆనాటి ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి ద్వారా దొణప్ప మూడుసార్లు అవార్డు అందుకొన్నారు.1965-66లో 'ఆంధ్ర సంస్థానము లు సాహిత్య పోషణము' 1975-76లో తెలుగులోహరికథా సర్వస్వం, 1978లో జానపద కళాసంపద, గ్రంథాలకుగాను వీరికి ఈ అవార్డులు లభించాయి.1980లో ఆనాటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ద్వారా ఉత్తమ ఉపాధ్యాయ' అవార్డును కూడా అందుకొన్నారు.1985లో ఆనాటి ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం నూతనంగా స్థాపించిన తెలుగువిజ్ఞాన పీఠానికి వీరిని ప్రత్యేకాధికారిగా నియమించింది. అదే సంవత్సరం అంటే 1985సెప్టెంబర్‌లో ప్రభుత్వం తెలుగు విజ్ఞాన పీఠాన్ని చట్ట బద్ధంగా తెలుగు విశ్వవిద్యాలయంగా మార్చింది. తెలుగు విజ్ఞాన పీఠానికి ప్రత్యేకాధికారిగా కొనసాగుతున్న ఆచార్య తూమాటి దొణప్పనే ప్రభుత్వం తెలుగువిశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా నియమించింది. దాంతో వీరు 1986 జనవరి 8వ తేదీనుంచి మూడేళ్లపాటు 1989 జూన్ 20వ తేదీవరకు తెలుగువిశ్వవిద్యాలయ మొదటి వైస్ ఛాన్సలర్‌గా కొనసాగారు. అపూర్వమైన, అపారమైన సాహిత్యకృషి సలిపిన వీరు1996 సెప్టెంబరు 6వ తేదీన కన్నుమూశారు. భౌతికంగా దూరమైనా, వారందించిన జ్ఞాన కోశంలోని ప్రతి అక్షరంలో చిరంజీవిగా నిలిచి ఉన్నారు.పది కాలాలు నిలిచే ప్రామాణికమైన గ్రంథరచన చేయాలంటే సర్వతోముఖమైన పాండిత్యం కావాలి.నవనవోన్మేషమైన ప్రతిభ కావాలి.పరిశో ధనలో పాటవమూ, సత్యాన్వేషణలో తత్పరతా పరిశ్రమలో ఉత్సాహమూ,నిజాయితీతో కూడిన అవగాహనా,ప్రగతిదృక్ప థమూ, పక్షపాతం లేని తీర్పుకావాలి. ఇదిగో ఇన్నీ మూర్తీభ వించిన ఆచార్యులు డాక్టర్ దొణప్పగారు అంటూ ప్రముఖ కవిపండితుడు పురిపండా అప్పలస్వామి కితాబునిచ్చారు. •



ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతి

# 'సార్క్'కు ప్రత్యామ్నాయ కూటమి!

## చైనా, పాక్, బంగ్లాదేశ్ కొత్త కుట్ర?



**బీజింగ్,జూన్ 30:** దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంస్థ (సార్క్) కూటమిలో భారత్ పాటు భాగస్వాములుగా ఉన్న చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ క్రమంగా మన దేశానికి వ్యతిరేకంగా పావులు కదుపుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు వ్యతిరేకంగా కొత్త కూటమి ఏర్పాటు చేసే దిశగా అడుగులేస్తున్నాయి. ఇప్పటికే ఉన్న సార్క్ కూటమిలో పాకిస్థాన్ ఉందన్న కారణంతో భారత్ దూరంగా ఉంటున్న నేపథ్యంలో ఈ ప్రత్యామ్నాయ కూటమిని తెరపైకి తెస్తున్నాయి. సార్క్ కూటమిలో కీలక సభ్య దేశంగా ఉన్న భారత్ తీవ్రవాదానికి మద్దతిస్తుందన్న కారణంతో గతంలో 2016లో పాకిస్తాన్ ఆతిథ్యమిచ్చిన సమావేశానికి గైర్హాజరైంది. అప్పటి నుంచి సార్క్ కూటమి కార్యకలాపాలు గాడితప్పాయి. తాజాగా అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో చైనా, పాకిస్తాన్ ఉమ్మడిగా కుట్రకు తెరలేపాయి. ఇప్పటికే భారత్‌తో సంబంధాలు అంతంత మాత్రంగా ఉన్న బంగ్లాదేశ్‌ను కూడా కలుపుకుని సార్క్ స్థానంలో కొత్త కూటమి ఏర్పాటుకు అడుగులేస్తున్నాయి. ఈ కొత్తకూటమిలో భారత్‌తో పాటు దక్షిణాసియా దేశాలను సైతం ఆహ్వానించబోతున్నారు.

ఈ నెలలో చైనాలోని కున్మింగ్‌లో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్, ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ ప్రతినిధులు చైనా ఆధ్వర్యంలో జరి గిన త్రైపాక్షిక సమావేశంలోపాల్గొన్నారు. ఇందులో ఈ కొత్త కూటమిపై మూడు దేశాలూ చర్చించినట్లు పాక్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ కున్మింగ్‌లో జరిగిన సమావేశం ముఖ్యఉద్దేశం సార్క్‌లోని ఇతర దక్షిణాసియా దేశాలను కొత్త కూటమిలో చేరమని ఆహ్వానించడమే అని తెలుస్తోంది. ఈ ఏడాది మే నెలలో చైనా, పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ మధ్య త్రైపాక్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చైనా పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌ను విస్తరించడం, తాలిబాన్ పాలిత ఇస్లామిక్ ఎమిరేట్‌లో ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించడంపై చర్చించారు. అయితే ఈ కొత్త కూటమిపై ఇంకా క్లారిటీ రాకపోవడంతో దీనిపై స్పందించిన బంగ్లాదేశ్.. భారత్‌కు వ్యతిరేకంగా తాము ఎలాంటి కూటమి ఏర్పాటు చేయడం లేదని ప్రకటించింది.





# ట్రంప్, నెతన్యాహుపై ఇరాన్ 'ఫత్వా'!

## పశ్చాత్తాపపడేలా చేయాలి : ఇరాన్ పిలుపు

**టెహ్రాన్, జూన్ 30:** తమ దేశం విషయంలో అమెరికా, ఇజ్రాయెల్‌ల వైఖరిని ఇరాన్ తీవ్రంగా ఖండిస్తున్న విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పిస్తోంది. ఈ క్రమంలోనే ఇద్దరు నేతలపై ఇరాన్‌లో 'ఫత్వా' జారీ అయ్యింది. ట్రంప్, నెతన్యాహులను శత్రువులుగా పేర్కొన్న మత పెద్ద అయతుల్లా నాసర్ మకరెం షిరాజీ ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఇస్లామిక్ రిపబ్లిక్ నాయకత్వాన్ని బెదరిస్తున్న ఈ ఇరుదేశాల నాయకులను ఓడించాలని నాసర్ మకరెం షిరాజీ పిలుపునిచ్చారు. ఇస్లామిక్ దేశాలు వారికి సహకారం అందించడం నిషిద్ధమని, వారి తప్పులకు పశ్చాత్తాపపడేలా చేయడం అవసరమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఇస్లామిక్ రిపబ్లిక్ నాయకత్వానికి వ్యతిరేకులుగా పరిగణించిన వారికి ఇరాన్ చట్టాల ప్రకారం మరణశిక్ష కూడా విధించే అవకాశం ఉంటుంది.

**ఇరాన్‌పై అవలీలగా దాడి చేశాం : యుఎస్ అధ్యక్షుడు ట్రంప్**

ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలే లక్ష్యంగా అమెరికా ఇటీవల వాటిపై విరుచుకుపడింది. బి2 బాంబర్ల ద్వారా 'బంకర్ బస్టర్'లను జారవిడిచింది. ఈ దాడులపై ట్రంప్ మరోసారి స్పందించారు. తాము అత్యంత సులభంగా ఫోర్డో అణుస్థావరంపై దాడి చేసినట్లు తెలిపారు. బాంబులు ప్రవేశించకుండా ఇరాన్ ఏర్పాటు చేసుకున్నా.. ఆ ప్రయత్నాలేవీ ఫలించలేదని వ్యాఖ్యానించారు. ఫోర్డో సహా మూడు అణు కేంద్రాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని పునరుద్ఘాటించారు.

# సముద్రంలో ఆయిల్ టాంకర్‌లో మంటలు

## సిబ్బందిని కాపాడిన భారత్ నౌక

**మస్కట్, జూన్ 30:** గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో భారీ అగ్నిప్రమాదానికి గురైన ఒక ఆయిల్ ట్యాంకర్‌కు భారత నౌకాదళం అండగా నిలిచింది. ప్రమాదంలో చిక్కుకున్న 14 మంది భారతీయ సిబ్బందిని రక్షించేందుకు వేగంగా స్పందించి, సహాయక చర్యలు చేపట్టింది. విధి నిర్వహణలో ఉన్న ఐఎన్ఎస్ తబార్ నౌక, అత్యవసర సందేశం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని తన కర్తవ్యాన్ని నిర్వర్తించింది. వివరాల్లోకి వెళ్తే, పలావు దేశానికి చెందిన 'ఎంటీ యీ చెంగ్ 6' అనే ఆయిల్ ట్యాంకర్, భారత్‌లోని కాండ్లా పోర్టు నుంచి ఒమన్‌లోని షినాస్‌కు బయలుదేరింది. ఈ నౌక గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ప్రయాణిస్తుండగా దాని ఇంజిన్ రూమ్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ అగ్నిప్రమాదం కారణంగా నౌకలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ట్యాంకర్ సముద్రంలో నిస్సహాయ స్థితిలో ఆగిపోయింది. ఆ సమయంలో ట్యాంకర్‌లో 14 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. ప్రమాదాన్ని గుర్తించిన వెంటనే ట్యాంకర్ సిబ్బంది అత్యవసర సహాయం కోసం సందేశాలు పంపారు. అదే సమయంలో గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో మిషన్‌లో ఉన్న భారత నౌకాదళానికి చెందిన స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తబార్‌కు ఈ సమాచారం అందింది. ప్రమాద తీవ్రతను గ్రహించిన ఐఎన్ఎస్ తబార్ సిబ్బంది ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ ట్యాంకర్ ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. ఈ ఘటనపై భారత నౌకాదళం అధికారికంగా స్పందించింది. "గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో విధుల్లో ఉన్న మా ఐఎన్ఎస్ తబార్ నౌక నిన్న ఎంటీ యీ చెంగ్ 6 నుంచి వచ్చిన అత్యవసర సందేశానికి స్పందించింది" అని నేవీ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. భారత్ నుంచి ఒమన్ వెళ్తున్న ఈ నౌకలో 14 మంది భారత సిబ్బంది ఉన్నారని, ఇంజిన్ రూమ్‌లో మంటలు చెలరేగడంతో ప్రమాదం జరిగిందని వివరించింది. ఐఎన్ఎస్ తబార్ నౌక సకాలంలో స్పందించి, ట్యాంకర్‌లోని సిబ్బందికి అవసరమైన సహాయాన్ని అందించిందని వెల్లడించింది.

# 2029కి 52 మిలటరీ ఉపగ్రహాలు నింగిలోకి!



## రూ. 26వేల కోట్ల నిధులు కేటాయింపు

## ఇస్రో నుంచి 21 శాటిలైట్ల ప్రయోగం

**న్యూఢిల్లీ,జూన్ 30:** ఆపరేషన్ సిందూర్ తర్వాత సైనిక పరంగా మరింత బలోపేతమయ్యేందుకు భారత్ చర్యలు వేగవంతం చేసింది. పాకిస్థాన్, చైనాతో పాటు హిందూ మహాసముద్రంపై నిఘా కోసం 52 రక్షణ ఉపగ్రహాలను ప్రయోగించాలని నిర్ణయించింది. అందుకోసం ఇప్పటికే రూ.26 వేలకోట్లకు పైగా నిధులను కేంద్రం కేటాయించింది. 2029 నాటికి మిలటరీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు భవిష్యత్తులో నిఘా మిషన్ల కోసం భారత వైమానిక దళం హై ఆల్టిట్యూడ్ ప్లాట్‌ఫామ్ సిస్టమ్ విమానాలపై దృష్టి సారించింది. స్పేస్ బేస్డ్ సర్వైలెన్స్ అంటే అంతరిక్ష ఆధారిత నిఘా వ్యవస్థను అమలుచేస్తోంది. మూడోవిడత కార్యక్రమంలో భాగంగా ఇస్రో 21 ఉపగ్రహాలను ప్రయోగించనుంది. మిగిలిన 31 శాటిలైట్స్‌ను మూడు ప్రైవేటు సంస్థలు అభివృద్ధి చేసి కక్ష్యలోకి చేరనున్నాయి. తొలి ఉపగ్రహాన్ని 2026 ఏప్రిల్ నాటికి కక్ష్యలో ప్రవేశపెట్టాలని ఇస్రో భావిస్తోంది. 2029 చివరికల్లా మొత్తం మిలిటరీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇస్రో స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ టెక్నాలజీని ప్రైవేటు సంస్థలకు బదలాయించి వాటికి ఈ ప్రాజెక్టులో కీలక భాగస్వామ్యం ఇవ్వనుంది.

అత్యవసర సమయాల్లో వేగంగా ఉపగ్రహాలను ప్రయోగించడానికి ఇది ఉపయోగపడనుంది. లోఎర్త్, జియో స్టేషనరీ కక్ష్యలపై దృష్టిపెట్టే ఈ ప్రాజెక్టును ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ పర్యవేక్షించనున్నారు. చైనా యాంటీ శాటిలైట్ సామర్థ్యానికి కౌంటర్‌గా కూడా ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. భారత్ వద్ద 9 నుంచి 11 మిలిటరీ ఉపగ్రహాలు ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఇస్రో వీటినుంచి డేటాను నిరంతరం సైనిక బలగాలకు చేరవేసింది. దీంతో పాటు ఓ కమర్షియల్ గ్లోబల్ ఆపరేటర్ నుంచి చిత్రాలను సేకరించింది. ఇస్రో సొంతంగా వాడే కార్టోశాట్ సిరీస్‌ను కూడా రంగంలోకి దించింది. వీటి సాయంతోనే మన దళాలు పక్కా ప్రణాళిక రచించి, పాక్ సైనిక స్థావరాలను దెబ్బతీశాయి. అమెరికాకు చెందిన మ్యాక్సర్, ఐరోపాకు చెందిన సెంటినెల్ సేవలు కూడా భారత్ వినియోగించుకుంది. వీటి ద్వారా రోజుకు ఒకసారి అయినా చిత్రాలను డౌన్‌లోడ్స్ చేసుకునే వీలు ఉంటుంది. ఇక మన దేశానికి చెందిన ఉపగ్రహాలు పీరియాడిక్ డేటాను 14 రోజులకు ఒకసారి తీసుకొనే అవకాశం ఉంది. తాజాగా చేపట్టిన ప్రాజెక్టు పూర్తయితే భారత్ చేతికి యుద్ధరంగంలోని రియల్‌టైమ్ డేటా వేగంగా అందే అవకాశం ఉంది.

# ఇరాన్ అణు కార్యక్రమం నెలల్లోనే పుంజుకొంటుంది

## ఐఎఇఎ అధిపతి రఫేల్ గ్రాసీ

**టెహ్రాన్, జూన్ 30:** ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా చేసిన దాడుల ప్రభావం కొన్ని నెలలు మాత్రమే ఉంటుందని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) అధిపతి రఫేల్ గ్రాసీ పేర్కొన్నారు. ఇరాన్ అణు కేంద్రాలను నుజ్జు నుజ్జు చేశామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనకు ఇది పూర్తి భిన్నంగా ఉండటం గమనార్హం. టెహ్రాన్ మరికొన్ని నెలల్లోనే అణు ఇంధనం శుద్ధి చేయడాన్ని ప్రారంభించగలదని చెప్పారు. ఈ వ్యాఖ్యలు దాడి అనంతరం వెలువడిన పెంటగాన్ ఇంటెలిజెన్స్ నివేదికలో ఇచ్చిన సమాచారానికి మరింత బలం చేకూర్చేలా ఉన్నాయి.

'నిజం చెప్పాలంటే.. అంతా మాయమైపోయిందని, అక్కడేమీ మిగల్లేదని ఎవరూ చెప్పలేరు. అమెరికా రెండు అణుకేంద్రాలపై 14 బంకర్ బస్టర్ బాంబులు వేసింది. తీవ్రంగా నష్టం వాటిల్లింది. కానీ, పూర్తిగా నాశనమైపోలేదు' అని రాఫేల్ గ్రాసీ పేర్కొన్నారు. ఆ రెండు కేంద్రాల్లో 18,000 సెంట్రిఫ్యూజ్‌లు ఉండొచ్చని గతంలో ఆయన అంచనా వేశారు.

వాస్తవానికి డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ రిపోర్టు పూర్తిగా బంకర్ బస్టర్ బాంబులు ప్రయోగించిన యురేనియం శుద్ధి కేంద్రాలపైనే ఉంది. కానీ, ఇతర గ్రూపుల నుంచి వచ్చిన విశ్లేషణల ప్రకారం ఇరాన్‌కు అతిపెద్ద దెబ్బ ఇస్ఫహాన్‌లో తగిలింది. ఇక్కడ శుద్ధి చేసిన యురేనియంను లోహంగా మార్చేందుకు అవసరమైన ల్యాబ్ అమెరికా దాడిలో ధ్వంసమైంది. ఇది మాత్రం టెహ్రాన్‌కు ఇబ్బందికర విషయమే. అణ్వాయుధం తయారీకి ఈ ప్రక్రియ చాలా కీలకం.

మరోవైపు ఇరాన్ ఉన్నతాధికారుల సంభాషణలను ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టి విశ్లేషించాయి. వారు ఊహించినంత నష్టం వాటిల్లలేదని దీనిని బట్టి తెలుస్తోంది. ట్రంప్ మాత్రం ఇంటెలిజెన్స్ నివేదికలు లీక్ చేసిన సిఎన్ఎన్, న్యూయార్క్ టైమ్స్‌ను కోర్టుకు లాగాలని నిర్ణయించుకొన్నారు.

ఈ విషయాన్ని ఆయన ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. తాము చట్ట ప్రకారం వెళ్లి.. 'జాతీయ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని వారికి ఎవరు ఇచ్చారో వెల్లడించాలి' అన కోరతామన్నారు. మరోవైపు ఇరాన్ దౌత్యవేత్త అమిర్ సయిదీ ఇరావని కూడా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ యురేనియం శుద్ధి ప్రక్రియ ఎప్పటికీ ఆగదని తేల్చి చెప్పారు. శాంతియుత అణుకార్యక్రమం కోసం ఇలా చేసే హక్కు ఇరాన్‌కు ఉందన్నారు.

# 8వతేదీ కంటే ముందే భారత్-యుఎస్ వాణిజ్య ఒప్పందంపై ప్రకటన!

**వాషింగ్టన్, జూన్ 30:** భారత్–అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు జోరుగా జరుగుతున్నాయి. దీనికి సంబంధించి కీలక ప్రకటన జూలై 8 కంటే ముందే వెలువడవచ్చని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఈ చర్చలకు నాయకత్వం వహిస్తున్న వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వాషింగ్టన్‌లో ఉండి తుదివిడత సంప్రదింపులు మొదలు పెట్టారు. ఇప్పటికే ట్రంప్ విధించిన టారిఫ్‌ల సస్పెన్షన్ జూలై 9వ తేదీ వరకు మాత్రమే అమలులో ఉంటుంది. ఎందుకంటే ఈ డెడ్‌లైన్‌ను మరోసారి పొడిగించే ఉద్దేశం తనకు లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫాక్స్ న్యూస్‌కు వెల్లడించారు. అతిత్వరలోనే టారిఫ్‌లు అమలులోకి వస్తాయని పేర్కొన్నారు.

ట్రంప్ భారత్ నుంచి చేసుకొనే దిగుమతులపై విధించిన 26 శాతం టారిఫ్‌లకు జూలై 9 వరకు అమలులోకి రావు. ఇక బేస్‌లైన్ టారిఫ్ 10 శాతం మాత్రమే వర్తిస్తోంది. ఈ చర్చల సందర్భంగా భారత్ 26 శాతం పన్నుపై రాయితీ కోరుతోంది. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, ఆటోమొబైల్, ఇండస్ట్రియల్ గూడ్స్, లేబర్ ఇంటెన్సివ్ ప్రొడక్టుల పైనే దృష్టి పెట్టింది.

ముఖ్యంగా వ్యవసాయం, డెయిరీ రంగాల విషయంలో ఇరు దేశాల మధ్య చిక్కుముడులు నెలకొన్నాయి. భారత్ పాల ఉత్పత్తుల మార్కెట్‌ను విదేశీ సంస్థల కోసం తెరిచేందుకు సిద్ధంగా లేదు. మరోవైపు అమెరికా కొన్ని రకాల ఇండస్ట్రియల్ గూడ్స్‌కు, ఆటో మొబైల్ రంగంలో కన్‌సెషన్లను కోరుతోంది. విద్యుత్ కార్లు, వైన్స్, పెట్రోకెమికల్స్, డెయిరీ, యాపిల్,నట్స్, జన్యు పరమైన మార్పులు చేసిన పంటల విషయంలో లబ్ధి కోసం పట్టుబడు తోంది. గత శుక్రవారం ట్రంప్ మాట్లాడుతూ భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకొనే అవకాశాలున్నాయని సూచన చేశారు. దీనిని అతిపెద్ద ఒప్పందంగా ఆయన పేర్కొన్నారు.



# భోపాల్ గ్యాస్ వ్యర్థాల తొలగింపు ప్రక్రియ పూర్తి!

## భూగర్భగదుల్లో వ్యర్థాల అవశేషాలు నిక్షిప్తం



**భోపాల్,జూన్ 30:** దేశ చరిత్రలో పెను విషాదాన్ని మిగిల్చిన భోపాల్ గ్యాస్ దుర్ఘటనకు సంబంధించిన కీలక ప్రక్రియ ముగిసింది. యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలో దశాబ్దాలుగా పేరుకుపోయిన అత్యంత ప్రమాదకరమైన 337 టన్నుల రసాయన వ్యర్థాలను అధికారులు ఎట్టకేలకు పూర్తిగా దహనం చేశారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత ఈ వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్మూలించడంతో ఆ దుర్ఘటనకు సంబంధించిన ఒక అధ్యాయం ముగిసినట్టయింది. మధ్యప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారి ద్వివేది ఈ వివరాలను వెల్లడించారు. పీథాంపుర్‌లోని ప్రత్యేక డిస్పోజల్ ప్లాంట్‌లో ఈ వ్యర్థాల దహన ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. మార్చి 27న హైకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డుల సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో ఈ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టారు. తొలుత ప్రయోగాత్మకంగా 30 టన్నుల వ్యర్థాలను కాల్చివేయగా, మిగిలిన 307 టన్నులను మే 5 నుంచి జూన్ 30 మధ్య విజయవంతంగా దహనం చేశారు. ఈ వ్యర్థాలను దహనం చేస్తున్న సమయంలో పర్యావరణంపై ఎలాంటి ప్రభావం పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని ద్వివేది స్పష్టం చేశారు.

ప్లాంట్ నుంచి వెలువడే వాయువులను, కాలుష్య కణాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ యంత్రాంగం ద్వారా పర్యవేక్షించారు. పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి హాని కలగకుండా నిర్దేశిత పరిమాణంలోనే వ్యర్థాలను కాల్చివేసినట్లు ఆయన వివరించారు. దహన ప్రక్రియ పూర్తయ్యాక మిగిలిపోయిన బూడిద, ఇతర అవశేషాలను అత్యంత సురక్షితంగా ప్రత్యేక సంచుల్లో ప్యాక్ చేసి, లీకులు లేని కంటైనర్లలో ప్లాంట్‌లోని స్టోరేజ్ షెడ్‌కు తరలించారు. ఈ బూడిదను భూమిలో శాశ్వతంగా పాతిపెట్టేందుకు ప్రత్యేకంగా ల్యాండ్‌ఫిల్ సెల్స్ అంటే భూగర్భ గదులు నిర్మిస్తున్నామని, నవంబర్ నాటికి నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. ప్రణాళిక ప్రకారం అంతా సజావుగా సాగితే ఈ ఏడాది డిసెంబర్ నాటికి బూడిదను శుద్ధి చేసి ఈ సెల్స్‌లో పాతిపెట్టే ప్రక్రియ కూడా పూర్తవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

1984 డిసెంబర్ 2వ తేదీ అర్ధరాత్రి భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ కర్మాగారం నుంచి మిథైల్ ఐసోసైనేట్ విషవాయువు లీకైన ఘటనలో అధికారిక లెక్కల ప్రకారం 3,787 మంది మరణించగా, 5 లక్షల మందికి పైగా తీవ్రంగా ప్రభావితమయ్యారు. ఆ దుర్ఘటన ప్రభావం తరతరాలపై పడిందని, బాధితులు నేటికీ ఆరోగ్య సమస్యలతో పోరాడుతూనే ఉన్నారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.



# ప్రతిభావంతుల శాశ్వతనివాసంకోసం కెనడా కొత్తవీసాలు!

**టొరంటో,జూన్ 30:** విదేశాల నుంచి ప్రతిభావంతులు, ఆర్థిక వలసదారుల శాశ్వత నివాసానికి సంబంధించి కెనడా త్వరలోనే కొత్త విధానాన్ని అమలు చేయనుంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఎకనామిక్ మొబిలిటీ పాత్‌వేస్ పైలట్‌లో మార్పులు చేస్తోంది. దీనివల్ల నైపుణ్యం కలిగిన శరణార్థులు, విదేశీ వ్యక్తులు కెనడాలో శాశ్వత నివాసం, ఉద్యోగ అవకాశాలు పొందనున్నారు. డిసెంబర్ 31తో ముగియబోతున్న పాత పాలసీకిముందే దీనిని ప్రారంభించనున్నట్లు పేర్కొంది. ఇఎంపీపీ విధానాన్ని 2018లో కెనడా ప్రారంభించింది. ఈ విధానం ద్వారా ఈ ఏడాది మార్చి వరకూ సుమారు 970 మంది శరణార్థులు కెనడాలో శాశ్వత నివాసం పొందారు. అమెరికా, కెనడాలు వీసాల విషయంలో కఠిన ఆంక్షలు, నిబంధనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇమ్మిగ్రేషన్. రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (ఐఆర్‌సిసి) విధానంలో భాగంగా విదేశీ కార్మికులు, వ్యవసాయం, మత్స్య పరిశ్రమల్లో పని చేసే వారికి, విద్యార్థులకోసం ఉద్దేశించిన పిజి వర్క్ పర్మిట్, భాగస్వామి ఓపెన్ వర్క్ పర్మిట్ విధానంలోనూ మార్పులు చేయనున్నారు. విదేశీ కార్మికులు, అంతర్జాతీయ విద్యార్థుల జీవిత భాగస్వాములకుకూడా ఇది వర్తిస్తుంది. హెల్త్‌కేర్, ట్రేడ్ వర్కర్లు, ఎడ్యుకేషన్ వర్కర్లు, ఫ్రెంచ్ మాట్లాడే వ్యక్తులకు ఎక్స్‌ప్రెస్‌ఎంట్రీద్వారా ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. ఇప్పటికే కెనడాలో తాత్కాలిక నివాసితులుగా ఉన్నవారిలో కనీసం 40శాతం మందికి శాశ్వత నివాసం కల్పించనున్నారు. భారతీయులకు కెనడా, అమెరికా, యూకేలపై క్రమంగా మోజు తగ్గిపోవడం గనమర్హం. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో మొత్తం 8,34,010 తాత్కాలిక వీసా దరఖాస్తులను కెనడా ఆమోదించగా.. ఇందులో భారతీయులే అధికం 3,82,055 మందివరకూ ఉన్నారు.

# ఐదేళ్లు సిద్ధరామయ్యే సిఎం

## మేం కలిసేఉన్నాం.. ఉంటాం..: డికె



**బెంగళూరు,జూన్ 30:** కర్ణాటక కాంగ్రెస్‌లో విభేదాలున్నాయనే ఊహాగానాలను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కొట్టివేశారు. ఐదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం స్థిరంగా ఉంటుందని స్పష్టం చేశారు. చేతులుకలిపి ఐక్యతను చాటుకున్నారు. సోమవారంనాడు మీడియా సమావేశంలో ఇద్దరు నేతలూ కలిసి పాల్గొన్నారు. మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు దృఢంగా ఉంటుంది. మేము కలిసికట్టుగా ఉన్నాం, కలిసే పనిచేస్తామని సిద్ధరామయ్య తెలిపారు. కర్ణాటక కాంగ్రెస్‌లో గొడవలు ఉన్నాయనే ఊహాగానాలను ఆయన కొట్టివేశారు. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, రాష్ట్ర ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలా రాష్ట్రానికి రావడంపై మాట్లాడుతూ, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడంపై సూర్జేవాలా దృష్టి సారించనున్నట్టు చెప్పారు. పార్టీని పటిష్టం చేయడం కోసం వచ్చారని, ఆయన పని ఆయన చేస్తారని తెలిపారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలను సిద్ధరామయ్య ప్రారంభించడం లేదంటూ విపక్ష నేత ఆర్.అశోక చేసిన వ్యాఖ్యలపై సిద్ధరామయ్య మండిపడ్డారు. బీజేపీ ఒక అబద్ధాల పుట్ట. వాళ్ల పని అదే. డీకే శివకుమార్, నేనూ కలిసే ఉన్నాం. ఈ ప్రభుత్వం ఐదేళ్లు స్థిరంగా పనిచేస్తుంది. బీజేపీ కామెంట్లను మేము పట్టించుకునేది లేదని అన్నారు. ముఖ్యమంత్రి పదవిఅనేది అధిష్ఠానం నిర్ణయం పైనే ఆధారపడి ఉంటుందని కాంగ్రెస్‌అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే సోమవారం మీడియాతో చెప్పారు.

# నిరసనకారుల కాళ్లు విరగ్గొట్టండి.. బహుమతి తీసుకోండి

## పోలీసులకు భద్రత విధుల్లో ఉన్న ఎసిపి విచిత్ర ఆదేశాలు

**పూరి,జూన్ 30:** ఒడిశాలో ఓ సీనియర్ పోలీసు అధికారి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ముఖ్యమంత్రి నివాసం వద్ద నిరసన తెలుపుతున్న ఆందోళనకారుల 'కాళ్లు విరగ్గొట్టండి' అంటూ ఆయన తన సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై విమర్శలు వెల్లువెత్తడంతో వెంటనే స్పందించి తన మాటలను వక్రీకరించారని ఆరోపించారు. ప్రసిద్ధ పూరీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు భక్తులు మరణించిన ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. రద్దీని నియంత్రించడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వ నిరక్ష్యం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి నివాసం సమీపంలో సోమవారం నిరసనకు దిగారు. ఈ క్రమంలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఓ పోలీసు అధికారి, ఆందోళనకారులను అడ్డుకోవాలని తన సిబ్బందికి సూచిస్తూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. వైరల్ అయిన వీడియోలో భువనేశ్వర్ అదనపు పోలీసు కమిషనర్ (ఏసిపి) నరసింహా భోల్ తన సిబ్బందితో మాట్లాడుతూ.. "ఎవరైనా ఇక్కడికివస్తే కాళ్లు విరగ్గొట్టండి. వాళ్లను పట్టుకోవద్దు, కేవలం కాళ్లు విరగ్గొట్టండి చాలు. వారిని పట్టుకోవడానికి మేం కొంచెం దూరంలోఉన్నాం. ఎవరైతే కాలు విరగ్గొడతారో, నాదగ్గరికి వచ్చి బహుమతి తీసుకోండి" అని చెప్పడం స్పష్టంగా వినిపించింది. ఈ వీడియోపై దుమారం చెలరేగడంతో ఎసిపి నరసింహా భోల్ స్పందించారు. తన మాటలను వక్రీకరించారని, పూర్తి సందర్భాన్ని చూడకుండా కేవలం కొన్ని మాటలను మాత్రమే ప్రచారంచేస్తున్నారనిఆరోపించారు. "ప్రతిదానికీఒక సమయం, సందర్భం ఉంటాయి. ఆ వీడియోను పూర్తిగా చూస్తే, నిరసనకారులను అరెస్టు చేయడానికి మేం సిద్ధంగా ఉన్నామని సిబ్బందికి చెబుతున్న విషయం అర్థమవుతుంది" అని తెలిపారు.

# భారత్ నిషేధంతో పాక్‌నుంచి నిలిచిపోయిన ఎగుమతులు

## ఓడరేవుల్లో లంగరువేసుకున్న భారీ నౌకలు

**కరాచి,జూన్ 30:** పహల్గాంలో ఉగ్రవాద దాడి తర్వాత.. మే 2 నుంచి పాకిస్థాన్‌పై భారత్ విధించిన నిషేధంతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతోంది. ముఖ్యంగా భారతీయ పోర్టుల్లో పాకిస్థానీ నౌకలను నిషేధించడంతో ఎగుమతులు, దిగుమతులపై తీవ్ర ప్రభావం పడుతోంది. పాకిస్థాన్ నౌకలపై నిషేధం విధించడంతో భారీ నౌకలు కరాచీ పోర్టులోనే లంగర్ వేసుకుని, ఎదురు చూస్తున్నాయి. భారత పోర్టుల్లో అనుమతి లేకపోవడంతో సాధారణంగా జరగాల్సిన ఎగుమతులు, దిగుమతుల్లో 30 నుంచి 50 రోజుల మేర ఆలస్యం నమోదవుతోంది. భారత్ విధించిన నిషేధంతో లాజిస్టిక్స్ ధరలు గణనీయంగా పెరిగాయని, బీమా ఖర్చులు కూడా పెరిగినట్లు కరాచీకి చెందిన వస్త్రాల ఎగుమతిదారుడు ఆమిర్ అజీజ్ వాపోయారు. ఫలితంగా షిప్పింగ్ ధరలు భారీగా పెరిగినట్లు వివరించారు. భారత్ నిషేధం విధించిన తొలినాళ్లలో పాకిస్థాన్ దొడ్డిదారిలో సరుకు రవాణాకు సిద్ధమైంది. భారత్‌లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) ఈ తరహా దిగుమతులు, ఎగుమతులపై కొరడా ఝుళిపిస్తోంది. యూఏఈ, శ్రీలంక, సింగపూర్ వంటి దేశాల నుంచి పాక్ పంపే సరుకులను కట్టడి చేసేందుకు 'ఆపరేషన్ డీప్ మానిఫెస్ట్'ను ప్రారంభించింది. ఫలితంగా 39 కంటైనర్లలోని రూ.9 కోట్ల విలువ చేసే 1,100 మెట్రిక్ టన్నుల సరుకు సీజ్ అయ్యింది. పాక్ ఈ సరుకును యూఏఈలో తయారైనట్లు తప్పుడు రికార్డులను సృష్టించి, భారత్‌కు తరలించింది. కరాచీ, కాసీం పోర్టులు పాక్ ఎగుమతులు, దిగుమతులకు అత్యంత కీలకం. వీటికి దన్నుగా గ్వాదర్ పోర్టు ఉంది. ఈ మూడు పోర్టులు ఆ దేశ జీడీపీకి 0.5 వాటాను అందజేస్తున్నాయి.

# హెచ్ఐవి బాధితులకు చేయూత

## కొత్తగా 14,084 మందికి పెన్షన్ మంజూరు : మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** హెచ్ఐవి బాధితులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి మానవీయంగా స్పందించింది. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సోమవారం 14,084 మంది కొత్త హెచ్ఐవి బాధితులకు చేయూత పెన్షన్లు మంజూరు చేస్తూ ఫైల్‌పై సంతకం చేశారు. ఈ పెన్షన్లు జూలై నెల నుంచి లబ్ధిదారులు అందుకోనున్నారు. హెచ్ఐవి బాధితులు పూర్తి స్థాయిలో పని చేయలేని స్థితిలో ఉండటంతో పాటు, వారిపై నెలనెలా అధిక వైద్య ఖర్చులు కూడా పడుతు న్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పేదరికంతో బాధపడుతున్న హెచ్ఐవి బాధితుల జీవిత నాణ్యతను మెరుగుపరిచేందుకు చేయూత పథకం కింద ఈ సాయం అందించనున్నారు. ఇప్పటికే 34,421 మందికి నెలకు రూ.2016 చొప్పున పెన్షన్ అందుతోంది. ఇందుకోసం రాష్ట్రం నెలవారీగా రూ.6.93 కోట్లు ఖర్చు చేస్తోంది. 2022 ఆగస్టు తరువాత హెచ్ఐవి కేటగిరీలో కొత్తగా పెన్షన్లు మంజూర వ్వలేదు. అయితే తాజాగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (టిజిఎస్ఎసిఎస్) ఆధ్వర్యంలో కొత్తగా నమోదు అయిన 14,084 మందికి అర్హతలు నిర్ధారించిన అనంతరం ఎస్ఈఆర్‌పి ద్వారా పెన్షన్లు మంజూరు అయ్యాయి.

**జిల్లాల వారీగా అర్హుల సంఖ్య**

హైదరాబాద్ - 3,019, నల్గొండ - 1,388, ఖమ్మం - 954, సూర్యాపేట - 931, కరీంనగర్ - 833, ఆదిలాబాద్ 482, భద్రాద్రి కొత్తగూడెం 556, హన్మకొండ 825, జగిత్యాల 306, జనగాం 228, కామారెడ్డి 702, మహబూబ్ నగర్ 452, నిజామాబాద్ 528, పెద్ద పల్లి 567, సంగారెడ్డి 1242, సిద్దిపేట 527, వికారాబాద్ 544. అయితే జయశంకర్ భూపాలపల్లి, గద్వాల్, మంచిర్యాల, మెదక్, ములుగు, నాగర్‌కర్నూల్, నారాయణపేట, నిర్మల్, రంగారెడ్డి తదితర జిల్లాల్లో కొత్తగా ఒక్కరు కూడా నమోదు కాలేదని అధికారులు తెలిపారు. ఈ నూతన లబ్ధిదారులకు ఈ ఆర్థిక సంవత్సరానికి అంచనా వ్యయం రూ.28.40 కోట్లు కాగా, కావాల్సిన నిధులు ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉన్నాయని అధికారవర్గాలు స్పష్టం చేశాయి. ఇప్పటికే 4020 మంది డయాలసిస్ పేషెంట్లకు ఈ మధ్యే పించన్ మంజూరు చేయగా.. తాజాగా హెచ్ఐవి బాధితులకు పించన్ మంజూరు చేయడంతో ఈ వర్గాలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపాయి.

# బిజెపి, బిఆర్ఎస్ మ్యాచ్‌ఫిక్సింగ్.. కొత్త అధ్యక్షుడి ఎన్నిక

## భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** బిజెపి, బిఆర్ఎస్‌లు మ్యాచ్ ఫిక్సింగ్ తో ఉన్నాయని అందులో భాగంగానే నారపరాజు రామచందర్ రావు రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకం చేపట్టారని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. న్యూఢిల్లీలో చామల కిరణ్ కుమార్‌రెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ గతంలో వర్చువల్ గా ప్రారంభించిన పసుపుబోర్డును మళ్ళీ అమిత్‌షా ప్రారంభించడానికి నిజామాబాద్‌కు రావడం హాస్యాస్పదంగా ఉందని ఎకసెక్కాలు చేశారు.
అస్సలు ఢిల్లీ నుంచి అమిత్‌షా ఎందుకు వచ్చారో తెలియదనీ కేవలం ఈ పర్యటన రాజకీయం కోసం తప్ప, ప్రజాసంక్షేమం లేదని ఆయన అన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు నియామకం కోసమే పసుపు బోర్డు పేరుతో తెలంగాణలో చేసిన రాజకీయాలు చేయడానికి అమిత్‌షా వచ్చారనిఆయన అన్నారు. బిజెపి 8 ఎంపీ సీట్ల గెలుపుకోసం బిఆర్ఎస్ గత లోక్‌సభ ఎన్నికల్లో అయవదానం చేసిన విషయం అందరికీ తెలుసని రేపు రానున్న రోజుల్లోనూ అదే రూట్ మ్యాప్ లో వెళ్ళనున్నారని ఆయన జోస్యం చెప్పారు.
కాంగ్రెస్ తెలంగాణలో దోచుకోలేదని అంతా గత పాలకులు దోచేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి పాలకులు ఏమైనా నిధులు ఇస్తే రాష్ట్రప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ఉపయోగిస్తుందని ఆయన వివరించారు. తెలంగాణకు వచ్చిన అమిత్ షా తప్పుడు వాఖ్యలు చేశారు. కొత్త అధ్యక్షుడు నియా మకం బిజెపి, బిఆర్ఎస్ లు కలిసి తీసుకున్న రూట్ మ్యాప్ హైదరాబాద్ లో మెట్రో కు పునాదులు వేసింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అన్నారు. కిషన్‌రెడ్డి తెలంగాణ, హైదరాబాద్ సమస్యల విషయంలో నోరు విప్పరని విమర్శించారు. హైదరాబాద్ నగర ప్రజలకు కిషన్ రెడ్డి చేసిందేంటి అని ప్రశ్నించారు. ఈ ఏడాది కేంద్రం నయా పైసా ఇవ్వలేదు అని ఆయన అన్నారు. విభజన హామీలు నెరవేరలేదు. హైద్రాబాద్ మెట్రో కోసం ఐదారు సార్లు సిఎం ఢిల్లీకి వచ్చారు, మనం కట్టిన ట్యాక్సుల్లో మన వాటా వెనక్కి రావడం లేదని చామల ఆగ్రహం వ్యక్తంచేశారు. సిఎం రేవంత్ రెడ్డి తన ప్రయత్నం తాను చేస్తున్నారని కిషన్ రెడ్డి కూడా రాష్ట్ర అభివృద్ధి కోసం పని చెయ్యాలి పిలుపునిచ్చారు. పాశ మైలారంలో కెమికల్ కంపెనీలో ప్రమాదం పట్ల విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు., క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# మీ సేవలో కొత్తగా మ్యారేజ్ రిజిస్ట్రేషన్, మార్కెట్ వ్యాల్యూ సర్టిఫికేట్ సేవలు


**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** తెలంగాణ ఈగవర్నెన్స్‌కు ప్రతీకగా నిలిచిన మీ సేవ పౌరసౌకర్యాల విస్తరణలో మరో ముందడుగు వేసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు, మ్యారేజ్ రెజిస్ట్రేషన్, భూముల మార్కెట్ వ్యాల్యూ సర్టిఫికేట్ వంటి కొత్త సేవలను సోమవారం ఆవిష్కరించింది. వీటి కోసం స్లాట్ బుకింగ్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. మీ సేవ కార్యక్రమాల పనితీరును శ్రీధర్ బాబు సచివాలయంలో సమీక్షించారు. ఈ కొత్త సేవలు ప్రజలకు మరింత పారదర్శకతతో కూడిన, వేగవంతమైన సేవలుగా మారనున్నాయి. భూమి, అపార్టుమెంట్ విలువల అంచనాలను 24 గంటల్లోపు ఆమోదించేలా చర్యలు చేపడుతున్నారు. మ్యారేజ్ రెజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా ఇకపై సమర్థవంతంగా జరుగనుంది. మార్కెట్ వ్యాల్యూ మీ సేవ సెంటంలో ఆన్‌లైన్‌లో జిల్లా, గ్రామం వంటి వివరాలను సమర్పించి భూమికి సంబంధించిన తాజా మార్కెట్ విలువను పొందవచ్చు. ఈ దరఖాస్తులను సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం త్వరితగతిన పరిశీలించి నిర్ణయిస్తుంది. మ్యారేజ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో స్లాట్ బుకింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. దరఖాస్తుదారులు పెళ్లి ఫొటోలు, చిరునామా రుజువు, వయస్సు ధృవీకరణ పత్రాలను సమర్పించాలి. ఆమోదం అనంతరం సర్టిఫికెట్‌ను ప్రత్యక్షంగా సబ్‌రెజిస్ట్రార్ ఆఫీసు నుండి జారీ చేస్తారు.
ఈ సేవల ద్వారా ప్రజలు అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, నిర్మాణ రంగం, స్థిరాస్తి కొనుగోళ్ల చేయాలనుకునేవారికి ఎంతో ఉపయోగపడనుంది. తాజా సేవలు అందుబాటులోకి తీసుకురావడం, రాష్ట్ర డిజిటల్ గవర్నెన్స్ దిశగా మరో కీలక అడుగు. ఇప్పటికే మీ సేవ కేంద్రాల్లోపాన్, ఆర్‌టి, ఇసుక బుకింగ్ వంటి సేవలు ఇప్పటికే మీ సేవలో అందుబాటులోకి వచ్చాయి. ఇకపై టీఫైబర్, అదనపు కియాస్కులు కూడా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత దగ్గర చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

# ప్రతి బుధవారం వినియోగదారులతో ముఖాముఖి

## మెరుగైన సేవలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అమలు

## డిటిఆర్‌ల స్థాయిలో నిరంతరం సరఫరా పర్యవేక్షణ

### టిజిఎస్‌పిడిసిఎల్ ముషారఫ్ ఫరూఖీ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిఎండీ ముషారఫ్ ఫరూఖీ, డైరెక్టర్లు శివాజీ, నర్సింహులు, చక్రపాణి, కృష్ణారెడ్డి తదితరులు

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** విద్యుత్ అధికారులు వినియోగదారులకు నిరంతరం అందు బాటులో ఉండాలని, ప్రతి బుధవారం బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తూ ప్రజలతో ముఖాముఖీ కార్యక్రమాలు చేపట్టాలని దక్షి ణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. ఈమేరకు సోమవారం మింట్ కాంపౌండ్ లోనిసంస్థ ప్రధాన కార్యాల యంలో చీఫ్ ఇంజినీర్లు, సూపెరింటెండింగ్ ఇంజినీర్లు, డీఈ లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిఎండీ మాట్లాడుతూ ప్రస్తుతం సంస్థ పరిధిలో 8681 ,11 కేవీ ఫీడర్లు ఉండగా వాటిలో 6885 ఫీడర్ల పరిధిలో ఫీడర్ ఔటేజ్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా విద్యుత్ సరఫరా పర్యవేక్షణ జరుగుతుందని మిగతా ఫీడర్లను కూడా ఈ సిస్టమ్ పరిధిలోకి తీసుకు వస్తామన్నారు.
విద్యుత్ డిమాండ్, సరఫరా, అంతరాయాలు వివరాలను ఆన్లైన్ లో నమోదు చేసి సంబంధిత ఇంజినీర్లను అప్రమత్తం చేసేందుకు డిస్ట్రిబ్యూషన్ స్థాయిలో ఎఐ ఆధారిత సేవలను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో సరఫరా, లోపాలను గుర్తించి మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఏఐ ఆధారిత సేవలు దోహదం చేస్తాయని తెలిపారు.
అదే విధంగా, ప్రతి రోజు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ స్థాయిలో విద్యుత్ సరఫరా పర్యవేక్షణ నిర్వ హించాలని, తరచుగా సమస్యలు ఎదుర్కొం టున్న ఫీడర్లపై, డిటిఆర్‌లపై డివిజనల్ ఇంజినీర్, సూపరిం టెండింగ్ ఇంజినీర్లు ప్రత్యేక దృష్టి సారించాల న్నారు, అలాగే స్వయం గా క్షేత్ర స్థాయిలో పర్యటించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యుత్ డిమాండ్ ఏడాదికి ఏడాదికి భారీగా పెరుగుతుందని దానికి తగట్టుగా చేపట్టాల్సిన చర్యలపై ఆగస్టు 15 లోగా నివేదికలు రూపొందించాలన్నారు. కార్యక్రమం లో డైరెక్టర్ ప్రాజెక్ట్స్- వి.శివాజీ, డైరెక్టర్ ఆప రేషన్ డా. నర్సింహులు, డైరెక్టర్ కమర్షియల్- చక్రపాణి, డైరెక్టర్ ఫైనాన్స్-పి కృష్ణారెడ్డి, జోనల్ చీఫ్ ఇంజినీర్స్ సాయి బాబా, ఎల్ పాండ్య, యు.బాల స్వామి, ఏ కామేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేన్సర్ బాధితులకు నిమ్స్‌లో వైద్య సదుపాయాలకు సిఫార్సు

## 30 అభ్యర్థనలకు వెంటనే పరిష్కారం

### సాంస్కృతిక మండలి చైర్మన్ వెన్నెల

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** కేన్సర్ బాధితులకు నిమ్స్‌లో వైద్య సదుపాయాలు కలిగించి వారికి మెరుగైన వైద్యం అందించాలని నిమ్స్‌లో వైద్యులకు సిఫార్సు చేశామని సాంస్కృతిక మండలి చైర్మన్ వెన్నెల తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో వెన్నెల ప్రజాసమస్యలపై విన్నపాలు స్వీకరిం చారు. ఆమెకు అనేకమంది వైద్యసదుపాయాలు కల్పించాలని, గత ప్రభు త్వం ధరణి కారణంగా గల్లంతైన భూముల హక్కులను పునస్థాపితం కల్పిం చేందుకు సహకరించాలని కోరుతూ విన్నపాలు చేశారని ఆమె తెలిపారు. కేన్సర్ పేషెంట్లు వస్తే నిమ్స్‌తో మాట్లాడామని తెలిపారు. అనేక సమస్యలపై 30 విన్నపాలు తనకు వచ్చాయని వాటిని మంత్రులకు ఇతర అధికారుల దృష్టికి తీసుకొనివెళ్లి పరిస్కారం చేసేందుకు ప్రయత్నం చేశామని ఆమె తెలిపారు.

**ప్రభుత్వ ఇంటర్మీడియట్ కాలేజీలో సీటు ఇప్పించాం**
**సుడా చైర్మన్ కొమటిరెడ్డి నరేందర్‌రెడ్డి**

పదో తరగతి పాసైనా ఇంటర్ సీటు రాని అమ్మాయికి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సీటు ఇప్పించామని శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనలు మేరకు గాంధీభవన్‌లో అందు బాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.



# ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుంది

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సిపిఐ నేతలు

### కూనంనేని, నెల్లికంటి, పల్లా వెంకట్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్30:** ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సోమ వారం సాయంత్రం సీపీఐ నాయకులు కలిశారు. సీఎంను కలిసిన ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, తదితరులు ఉన్నారు. ప్రజా సమస్యలు, పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. గ్రామ పంచాయతీ కార్మికులు, అంగన్వాడీ, ఆర్టీసీతోపాటు పలు ప్రజాసమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి నేతలు తీసుకెళ్లారు.

# బిఆర్ఎస్ భవన్‌ను స్వాధీనం చేసుకోండి

## అధికారులకు ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్ విజ్ఞప్తి




**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారిన బిఆర్ఎస్ భవన్‌ను యుద్ధప్రాతిపదికన స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులకు, సిఎంకి ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సోమ వారం గాంధీభవన్‌లో మీడి యాతో మాట్లాడుతూ 20 యేళ్లలో బిఅరెస్ భవన్లో ఎం జరిగింది అనే దానిపై ఆధారాలు రెడీ పెట్టామని ఆయన వివరిం చారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధి తెలంగాణ సంప్రదా యం పెంపొందిస్తారని ఆనాడు ప్రభుత్వం భూమి కేటాయింపు చేసుకొందని ఆయన తెలిపారు. తెలంగాణ భవన్‌లో అసాంఘిక కార్యకలా పాలు జరుగుతు న్నాయనీ, నేరస్తులకు, రౌడీమూకలకు అడ్డాగా బిఅరెస్‌భవన్ మారిందని ఆరోపించారు. రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు బిఅరెస్ ఆఫీస్ నుండి జరిగాయని ఆయన విమర్శించారు. బిఅరెస్ భవన్ ను ప్రభుత్వం జప్తు చెయ్యాలి బిఅరెస్ కార్యకలాపాలు అక్కడి నుండి తరలించాలని అన్నారు, బిఅరెస్ భవన్ లో టీవ్ ఛానెల్ నడిపించి యాంకర్ ఇబ్బందులకు కారకులు అవుతున్నారని ఆయన అన్నారు. పోలీసు కథనాలు స్పష్టం చేస్తున్నాయి. జర్నలిస్టు స్వేచ్ఛ మృతికి సంతోష్ రావు సన్నిహితుడు పూర్ణచందర్ కారణమని సంపత్ ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం రాయితీలను వెనక్కి తీసుకుని స్థలం స్వాధీనం చేసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీగా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రజలకు చేరవేస్తారని ఆనాడు ప్రభుత్వం భూమి ఇచ్చిందికానీ నియమ నిబంధనలకు విరుద్ధంగా బిఅరెస్ భవన్లో కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. చందాలు వేస్కున్నామనే బిఅరెస్ పార్టీ లో కోట్ల రూపాయల ఫండ్ ఏ రకంగా వచ్చిందని ప్రశ్నించారు.

# బిజెపి, బిఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం

## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ కలిసి పోటీ చేసేందుకు చీకటి ఒప్పందం చేసుకోబోతున్నాయని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆరోపించారు. సిఎల్‌పి కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్ కలయిక మరోసారి తేటతెల్లం అయిందని ఆయనబిజెపి రాష్ట్ర అధ్యక్షుడిఎంపికను ఎత్తి చూపారు. కెసిఆర్ ఆర్ ఎత్తుగడ ఫలించింది ఆయన సూచనల మేరకే బలహీనమైన నాయకుడు రామచంద్రరావు ను బిజెపి అధిష్టానం తెలంగాణఅధ్యక్షుడిగా నియమించిందని అన్నారు. భవిష్యత్తులో బిజెపి, బిఆర్ఎస్ విలీన ప్రక్రియ సాఫీ గా జరగడం కోసమే రామచంద్రరావు ఎంపిక జరిగిందని అన్నారు. బిసిలను మోసం చేసే పార్టీగా బిజెపి నిజ స్వరూపం బయటపడిందనిఆరోపించారు. బిజెపి అంటేనే అగ్రవర్ణాల పార్టీ అని బీర్ల బ్రాండింగ్ వేశారు. కెసిఆర్ ఆలోచనలు, డైరెక్షన్ లో బిజెపి పని చేస్తోందని దీనికి నిదర్శనమే రామచంద్రరావు ఎంపిక అని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అవయవ దానం చేసి బీజేపీ కి ఎనిమిది ఎంపి సీట్లు వచ్చేలా చేసిందని అన్నారు. బిఆర్ఎస్ రుణం తీర్చుకునేలా బలహీనమైన నాయకుడు రామచంద్రరావు ను బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిని చేసింది. గతంలో బిసి నేత బండి సంజయ్ ను అధ్యక్ష పదవి నుంచి బిజెపి తొలగించి కిషన్ రెడ్డిని పెట్టిందని ఆరోపించారు.!దేశంలో మొదట కులగణన చేసిన ఘనత మా ముఖ్యమంత్రి రేవంత్ దే అని అన్నారు. బిడ్డ మహేష్ కుమార్ గౌడ్ పిసిసి అధ్యక్షుడిగా ఉన్నారని తెలిపారు. మంత్రివర్గ విస్తరణలో బిసికి అవకాశం ఇచ్చామని అన్నారు. పార్టీ కార్యవర్గంలో బిసి లకు చోటు కల్పించామని తెలిపారు. తెలంగాణలో బిసి లకు బిజెపి మొండి చేయి చూపించారుని ఆయన వ్యాఖ్యానించారు. కెసిఆర్ చెప్పు చేతల్లో బిజెపి నడుస్తోందని ఆరోపించారు. గతంలో కెటిఆర్, హరీష్ రావు ఢిల్లీ వెళ్లి బిజెపి పెద్దలతో అర్ధరాత్రి సమావేశాలు నిర్వహించారని ఆరోపించారు. బిజెపి లో బిఆర్ఎస్ ను విలీనం చేయడానికి కుట్ర జరిగిందని కవిత స్వయంగా బయటపెట్టింది. బిసిలను అణదొక్కే ప్రయత్నం బిజెపి, బీఆర్ఎస్ చేస్తున్నాయి. బిసిలకు అన్యాయం జరుగుతుందనే ఎమ్మెల్యే రాజాసింగ్ బిజెపి కి రాజీనామా చేశారని ఆయన చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ ను బతికించడానికి బిజెపి ప్రయత్నిస్తోందని అన్నారు. సామాజికన్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమే అని ఆయన అన్నారు. మరో 10 యేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారమని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రధాని మోదీ, అమిత్ షా, నడ్డా బిసిలకు అన్యాయం చేశారని ఆరోపించారు. బిసి ద్రోహులు గా బీజేపీ నేతలను చూస్తున్నారు తెలంగాణ ప్రజలు బిజెపి, బిఆర్ఎస్ లను నమ్మరని అన్నారు.

# 9న జరిగే సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు

## వామపక్షాల సమావేశంలో నిర్ణయం

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** దేశంలో ఈ నెల 9న జరగనున్న సార్వత్రిక సమ్మెకు వామపక్షాల సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఇందుకు సంబంధించి వామపక్ష పార్టీల నేతలు సోమవారం సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో జరిగింది. జాన్ వెస్లీ(సిపి(ఐ)ఎం రాష్ట్ర కార్యదర్శి), కూనంనేని సాంబశివరావు(సిపిఐ రాష్ట్ర కార్యదర్శి) సూర్యం (సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్రకార్యదర్శి), జానకి రాములు (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ, రాష్ట్ర కార్యదర్శి), గాదగోని రవి(ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు), మామిండ్ల రమేష్ రాజా(సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, రాష్ట్ర కార్యదర్శి), బి సురేందర్ రెడ్డి(ఫార్వర్డ్ బ్లాక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) పాల్గొన్నారు. సమావేశంలో ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్టు సంఘాల నేతలు మీడియాకి తెలిపారు. 10 కేంద్ర కార్మిక సంఘాలు, అఖిల భారత స్థాయి రంగాలవారీగా స్వతంత్ర సమాఖ్యలు, సంస్థలతో కూడిన కార్మిక సంఘాల సంయుక్త వేదిక ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 9న జరగనున్న సార్వత్రిక సమ్మెకు తెలంగాణ రాష్ట్రంలోని వామపక్ష పార్టీలు తమ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలిపారు. కార్మికుల మౌలిక ప్రజాస్వామ్య హక్కులను తీవ్రంగా కుదించడానికి ఉద్దేశించిన కార్పొరేట్ ఎజెండాలో కీలక భాగమైన లేబర్ కోడ్లను అమలుచేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూనుకుంటుందని వామపక్షాలు మండిపడ్డాయి. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని నాయకులు తెలిపారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం .. తన నయా ఉదారవాద ఎజెండాను దూకుడుగా అమలు చేయాలని చూస్తోందన్నారు. అందులో లేబర్ కోడ్లు ప్రధానమైన భాగంగా వున్నాయని.. కీలకమైన జాతీయ వనరులను ముఖ్యంగా రక్షణ, కమ్యూనికేషన్ వంటి వ్యూహాత్మక రంగాలను ప్రయివేటీకరించే దిశగా చాలా వేగంగా ప్రభుత్వం ముందుకెళుతోందని నాయకులు విమర్శించారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ జరుగుతున్న ఉద్యమాలను అణచివేయాలని చూస్తోందని వామపక్ష నాయకులు మండిపడ్డారు. రైతాంగం, వ్యవసాయ కార్మికులతోపాటు విస్తృత స్థాయిలో ప్రజానీకం వ్యక్తం చేస్తున్న ఆందోళనలతో సహా కార్మిక సంఘాలు లేవనెత్తిన డిమాండ్లను ఈనెల 9 నాటి సార్వత్రిక సమ్మె ఎలుగెత్తి చాటుతుందని.. ఈ సార్వత్రిక సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాలు మద్దతును ఇచ్చాయని తెలిపారు. సమ్మెను జయప్రదం చేసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించాలని పార్టీల శాఖలన్నింటికీ పిలుపునిస్తున్నట్టు పార్టీల నాయకులు తెలిపారు.

# అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో అడ్మిషన్లు ప్రారంభం

## డిగ్రీ, పిజి కోర్సుల్లో చేరడానికి ఆగస్టు 13 తుదిగడువు

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఓపెన్ యూనివర్సిటీ)లో డిగ్రీ, పిజి అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించారు. ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పిజి కోర్సుల్లో చేరడానికి ఆగస్టు 13 తుది గడువుగా వర్సిటీ ప్రకటించింది. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ (బిఏ/బికామ్/బిఎస్సీ) కోర్సులతోపాటు పిజి కోర్సులైన ఎంఎ/ఎంకామ్/ఎంఎస్సీ కోర్సులతోపాటు బిఎల్ఐసి, ఎంఎల్ఐసి, పిజి డిప్లమా, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరం ప్రవేశానికి అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల అయినట్లు విశ్వవిద్యాలయ అధికారులు సోమవారం తెలిపారు. విశ్వవిద్యాలయం మొదటిసారి సెమిస్టర్ విధానంలో ఆర్ట్స్ సబ్జెక్టుల్లో ఆర్థికశాస్త్రం, చరిత్ర, ప్రజాపరిపాలన, రాజకీయశాస్త్రం, సామాజిక శాస్త్రం.. ఇంగ్లీష్ మీడియంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌ను ప్రవేశపెట్టిందని విద్యార్థి సేవ విభాగాధిపతి పేర్కొన్నారు. అభ్యర్థులు రాష్ట్రంలోని అధ్యయన కేంద్రాల్లో మాత్రమే ఎంచుకోవాలన్నారు. ఆయా కోర్సుల్లో చేరడానికి విద్యార్హతలు, ఫీజు, కోర్సులు తదితర వివరాలను వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందొచ్చని అధికారులు తెలిపారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ట్యూషన్ ఫీజును చెల్లించాలని.. అంతకుముందు చేరిన విద్యార్థులు సకాలంలో ఫీజు చెల్లించలేక పోయినవారు కూడా.. ఆగస్టు 13లోపు ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. పూర్తి సమాచారం కొరకు, ఆన్‌లైన్‌లో నమోదు తదితర అంశాలపై సందేహాలుంటే సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని లేదా విశ్వవిద్యాలయ హెల్ప్‌డెస్క్ నంబర్లు: 7382929570/580, 040-23680290/291/294/295 టోల్‌ఫ్రీ నంబర్ 18005990101 లో సంప్రదించొచ్చని సూచించారు. డిగ్రీ, జిజి ఓల్డ్ బ్యాచ్ విద్యార్థులు రెండో, మూడో సంవత్సరంలో ఫీజు సకాలంలో చెల్లించలేకపోయినవారు.. 2016-17 విద్యాసంవత్సరం నుండి 2024-25 వరకు అడ్మిషన్ పొంది ఉంటే నెట్‌బ్యాంకింగ్/క్రెడిట్/డెబిట్ కార్డ్ లేదా టిఎస్/ఏపి ఆన్ లైన్ ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లించొచ్చని తెలిపారు.

# యాదవులకు మంత్రిపదవి ఇవ్వకుంటే కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతాం

## జూలై రెండో వారంలో ఢిల్లీ జంతర్‌మంతర్‌లో మహాధర్నా

### బిసి జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాం యాదవ్



ప్రసంగిస్తున్న బిసి జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న యాదవులకు మంత్రి పదవి ఇవ్వకపోతే కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి. రాజారాం యాదవ్ హెచ్చరించారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి అయినబోయిన రమేష్ యాదవ్ అధ్యక్షతన యాదవుల సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ముఖ్యఅతిథిగా హాజరై రాజారాం యాదవ్ మాట్లాడుతూ ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులపాలన, కుటుంబపాలన, రెడ్డి పాలన చేస్తున్నారని విమర్శించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు ముఖ్యంగా యాదవులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. స్థానిక సంస్థల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన తరువాతనే ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. జూలై రెండో వారంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా చేపడుతున్నామని ప్రకటించారు. ఢిల్లీ మహాధర్నాలో రేవంత్‌రెడ్డి బీసీ వ్యతిరేక వైఖరిని ఎండగడతామని స్పష్టం చేశారు. రాజకీయంగా యాదవులకు వాటా ఇవ్వకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో యాదవులంతా ఒక్కటై కాంగ్రెస్‌ను ఓడిస్తామని హెచ్చరించారు. యాదవ హక్కుల పోరాట జాతీయ అధ్యక్షులు మేకల రాముల యాదవ్ మాట్లాడుతూ యాదవులకు మంత్రి పదవి ఇవ్వకపోతే ప్రజా కోర్టులో కాంగ్రెస్ పార్టీని దోషిగా నిలబెడతామని హెచ్చరించారు. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింత రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 40 లక్షలకు పైగా ఉన్న యాదవ కురుమలకు రాజకీయంగా న్యాయమైన వాటా ఇవ్వకపోవటం సరికాదని అన్నారు.



డిజిపి కార్యాలయంలో మల్టీ జోన్ 2 ఐజి సత్యనారాయణ పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొని శాలువతో సత్కరిస్తున్న డిజిపి జితేందర్. చిత్రంలో భద్రతల అదనపు డిజి మహేష్‌భగవత్ తదితరులు

# మల్టీజోన్-2 ఐజి సత్యనారాయణ పదవీవిరమణ

## డిజిపి కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** మల్టీ జోన్ 2 ఐజి, సీనియర్ ఐపిఎస్ అధికారి వి.సత్యనారాయణ సోమవారం నాడు పదవీ విరమణ చేశారు. పోలీసు శాఖలో 34 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో సేవలందించిన ఆయన 1991లో మొదట ఎస్ఐగా ఎంపికయ్యారు. ఆ తరువాత గ్రూప్ వన్‌లో ఉత్తీర్ణులై డిఎస్‌పిగా చేరారు. అప్పటి నుంచి ఆయన అంచలంచలుగా అనేక పదవులు చేబట్టారు. హైదరాబాద్‌లో దక్షిణ, పశ్చిమ మండల డిసిపిగా, కరీంనగర్ పోలీసు కమిషనర్‌గా రాచకొండ జాయింట్ పోలీసు కమిషనర్‌గా కూడా ఆయన పనిచేశారు. సత్యనారాయణ సేవలకు గుర్తింపుగా పలు అవార్డులు, రివార్డులు వరించాయి, సోమవా రం ఉదయం పటాన్‌చెరులోని పాశమైలారం పారిశ్రామిక వాడలో రసాయన పరిశ్రమలో జరిగిన భారీ అగ్ని ప్రమాదం ప్రాంతాన్ని ఆయన చివరి వరకు సమీక్షి ంచారు. పదవీ విరమణ రోజున ఆయన ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడ విధులు నిర్వహించడం పలువురి ప్రశంసలను అందుకుంది. కాగా పదవీ విరమణ సందర్భంగా సోమవారం సాయంత్రం డిజిపి కార్యాలయంలో సత్యనారాయణకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి సత్కరించారు. ఈ కార్యక్ర మంలో డిజిపి జితేందర్ పదవీ విరమణ చేసిన సత్యనారాయణకు శాలువా కప్పి సన్మానించారు. డిజిపి మాట్లాడుతూ సత్యనారాయణ పోలీసు శాఖలో ట్రబుల్ షూటర్‌గా పేరొందారని, శాంతి భద్రతల సమస్యలు తలెత్తినప్పుడు సమర్థవంతంగా వ్యవహరించి సమస్యలను చక్కదిద్దారని కొనియాడారు. సత ్యనారాయణ విశ్రాంత జీవితం సాఫీగా సాగాలని డిజిపి కోరారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, ఐజిలు రమేష్, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్‌నాయుడు, శ్రీనివాస్ హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎఐజి రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నక్సలైట్లను చంపగలరేమో, నక్సలిజాన్ని అంతం చేయలేరు

**అమిత్‌షా వ్యాఖ్యలపై సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ స్పందన**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 30:** నక్సలిజం నిర్మూలనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఘాటుగా స్పందించారు. నక్సలైట్లను చంపగలరేమో కానీ, నక్సలిజాన్ని మాత్రం అంతం చేయలేరని ఆయన అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని అమిత్ షా చెప్పడం హాస్యాస్పదంగా ఉందని నారాయణ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ విధానాలు మారనంత వరకు ఇలాంటి సమస్యలు పరిష్కారం కావని ఆయన అభిప్రాయపడ్డారు. నక్సలైట్లతో చర్చలు జరపకుండానే చెప్పడం కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, నక్సలిజంపై కీలక వ్యాఖ్యలు చేశారు. నక్సలైట్లు తక్షణమే హింసను వీడి, ఆయుధాలు పక్కన పెట్టి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. 'గిరిజన బిడ్డలను, పోలీసులను నక్సలైట్లు చంపినప్పుడు వారి తరఫున ఎవరూ మాట్లాడలేదు. కానీ ఇప్పుడు మాత్రం చర్చల కోసం చాలా మంది ముందుకొస్తున్నారు' అని కొందరి వైఖరిని దుయ్యబట్టారు.



బోనాల జాతర ఉత్సవాలలో పాల్గొన్న ఎపి దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి,జి.రాఘవేందర్ తదితరులు

## విజయవాడ కనకదుర్గమ్మకు బంగారు, వెండి బోనాలు సమర్పణ

**హైదరాబాద్ (చార్మినార్), జూన్ 30, ప్రభాతవార్త :** పాతనగర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి ఆధ్వర్యంలో ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి బంగారు, వెండి బోనాలు సమర్పించారు. శ్రీ కనక దుర్గమ్మ ఆలయ ప్రవేశ ద్వారం వద్ద ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కనక దుర్గమ్మ ఆలయ కార్యనిర్వాహణ అధికారి సినా నాయక్‌లు బోనాలకు స్వాగతం పలికారు.కనక దుర్గ అమ్మ వారికి బంగారు బోనాన్ని ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి అధ్యక్షులు జి.రాఘవేందర్ సతీమణి సంగీత,వెండి బోనాన్ని జోగిని శ్యామలదేవి సమర్పించారు.ఈ సందర్భంగా ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి చైర్మన్ రాఘదేందర్ మాట్లాడుతూ అమ్మ వారి ఆశీస్సులతో రెండు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మనసారా కోరుకుంటున్నానని, రెండు రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ప్రనిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి ప్రధాని 5 దేశాల పర్యటన

**అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా, ఘనా, ట్రినిడాడ్ సందర్శించనున్న మోడీ**

**న్యూఢిల్లీ, జూన్ 30:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. జులై 2వ తేదీ నుంచి ఎనిమిది రోజుల పాటు రెండు ఖండాల్లోని ఐదు దేశాల్లో ఆయన పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాలను సందర్శిస్తారు. బ్రెజిల్‌లో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడంతో పాటు, గ్లోబల్ సౌత్‌లోని కీలక దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్ఠం చేసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. విదేశాంగ శాఖ ఆర్థిక సంబంధాల కార్యదర్శి దమ్ము రవి వివరాల ప్రకారం, ప్రధాని మోదీ తన పర్యటనను జులై 2న ఆఫ్రికా దేశం ఘనాతో ప్రారంభిస్తారు.

జులై 3 వరకు అక్కడే ఉంటారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని ఘనాలో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఘనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. అనంతరం జులై 3, 4 తేదీల్లో కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగోలో పర్యటిస్తారు. అక్కడి నుంచి ప్రధాని నేరుగా దక్షిణ అమెరికాలోని అర్జెంటీనాకు వెళ్తారు. జులై 4, 5 తేదీల్లో ఆ దేశంలో పర్యటిస్తారు. అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలేతో మోదీ విస్తృతంగా చర్చిస్తారు. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. అర్జెంటీనా పర్యటన ముగిశాక, ప్రధాని మోదీ జులై 5 నుంచి 8వ తేదీ వరకు బ్రెజిల్‌లో పర్యటిస్తారు. రియో డి జనీరో వేదికగా జరగనున్న 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు.

## బీహార్‌లో 'కూటమి'తో కలిసి మజ్లిస్ పోటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్30:** బీజేపీ, ఎన్‌డీఏ కూటమిని ఓడించేందుకు బిహార్ అసెంబ్లీకి ఈఏడాది చివరలో జరిగే ఎన్నికల్లో పొత్తుకు సంబంధించి మహా కూటమి(మహా ఘట్బంధన్) నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఈసారిఎన్నికల్లో ఎన్‌డీఏను గద్దె దించే లక్ష్యంతో బిహార్ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమామ్‌ప్రణాళిక రూపొందిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ, ఎన్‌డీఏలను నియంత్రించేందుకు ఆర్‌జేడీ, కాంగ్రెస్ పార్టీతో కూడిన మహాకూటమితో కలిసి పోటీ చేయాలని యోచిస్తున్నట్టు వివరించారు. క్రియాశీల కార్యకర్తల బలం ఉన్న సీమాంచల్‌లో మజ్లిస్ పోటీ చేస్తోందని తెలిపారు. మహా కూటమి పార్టీలు ఎన్నికల్లో తమతో కలిసిరాని పక్షంలో బిహార్‌లోని అన్ని నియోజకవర్గాల్లో మజ్లిస్ అభ్యర్థులు పోటీ చేస్తారని ఒవైసీ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ పేరిట బర్త్ సర్టిఫికెట్, నివాస ధృవీకరణతో పాటు తలిదండ్రుల నివాస ధ్రువీకరణ పత్రాలు చూపాలంటే నిరుపేదలు ఎక్కడి నుంచి తీసుకొస్తారని ఆయన ప్రశ్నించారు. దీంతో వేలాది మంది నిరుపేదల పేర్లు ఓటర్ల జాబితాలో చేర్చక పోవచ్చని, నిరుపేదలు ఓటుహక్కు పొందలేరని ఒవైసీ ఆవేదన వ్యక్తం చేశారు.

# మండల స్థాయిలో ధరల నిర్ణయ కమిటీలు ఏర్పాటు చేయండి

**ఇసుక విక్రయ కేంద్రాలు పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేయాలి**

**సబ్ కమిటీ తీసుకున్న నిర్ణయాలు ప్రతిరోజు సమీక్షించాలి**

**డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నేపథ్యంలో సామాన్యులకు సిమెంటు, స్టీల్, ఇటుకలు, ఇసుక అందుబాటులో ఉండేందుకు మండల స్థాయిలో ధరల నిర్ణయ కమిటీలు సమావేశమై ధరలు నిర్ణయించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రెవిన్యూ రిసోర్స్ మొబ లైజేషన్ సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రులు సబ్ కమిటీ సభ్యులైన ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి ప్రగతిపై శాఖల వారీగా మొదట మంత్రుల బృందం సమీక్షించింది.సామాన్యులకు ఇసుక రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉండాలన్న నిర్ణయం గత సమావేశంలో జరిగింది ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 20 కేంద్రాల్లో ఇసుక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు వివరించారు. కాగా మార్కెట్ యార్డులు, ప్రభుత్వ స్థలాల్లో త్వరితగతిన రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో సామాన్యులకు ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని సబ్ కమిటీ సభ్యులు అధికారులకు సూచించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రుల బృందం చర్చించింది. సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో భూముల బేసిక్ విలువను పెంచితే దరఖాస్తుదారులు ముందుకు వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు మంత్రుల బృందానికి సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా గిరిజనులే ఇసుక క్వారీలు నిర్వహించేందుకు చేపట్టిన చర్యలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్ర ప్రజలపై పన్ను భారం మోపకుండా ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించాలని డిప్యూటీ సీఎం, సబ్ కమిటీ చైర్మన్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ రిసోర్స్ మొబలైజేషన్ సబ్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో ప్రతిరోజు సమీక్ష నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సబ్ కమిటీలో చర్చించిన విషయాల్లో ప్రగతి కనబరచాలని ఈ క్రమంలో అధికారులకు ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే తనతో నేరుగా సంప్రదించి ఫైళ్ల కదలికలో వేగం పెంచాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు.



హైదరాబాద్ నగరంలోని కాలుష్య కారక పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలకు తరలించే కార్యక్రమం పై పారిశ్రామిక వాడల వారీగా సబ్ కమిటీ అధికారులతో సమీక్ష నిర్వహించింది. మైన్స్ మరియు జియాలజీ శాఖలో అమల్లో ఉన్న వన్ టైం సెటిల్మెంట్ ప్రగతిని సబ్ కమిటీ సభ్యులు సమీక్షించారు. కమర్షియల్ ట్యాక్స్ విభాగానికి వస్తే దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రం పరిస్థితి మెరుగైన స్థితిలో ఉందని సబ్ కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, కమర్షియల్ టాక్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ, మైన్స్ అండ్ జియాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, కమిషనర్లు శశాంక, హరిత, హరి కిరణ్, గౌతం, సురేంద్రమోహన్ హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రివ్యూ కమిటీపై రాజకీయ ఒత్తిడి?

**ఫోన్ ట్యాపింగ్‌లో సిట్ దర్యాప్తు కొత్త కోణం**

**న్యాయనిపుణులతో చర్చలు**

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాజకీయంగా ప్రకంపనలు రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు కొత్త మలుపు తిరిగింది. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఎస్ఐబి అధికారులు ఇచ్చిన ఫోన్ నంబర్లను ఆమోదం తెలిపిన నాటి రివ్యూ కమిటీ సభ్యులపై ఏదైనా రాజకీయ ఒత్తిడి వుందా...? లేదా ఎలాంటి అం తర్గత విచారణ చేయకుండానే వీటికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా...? అనే అంశంపై సిట్ అధికారులు దర్యాప్తు చేబట్టారు. ఈ కేసులో వాంగ్మూలం ఇచ్చిన నాటి రివ్యూ కమిటీ సభ్యులు ఎవరు కూడా సాక్షిగా సంతకాలు చేయక పోవడంతో దీనిపై ఎలా వ్యవహరించాలనే దానిపై సిట్ అధికారులు న్యాయ నిపుణులతో సమాలోచ నలు జరుపుతున్నారు. ఫోన్ ట్యాపింగ్ అంతా నాటి డిజిపిలు, నిఘా విభాగం బాస్‌ల ఆదేశాల మేరకే జరిగిందని ప్రభాకర్ రావు చెప్పడంతో ఇదే అంశమై అ ప్పటి డిజిపిలు, ఇంటెలిజెన్స్ చీఫ్‌లతో పాటు నాటి హోం శాఖ ముఖ్య కార్యదర్శుల నుంచి సిట్ అధికారులు వాంగ్మూలం తీసుకున్నప్పటికీ ఇందులో వారు సంతకాలు చేసేందుకు నిరాకరించారని సమాచారం. రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు రోజుకో మలుపు తిరుగుతూ సిట్ అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ కేసులో మొదటి నిందితుడుగా వున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు అమెరికా నుంచి భారత్‌కు వచ్చి దీనిపై వాంగ్మూలం ఇవ్వడం మొదలుపెట్టాక అనూహ్య మలుపులు తిరుగుతుండడం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ప్రభాకర్ రావు ఆరు దఫాలు వాంగ్మూలం ఇచ్చిన తరువాత అప్పటి ఎస్ఐబి డిఎస్‌పి ప్రణీత్ రావు సహా ఈ కేసులో బాధితులుగా వున్న ఎంపిలు, ఎంఎల్‌సిలు సహా 260 మంది ప్రజా ప్రతినిధుల వాంగ్మూలాన్ని సిట్ అధికారులు నమోదు చేయడం విదితమే. వీరితో పాటు ఈ కేసులో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి అప్పట్లో వున్న రివ్యూ కమిటీ సభ్యుల వాంగ్మూలాన్ని కూడా నమోదు చేశారు. వీరిలో నాటి చీఫ్ సెక్రటరీలు సోమేష్ కుమార్, శాంతి కుమారి, నాటి హోం శాఖ ముఖ్య కార్యదర్శులు రవి గుప్తా, జితేందర్, డిజిపిలు మహేందర్ రెడ్డి, అంజనీ కుమార్, నిఘా విభాగం బాస్‌లు నవీన్ చంద్, అనిల్ కుమార్‌లు వున్నట్లు తెలిసింది. ఇందులో కొందరి వాంగ్మూలం తాలూకు వివరాలు వెలుగులోకి రాగా ఇంకొందరివి రాలేదు. అయితే వెలుగులోకి వచ్చిన వారిలో ఎవరు కూడా అప్పటి ఘటనలపై తమ వాంగ్మూలం నోటిమాటగా చెప్పినప్పటికీ సాక్షులుగా సంతకం చేసేందుకు నిరాకరించారని తెలిసిం ది. నాటి ఘటనలపై తమకు తెలిసిన సమాచారం. తమ వద్ద వున్న వివరాలను వారు వెల్లడించినప్పటికీ వాంగ్మూలం తాలూకు కాగితాలపై సంతకాలు తాము చేయలేమని, దీని వల్ల తాము భవిష్యత్తులో ఇబ్బందులు పడతామని వారు సిట్ అధికారులకు స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో ఫోన్ ట్యాపింగ్‌పై ఎలా ము ందుకు వెళ్లాలనే దానిపై సిట్ అధికారులు న్యాయ నిపుణులతో చర్చిస్తున్నట్లు తెలిసింది. కాగా ఈ కేసులో మొదట్లో వాంగ్మూలం ఇచ్చిన నలుగురు నిందితులు ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్ రావులు అప్పటి రాజకీయ నేతల పేర్లు వెల్లడించడం తెలిసిందే. దీనిపై పోలీసులు కోర్టుకు ఛార్జిషీటు కూ డా సమర్పించారు. అయితే ఇదే అంశాన్ని నాటి రివ్యూ కమిటీ సభ్యులుగా వున్న అప్పటి సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు అంగీకరనిస్తున్నప్పటికీ సంత కాలు చేసేందుకు ఇష్టపడక పోవడం సిట్ అధికారులకు ఎటూ పాలుపోవడం లేదు. ఫోన్ ట్యాపింగ్‌పై మరికొందరు నిందితులుగా నిర్ధారణ కావాలంటే మరిన్ని ఆధారాలు కావాల్సి వుంది. ఈ ఆధారాల కోసం సిట్ అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నా కీలక విషయాలు వెల్లడించిన బ్యూరోక్రాట్లు సంతకాలు చేయ క పోవడంతో దీనిపై కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయడం కష్టంగా మారే వీలుంది. ఈ కేసులో ముందుకు సాగాలంటే రివ్యూ కమిటీ సభ్యుల వాంగ్మూలం కీలక ంగా మారింది. ఈ నేపథ్యంలో వారిని మరోసారి విచారించి వాంగ్మూలం తీసుకుని, దీనిపై వారి సంతకాలు తీసుకోవాలని సిట్ అధికారులు భావిస్తున్నారు. ఈ విషయంలో వారిపై ప్రభుత్వం నుంచి ఒత్తిడి తేవాలని భావిస్తున్నట్లు సమాచారం. దీనిపై న్యాయ నిపుణుల సూచనల మేరకు సిట్ అధికారులు ముందుకు వెళ్లే వీలుందని తెలుస్తోంది.

# సున్నంచెరువులో అక్రమ నిర్మాణాల కూల్చివేత

**70 గుడిసెలను తొలగించిన హైడ్రా**

**చెరువు సమీపంలో వేసిన బోర్లు తొలగింపు**

**హైడ్రాను అడ్డుకున్న ఎమ్మెల్యే గాంధీ**



సున్నం చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలోని గుడిసెలను తొలగిస్తున్న దృశ్యం

**హైదరాబాద్( సైబరాబాద్ ప్రతినిధి), జూన్ 30, ప్రభాతవార్త:** మాదాపూర్‌లోని సున్నం చెరువులో నూతనంగా వెలసిన గుడిసెలను హైడ్రా అధికారులు తొలగించారు. సోమవారం తెల్లవారు జామునే సున్నం చెరువు వద్దకు చేరుకున్న హైడ్రా అధికారులు భారీ పోలీస్ బందోబస్తు మధ్య తొలగింపు చర్యలు చేపట్టారు. మొత్తం 32 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సున్నం చెరువును 10 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించిన హైడ్రా చెరువు ఎఫ్‌టిఎల్ అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగిస్తున్నారు. ఇందులో భాగంగానే ఏడాది కాలంగా సున్నం చెరువులో వెలసిన భవనాలను, గుడిసెలను హైడ్రా అధికారులు తొలగిస్తుండగా మరోవైపు నూతనంగా గుడిసెలు పుట్టుకొస్తున్నాయి. దీంతో హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించి చెరువును అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. కాగా గుడిసెలను తొలగిస్తుండగా తమకు గుడిసెలే ఆధారమని మరోచోట పునరావాసం కల్పించిన తరువాతనే తమని ఇక్కడి నుంచి ఖాళీ చేయించాలని పేదలు పట్టుబట్టారు.

**జెసిబిలను వెనక్కి పంపిన ఎమ్మెల్యే**



సోమవారం ఉదయం హైడ్రా కూల్చివేతల విషయాన్ని తెలుసుకున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఘటనాస్థలానికి చేరుకుని హైడ్రా పేదల విషయంలో అడ్డగోలుగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లే అవుట్‌లోని ప్లాట్‌లను సైతం కూల్చివేయడం సరికాదన్నారు. హద్దులు నిర్ణయించకుండా ఎలా కూల్చివేతలు చేపడతారని, ముందు హద్దులు నిర్ణయించి అందులో ఉన్న నిర్మాణాలను కూల్చాలని, కానీ ఇష్టారీతిగా కూల్చివేతలు చేపట్టడం ఏంటని ఎమ్మెల్యే గాంధీ హైడ్రా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను ఇబ్బందులు పెడితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని గాంధీ స్పష్టం చేశారు. సున్నం చెరువు అభివృద్ధిని చేపట్టిన హైడ్రా అధికారులు ఆ చుట్టుపక్కల ఉన్న ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో చెరువును పూడ్చిన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి తహశీల్దార్‌ను కోరామని కానీ ఎక్కడా ఆక్రమణలు ఆగలేదని ఆరోపించారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటే అందరూ సహకరిస్తారని, కానీ సామాన్యుల జోలికి వస్తే వ్యతిరేకత తప్పదని ఎమ్మెల్యే గాంధీ హెచ్చరించారు. హైడ్రా అధికారులు సర్వే చేపట్టిన విధంగానే పనులు చేపట్టాలని, ఇష్టారీతిగా పనులు చేసి ఆక్రమణదారులను వదిలేసి, పేదలను ఇబ్బందులు పెడితే హైడ్రాకు వ్యతిరేకత తప్పదన్నారు. సున్నం చెరువులో కూల్చివేతలను వెంటనే ఆపేయాలని హైడ్రా అధికారులను ఆదేశించారు.

# పిసి ఘోష్ కమిషన్‌కు కేబినెట్ మినిట్స్‌ను అందజేసిన ప్రభుత్వం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 30:** జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలోని కమిషన్‌కు కాళేశ్వరం ప్రాజెక్టు సంబంధిత అవకతవకలపై సోమవారం తెలంగాణ ప్రభుత్వం కేబినెట్ మినిట్స్ సమర్పించింది. ఈ నివేదికలో ప్రభుత్వం పలు కీలక అంశాలను ప్రస్తావించినట్టు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, ముఖ్యంగా మేడిగడ్డ బ్యారేజ్, కేవలం పరిపాలన అనుమతి (అడ్మినిస్ట్రేటివ్ అప్రూవల్) ఆధారంగానే జరిగిందని, దీనిపై 2016-2017 కాలంలో కేబినెట్‌లో ఎలాంటి సవివరమైన చర్చ జరగలేదని నివేదిక స్పష్టం చేసింది. 2016 మార్చి 1న మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణానికి పరిపాలన అనుమతి ఇవ్వగా, పనులు ప్రారంభమయ్యే సమయానికి వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) కూడా సిద్ధం కాలేదని తెలిపింది. అనుమతి ఇచ్చిన ఏడాది తర్వాత, 2017లోనే మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రాజెక్టుపై తొలిసారి చర్చ జరిగినట్లు నివేదిక పేర్కొంది. ప్రాజెక్టు రీడిజైన్లో భాగంగా, గతంలో ప్రాణహిత చేవెళ్ల పథకం కింద తమ్మిడిహెట్టి వద్ద ప్రతిపాదిత బ్యారేజీని మేడిగడ్డకు మార్చడం, మూడు బ్యారేజీలు (మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల), 19 పంప్ హౌస్లు, 20 రిజర్వాయర్లతో నిర్మాణం కొనసాగిందని తెలిపింది.కాళేశ్వరం ప్రాజెక్ట్ పై కాగ్ ఇచ్చిన నివేదికలో ప్రాజెక్టు వ్యయం రూ.1.47 లక్షల కోట్లకు పైగా ఉంటుందని తెలిపింది. నిర్మాణ లోపాల వల్ల మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు 2023 అక్టోబర్ 22న కుంగిపోయాయని, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు కూడా నీటి నిల్వకు పనికిరావని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఏ) తేల్చినట్లు నివేదికలో ఉంది. జస్టిస్ ఘోష్ కమిషన్, నీటిపారుదల శాఖ మాజీ ఇంజనీర్లు, ఐఏఎస్ అధికారులు, పలువురు బీఆర్ఎస్ నేతల నుండి అఫిడవిట్లు సేకరించి, డిజైన్, నాణ్యత, ఆర్థిక అంశాలపై విచారణ జరుపుతోంది. కాగా, పీసీ ఘోష్ విచారణ కమిషన్ ముందు హాజరైన ఈటల రాజేందర్,హరీశ్‌రావు కాళేశ్వరం ప్రతిపాదనలకు,డిజైన్లకు కేబినెట్ ఆమోదం ఉందని చెప్పడంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి పీసీ ఘోష్ లేఖ రాసి కాళేశ్వరంపై కేబినెట్ మినిట్స్ అందజేయాలని కోరింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం పీసీ ఘోష్‌కు కేబినెట్ మినిట్స్ వివరాలు అందజేసింది.

## ఐఎఎస్ అధికారి అర్వింద్‌కుమార్, హెచ్‌ఎండిఎ మాజీ అధికారిపై లోకాయుక్తలో ఫిర్యాదు

**పుప్పాలగూడలో ప్రభుత్వ భూములను ప్రైవేటుదంటూ బడా సంస్థకు అప్పగింత**

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్‌ఎండిఎలో ప్లానింగ్ విభాగం డైరక్టర్‌గా వుంటూ ఎసిబికి చిక్కి జైలు పాలైన శివ బాలకృష్ణలపై లోకాయుక్తలో సోమవారం ఫిర్యాదు నమోదయ్యింది, ఇమ్మనేని న్యాయవాది రామారావు ఈ ఫిర్యాదు దాఖలు చేశారు. శివార్లలోని పుప్పాలగూడలో సర్వే నంబర్ 277, 280, 281లో గల ప్రభుత్వ భూములను ప్రైవేటు భూములుగా చెబుతూ డిఎస్‌ఆర్‌ఎస్ ఎస్ఐ అనే సంస్థకు ఇద్దరు అధికారు లు అప్పగించారని న్యాయవాది రామారావు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. వేల కోట్ల రూపాయల విలువైన ఈ భూములను అర్వింద్ కుమార్, శివబాలకృష్ణ లు లంచాలు తీసుకుని సదరు ప్రైవేటు సంస్థకు అప్పగించడం వల్ల ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లిందని ఆయన తన పిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై వెం టనే విచారించి అర్వింద్ కుమార్, శివబాలకృష్ణలపై చర్యలు తీసుకోవాడంతో పాటు వారి హయాంలో ప్రైవేటు పరమైన ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని న్యాయవాది ఇమ్మనేని రామారావు కోరారు.

## ప్రశాంతంగా ముగిసిన టెట్-2025 పరీక్షలు

**5న ప్రాథమిక కీ విడుదల**

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జూన్ 18 నుంచి 30 వరకు నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)-జూన్-2025 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షలకు 74 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. టెట్-2025కి సంబంధించిన ప్రాథమిక కీని ఈ నెల 5న విడుదల చేయనున్నట్టు పాఠశాల విద్య డైరక్టర్, టెట్-2025 ఛైర్మన్ నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక కీపై అభ్యంతరాలను అభ్యర్థులు ఈ నెల 8 వరకు సమర్పించాలని సూచించారు. పరీక్షలను జూన్ 18 నుంచి 30 వరకు 18 సెషన్‌లుగా నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా 66 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. టెట్ పరీక్షలకు రాష్ట్రంలో 1,83,653 దరఖాస్తులు వచ్చాయి. అందులో పేపర్-1కి 63,261 మంది, పేపర్-2కి 1,20,392మంది దరఖాస్తు చేసుకోగా.. 2 పేపర్లకు కలిపి 15,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. పేపర్-1 పరీక్షలకి 63,261 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 47,224 మంది (74.65 శాతం) పరీక్షకు హాజరయ్యారు. పేపర్-2లో భాగంగా గణితం అండ్ సైన్స్ పరీక్షకి 66,686 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 48,998 మంది(73.48 శాతం) మంది హాజరయ్యారు. పేపర్-2 సోషల్ స్టడీస్‌కి 53,706 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 41,207 మంది(76.73శాతం) పరీక్షలకి హాజరయ్యారు. పరీక్షలను రాష్ట్రంలోని 15 జిల్లాల్లో 66 కేంద్రాల్లో నిర్వహించారు. 9 రోజులపాటు 16 సెషన్‌లలో పరీక్షలను నిర్వహించారు. పరీక్షలను ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సిద్ధిపేట, సూర్యాపేట, వరంగల్ జిల్లాల్లో నిర్వహిస్తున్నారు.

## టేకాఫ్ అయిన వెంటనే కుప్పకూలిన విమానం

**ఆరుగురు దుర్మరణం**

**ఒహాయో (అమెరికా), జూన్ 30:** అమెరికాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఒహాయో రాష్ట్రంలో ఒక చిన్న విమానం కూలిపోయిన ప్రమాదంలో ప్రయాణిస్తున్న ఆరుగురు వ్యక్తులు మరణించారు. విమానం టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలకే ఈ దుర్ఘటన సంభవించింది.ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, యంగ్స్‌టౌన్‌వారెన్ ప్రాంతీయ విమానాశ్రయం నుండి ఆదివారం ఉదయం ఆరుగురు ప్రయాణికులతో బయలుదేరిన సెస్నా 441 విమానం గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికే కుప్పకూలింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ఈ దుర్ఘటనలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని వెస్టర్న్ రిజర్వ్ పోర్ట్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆంతోనీ ట్రెవెనా ధ్రువీకరించారు. మృతదేహాలను ట్రంబుల్ కౌంటీ కరోనర్ కార్యాలయానికి తరలించినట్లు ఆయన వెల్లడించారు. మృతుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. వారి గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన ప్రాంతం చాలా కష్టతరంగా ఉందని, అక్కడికి చేరుకోవడానికి సహాయక బృందాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని హౌలాండ్ టౌన్‌షిప్ అగ్నిమాపక విభాగం చీఫ్ రేమండ్ పేస్ వివరించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు పేర్కొన్నారు.

# సిబిల్ స్కోర్ 650 పాయింట్లు ఉంటేనే పంట రుణాలు

**పరిగణనలోకి మూడేళ్ల రికవరీ ట్రాక్**

**బ్యాంకు రుణాలకు రైతులు దూరం**

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** తెలంగాణలో వానాకాలం సాగు ప్రారంభమైంది. దుక్కులు, విత్తనాలు, ఎరువులు తదితర వాటికి పెట్టుబడులు అవసరం. ఈ నేపథ్యంలో బ్యాంకులు రైతులకు పంట రుణాలు మంజూరు చేయాల్సి ఉంటుంది. అయితే ఈ పంట రుణాలను మంజూరు చేయడంలో బ్యాంకులు కొత్త నింబధనలను తెరముందుకు తెస్తున్నాయి. సిబిఎల్ (క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఇండియా లిమిటెడ్ (సిఐబిఐఎల్) స్కోరు ఉంటేనే పంట రుణాలు ఇస్తామని పలు బ్యాంకులు కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కచ్చితంగా అమలుచేస్తున్న ఈ సిబిల్ స్కోర్ నిబంధన రైతులకు ఇబ్బందికరంగా మారింది. ఆర్‌బీఐ నిబంధన పేరుతో పంట రుణాలకు సైతం సిబిల్ స్కోర్‌ను బ్యాంకులు పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

సిబిల్ స్కోర్ కనీసం 700 నుంచి 650 పాయింట్లు ఉంటేనే రుణాలు ఇస్తున్నట్లు పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిబిల్ స్కోర్ నిబంధనతో ప్రధానంగా చిన్న,సన్నకారు రైతులు రుణాలు పొందలేని పరిస్థితి ఏర్పడింది. రుణాల రికవరీలో మూడేళ్ల ట్రాక్ రికార్డ్ చూస్తున్నామని, ఆ రికార్డు సరిగా ఉంటే రైతులకు సిబిల్ స్కోర్ తక్కువ ఉన్నా రుణాలు ఇస్తున్నామని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. గత రుణాల చెల్లింపుల్లో ఒకటి, రెండు నెలల వ్యత్యాసం ఉన్నా రుణాలు మంజూరు చేస్తున్నామని పేర్కొంటున్నారు. అయితే చిన్న, సన్నకారు రైతులు చాలామందికి ట్రాక్ రికార్డు ఉండడం లేదు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో రుణమాఫీ పథకం దశలవారీగా అమలు చేయడంతో పంటరుణాలు పొందిన రైతులందరికీ రుణాల మాఫీకి ఐదేళ్ల సమయం పట్టింది. అదేవిధంగా వడ్డీల భారమూ ఎక్కువైంది. దీంతో పలువురు చిన్న, సన్నకారు రైతులు వడ్డీలు చెల్లించలేక, రుణాలు రెన్యువల్ కూడా చేయించుకోలేకపోయారు. దీంతో ఫెనాల్టీలు కలుపుతూ వచ్చిన బ్యాంకర్లు ఆ రైతుల ఖాతాలను డీఫాల్టర్ కింద, నిరర్థక ఆస్తుల కింద ప్రకటించారు. దీంతో ఇటీవల జరిగిన రుణమాఫీ పథకంలో సైతం ఈ రైతుల పేర్లను జాబితాల్లో చేర్చకపోవడంతో వారంతా రుణమాఫీ పథకానికి దూరమయ్యారు. అదేవిధంగా ఈ ఏడాది అమలైన రుణమాఫీ పథకం సైతం విడతల వారీగా కొనసాగడంతో రైతులంతా సకాలంలో వడ్డీగానీ, అసలుగానీ చెల్లించలేదు. దీంతో రుణఖాతాల రెన్యూవల్ నిలిచిపోయింది.

గత ఏడాది వరకు ఏటా రుణాలు చెల్లించిన రైతులు సైతం రుణమాఫీ జమయ్యాక బ్యాలెన్స్ ఉంటే చెల్లిద్దామనే ఆలోచనతో వేచి ఉండడంతో వారందరి సిబిల్ స్కోర్ పడిపోయింది. దీంతో లక్షలాది మంది చిన్న, సన్నకారు రైతులు పంటరుణాలు పొందడానికి అనర్హులుగా తేలారు.

మరోపక్క బంగారం తాకట్టు పెట్టి తీసుకునే పంట రుణాలకు సైతం సిబిల్ స్కోర్ పరిగణనలోకి తీసుకుంటుండడంతో రైతుల్లో కలవరం మొదలైంది. పంటరుణాలకు బ్యాంకర్లు సిబిల్ స్కోర్ పరిశీలించడం సరికాదని, ఈ నిబంధనను సడలించాల్సిందేనని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# విజువల్ బ్యూటీ మూవీ 'తమ్ముడు'

సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న మరో సూపర్ హిట్ మూవీ తమ్ముడు. నితిన్ హీరోగా దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమ్ముడు సినిమా జూలై 4న వరల్డ్ వైడ్ గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ హైలైట్స్ ను ఇంటర్వ్యూలో తెలిపారు డైరెక్టర్ శ్రీరామ్ వేణు. తమ్ముడు సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ తో పాటు డిఫరెంట్ లేయర్స్ ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం. సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దు అనుకున్నాం. ఒప్పుకుంటే యు బై ఎ సర్టిఫికెట్ ఇచ్చేవాళ్లు. సినిమాలోని ఎస్సెన్స్‌ను సరిగ్గా ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలనే కట్స్ లేకుండా ఎ సర్టిఫికెట్ తీసుకున్నాం. ఇది మా అందరి ఉమ్మడి నిర్ణయం. దిల్ రాజు ఒక్కరే ఈ డెసిషన్ తీసుకోలేదు. సినిమాలో అంతగా హింస లేదు. కొత్తగా వచ్చిన సెన్సార్ ఆఫీసర్స్ స్ట్రిక్ట్‌గా ఉన్నారు. వాళ్లనూ తప్పు పట్టలేం. వారి గైడ్ లైన్స్ ప్రకారం వర్క్ చేస్తుంటారు. ఈ కథలో హీరోతో పాటు ఐదుగురు లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, స్వసిక విజయన్, దిత్య ముఖ్యమైన పాత్రలు చేశారు. హీరో అంటే ఇంత లెంగ్త్ ఉండాలి అనేది తమ్ముడులో ఉండదు.



డైరెక్టర్ శ్రీరామ్ వేణు

హీరోతో పాటు ఐదుగురు వుమెన్ క్యారెక్టర్స్ బలంగా ఉంటాయి. విక్రమ్ లో కమల్ హాసన్ గారి క్యారెక్టర్ కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా మా మూవీలోనూ ఉంటుంది. కథ ప్రకారమే తమ్ముడు టైటిల్ పెట్టాం. తమ్ముడు కథ విని దిల్ రాజు బడ్జెట్ గురించి ఆలోచించకుండా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. అంతకుముందు మా కాంబోలో ఐకాన్ మూవీ కోసం వర్క్ చేసుకున్నాం. ఆ తర్వాత ఈ మూవీ స్టార్ట్ చేశాం. ఈ కథకు సెట్ అయ్యే హీరో కోసం సెర్చ్ జరిగింది. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూరితో తమ్ముడు కథను సిద్ధం చేసుకున్నా. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్ ఒకరికి కథ చెప్పాను. ఆమెకు స్టోరీ, క్యారెక్టర్ నచ్చింది కానీ తన పర్సనల్ రీజన్స్ వల్ల నటించ లేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పింది. ఆ తర్వాత లయ ప్రాజెక్ట్‌లోకి వచ్చారు. ఆమెది ఈ మూవీలో 90 డేస్ క్యారెక్టర్. తను బాగా సపోర్ట్ చేసి మూవీ ఫినిష్ చేసింది. మన సినిమాల్లో ఫైట్స్ త్వరగా వచ్చి వెళ్తుంటాయి. మా సినిమాలో ఫైట్స్‌ను ఎపిసోడ్స్ ఫీల్ ఉండేలా రూపొందించాం. ఈ ఫైట్ సీక్వెన్సులు మంచి ఇంపాక్ట్ ఉంటాయి. కథను కాంప్రమైజ్ కాకుండా తెరకెక్కించాలనే ప్రయత్నిస్తుంటాను.

# 'హారి హార వీరమల్లు'లో బాబీ డియోల్ పాత్ర సుపర్బ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం హారి హార వీరమల్లు. ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఎ.దయాకర్ రావు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పీరియాడికల్ డ్రామాకు ఎ.ఎం. జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. జూలై 24న విడుదల కానున్న హారి హార వీరమల్లు సినిమాపై అంచనాలు తారా స్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలకు విశేష స్పందన లభించింది. జూలై 3న ట్రైలర్ ఆవిష్కరణ జరగనుంది. హారి హార వీరమల్లు చిత్రానికి సంబంధించి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఇది పవన్ కళ్యాణ్ మొదటి పాన్ ఇండియా సినిమా కావడం విశేషం. అలాగే పవన్ కళ్యాణ్ మునుపెన్నడూ కనిపించని విధంగా మొదటిసారి చారిత్రక యోధుడి పాత్రలో కనువిందు చేయనున్నారు. ఇక యానిమల్ సినిమాలో తనదైన నటనతో ఆకట్టుకున్న బాబీ డియోల్.. హారి హార వీరమల్లులో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు పాత్ర పోషిస్తుండటం మరో ప్రత్యేకతగా చెప్పవచ్చు. నిజానికి బాబీ డియోల్ పాత్రకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ప్రారంభంలోనే చిత్రీకరించారు. కానీ, యానిమల్‌లో బాబీ నటనను చూసిన తర్వాత దర్శకుడు జ్యోతి కృష్ణ హారి హార వీరమల్లులో ఆయన పాత్రను పునః రచించాలని నిర్ణయించుకున్నారు. ఆ పాత్రను సరికొత్తగా తీర్చిదిద్ది, మరింత శక్తివంతంగా మలిచారు. యానిమల్ చిత్రంలో బాబీ డియోల్ నటన అద్భుతం. పాత్రకు సంభాషణలు లేకపోయినా, హావభావాల ద్వారానే భావోద్వేగాలను వ్యక్తపరిచిన ఆయన అసమాన ప్రతిభ ఆశ్చర్యపరిచింది. అందుకే మా సినిమాలో కూడా ఆయన పాత్ర కోణాన్ని మార్చి, పూర్తిగా సరికొత్త రూపం ఇవ్వాలని నిర్ణయించుకున్నాను" అని జ్యోతి కృష్ణ అన్నారు. జ్యోతి కృష్ణ దర్శకత్వ బాధ్యతలు స్వీకరించిన తర్వాత అన్ని విభాగాల్లో తనదైన ముద్ర వేస్తున్నారు. బాబీ డియోల్ పోషించిన ఔరంగజేబు పాత్ర విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. బాబీ డియోల్ నటనలోని భావోద్వేగ లోతును తీసుకురావడం కోసం.. ఆ పాత్రను ఎంతగానో మెరుగుపరిచారు. జ్యోతి కృష్ణ దిద్దిన మెరుగులతో ఔరంగజేబు పాత్ర మరింత బలంగా, ఆకర్షణీయంగా మారింది.



యానిమల్ తర్వాత బాబీ డియోల్ సరికొత్త స్టార్‌డమ్ చూశారు. ఆ స్టార్‌డమ్‌కి న్యాయం చేయడానికి మరియు ఆయనపై ఉన్న అంచనాలను అందుకోవడానికి ఔరంగజేబు పాత్రకు మరింత ఆకర్షణీ యమైన ఆర్క్ అవసరమని జ్యోతి కృష్ణ భావించారు. అందుకే ఆ పాత్ర వ్యక్తిత్వం, నేపథ్య కథ, ఆహార్యం వంటి అంశాల్లో కీలక మార్పులు చేశారు. నేను సవరించిన స్క్రిప్ట్‌ను చెప్పినప్పుడు, బాబీ చాలా ఉత్సాహపడ్డారు. ఆయన తనని తాను కొత్తగా ఆవిష్కరించుకోవ డానికి ఇష్టపడే నటుడు. హారి హార వీరమల్లులో బాబీ డియోల్ ఎంతో శక్తివంతంగా కనిపిస్తారు. ఆయనతో కలిసి పని చేయడం గొప్ప అను భవం అని దర్శకుడు జ్యోతి కృష్ణ పేర్కొన్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్న హారి హార వీరమల్లు చిత్రానికి జ్ఞాన శేఖర్ వి.ఎస్., మనోజ్ పరమహంస ఛాయా గ్రాహకులుగా వ్యవహరిస్తున్నారు. ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రముఖ కళా దర్శకుడు తోట తరణి అద్భుతమైన సెట్‌లను రూపొందించారు.

# 'ఆంధ్రా కింగ్ తాలూకా' షూటింగ్ రాజమండ్రిలో..

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా, మహేష్ బాబు పి దర్శకత్వంలో ప్రతిష్టాత్మక మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఆంధ్రా కింగ్ తాలూకా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. తాజా షూటింగ్ షెడ్యూల్ రాజమండ్రిలో ప్రారంభమైంది. రామ్ పోతినే, కన్నడ స్టార్ ఉపేంద్రలపై కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ ఆసక్తికరమైన కథాంశంలో రామ్ డై హార్డ్ అభిమాని పాత్రను పోషిస్తుండగా, ఉపేంద్ర సూపర్ స్టార్‌గా పాత్రలో కనిపిస్తారు. ఇటీవల విడుదలైన ఆంధ్రా కింగ్ తాలూకా టైటిల్ గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుండి అద్భుతమైన స్పందన వచ్చింది. లేటెస్ట్ సెన్సేషన్ భాగ్యశ్రీ బోర్సే రామ్ సరసన కథానాయికగా నటిస్తోంది. టాప్ టెక్నిషియన్స్‌తో ఈ ప్రాజెక్ట్ అత్యున్నత స్థాయి సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతోంది. సిద్ధార్థ నుని సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. వివేక్‌మెర్విన్ మ్యూజిక్ అందిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్. ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ హరీష్ తుమ్మల. ట్యాలెంటెడ్ స్టార్ కాస్ట్, అద్భుతమైన కథాంశం, హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో ఆంధ్ర కింగ్ తాలూకా ఒక అద్భుతమైన ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటోంది. తారాగణం: రామ్ పోతినేని, ఉపేంద్ర, భాగ్యశ్రీ బోర్సే, రావు రమేష్, మురళి శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, జుగిజు గణేష్, సాంకేతిక సిబ్బంది: కథ, స్క్రీన్‌ప్లే దర్శకత్వం: మహేష్ బాబు పి., నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై. రవిశంకర్.



# జులై 17న 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ' రిలీజ్

యంగ్ హీరో నరేష్ అగస్త్య, దర్శకుడు విపిన్ దర్శకత్వంలో, సునేత్ర ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై ఉమా దేవి కోట నిర్మించిన మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా మేఘాలు చెప్పిన ప్రేమ కథలో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. చిత్రంలో రబియా ఖతూన్‌కథానాయిక. ఇప్పటికే రిలీజ్ అయిన రెండు టీజర్లు, సాంగ్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. జూలై 17న ఈ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. హీరో నరేష్ అగస్త్యతో పాటు ప్రధాన నటులంతా కనిపించిన రిలీజ్ డేట్ అనౌన్స్మెంట్ పోస్టర్ చాలా ప్లజెంట్‌గా వుంది. జస్టిన్ ప్రభాకరన్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందిస్తున్నారు. మోహన కృష్ణ ఈచిత్రానికి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, తోట తరణి ఆర్ట్ డైరెక్టర్ కాగా మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్. మేఘాలు చెప్పిన ప్రేమ కథ ఆడియన్స్‌కి మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ అందించబోతోంది. తారాగణం: నరేష్ అగస్త్య, రబియా ఖాతూన్, రాధిక శరత్‌కుమార్, తనికెళ్ల భరణి, వెంకటేష్ కాకుమాను, విద్యుల్లేఖ, సుమన్, ఆమని, తులసి, చైల్డ్ ఆర్టిస్ట్ మాస్టర్ కార్తికేయ, మోహన్ రామన్. సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: విపిన్ నిర్మాత: ఉమాదేవి కోట, బ్యానర్: సునేత్ర ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, సినిమాటోగ్రాఫర్: మోహన కృష్ణ సంగీతం: జస్టిన్ ప్రభాకరన్ ఆర్ట్: తోట తరణి ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్ పీఆర్వో: వంశీ శేఖర్.



# సురేష్ ప్రొడక్షన్స్, కల్ట్ సీక్వెల్ 'ఇఎన్ఇ రిపీట్'

ఈ నగరానికి ఏమైంది సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులని, ముఖ్యంగా యువతను ఆకట్టుకుని సంచలనాత్మక విజయం సాధించి కల్ట్ క్లాసిక్‌గా నిలిచింది. సినిమా రీరిలీజ్ మరింత ఎక్సయిట్మెంట్ క్రియేట్ చేసింది. సినిమాలో పాత్రలు, హ్యూమర్, లైఫ్‌కి కనెక్ట్ అయ్యే కథతో ఈ చిత్రం మ్యాసీవ్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఇప్పుడు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సీక్వెల్ అధికారికంగా అనౌన్స్ చేశారు. ఇఎన్ఇ రిపీట్ టైటిల్ తో ఈ ప్రాజెక్ట్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో మళ్ళీ అదరగొట్టబోతోందనే హామీ ఇస్తోంది. దాదాపు ఒరిజినల్ స్టార్ కాస్ట్, టెక్నికల్ టీంతో తిరిగి వస్తున్న ఈ సీక్వెల్ నోస్టాల్జియా ఫీలింగ్‌ని కలిగిస్తుంది. ఫస్ట్ పార్ట్‌లో అందరినీ అలరించిన గ్యాంగ్ విశ్వక్ సేన్, సాయి సుశాంత్ రెడ్డి, అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను మరోసారి మ్యాడ్‌నెస్ క్రియేట్ చేయబోతున్నారు. ఒరిజినల్‌ని క్రియేట్ చేసిన క్రియేటివ్ పవర్ హౌస్ తరుణ్ భాస్కర్ ఈ సీక్వెల్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్ ఒరిజినల్స్, సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్ల పై డి. సురేష్ బాబు, సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి నిర్మిస్తున్నారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ కూడా ఒక హిలేరియస్ ట్రీట్ లా వుంది. ఈ మూవీ టైటిల్ ఇఎన్ఇ రిపీట్. ఇది మరో యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌ని ప్రామిస్ చేస్తోంది. టైటిల్ లోగో తెలుగు లెటర్స్‌ని తెలివిగా మిక్స్ చేస్తోంది. ఇక్కడ నివిని యొక్క మొదటి, చివరి అక్షరాలు తెలుగులో కనిపిస్తాయి, చివరి అక్షరాలు తిప్పబడి మూవీ ఆఫ్‌బీట్ టోన్‌ను ప్రజెంట్ చేస్తున్నాయి. ఏలనాటి శని పోయింది, కన్యారాశి టైమ్ ఒచ్చింది అనే ట్యాగ్‌లైన్, గాలిలో ఎగిరిపోతున్న బట్టలు, బ్రీఫ్‌కేస్, బీర్ బాటిళ్లు, సన్ గ్లాసెస్, విమాన టికెట్ ఇవన్నీ ఆకాశమంత సాహసాన్ని ప్రజెంట్ చేస్తున్నాయి. ఇది కేవలం కొనసాగింపునే కాదు, మ్యాడ్ నెస్‌ని మరింత పెంచుతుంది. ఎంటర్ టైన్మెంట్, ఎనర్జీని రెట్టింపు చేస్తుందని హామీ ఇస్తుంది. ఈ సీక్వెల్ ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. ఒరిజినల్ కంపోజర్ వివేక్ సాగర్ సంగీతం అందిస్తు సిరీస్ సిగ్నేచర్ వైబ్‌ను కొనసాగిస్తున్నారు. ఎజె ఆరోన్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, రవితేజ గిరిజాల ఎడిటర్. సౌమిత్రి ఎన్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పూర్తి స్థాయిలో జరుగుతోంది.



తారాగణం: విశ్వక్ సేన్, సాయి సుశాంత్ రెడ్డి, అభినవ్ గోమతం, వెంకటేష్ కాకుమాను రచన, దర్శకత్వం: తరుణ్ భాస్కర్, నిర్మాతలు: డి.సురేష్ బాబు, సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి, ప్రొడక్షన్ హౌస్‌లు: ఎస్ ఒరిజినల్స్, సురేష్ ప్రొడక్షన్స్ సంగీతం: వివేక్ సాగర్.



కృతిశెట్టి నయా లుక్

# 'ఆల్కహాల్' టైటిల్ ఖరారు

తెలుగు చిత్ర పరిశ్రమలో అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ వైవిధ్యభరితమైన చిత్రాలతో సంచలన విజయాలను అందుకుంటోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న చిత్రాలు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటున్నాయి. ఇప్పుడు ఈ మూడు సంస్థలు కలిసి మరో విభిన్న చిత్రాన్ని ప్రేక్షకులకు అందించడానికి సిద్ధమవుతున్నాయి. హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న అల్లరి నరేష్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తో చేతులు కలిపారు. ఫ్యామిలీ డ్రామా ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి రచన మరియు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాని ఆల్కహాల్ అనే ఆసక్తికర టైటిల్ ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో అల్లరి నరేష్ ఆల్కహాల్‌లో మునిగిపోయిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇది భ్రమ, వాస్తవికత మధ్య జరిగే కథలా కనిపిస్తోంది. రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ప్రముఖ స్వరకర్త గిబ్రాన్ సంగీతం అందిస్తున్నారు. జిజు సన్నీ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. నిరంజన్ దేవరమానే ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆల్కహాల్ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వెంకట్ ఉప్పుటూరి సహ నిర్మాత. నాగవంశీ వైవిధ్యభరితమైన చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ, వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. ఇప్పుడు ఆల్కహాల్‌తో మరో ఘన విజయాన్ని ఖాతాలో వేసుకోబోతున్నారనే నమ్మకాన్ని ఫస్ట్ లుక్ పోస్టర్ కలిగించింది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. తారాగణం: అల్లరి నరేష్, రుహాణి శర్మ, రచన, దర్శకత్వం: మెహర్ తేజ్, సంగీతం: గిబ్రాన్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, సహ నిర్మాత: వెంకట్ ఉప్పుటూరి, ఛాయాగ్రహణం: జిజు సన్నీ కూర్పు: నిరంజన్ దేవరమానే కళా దర్శకుడు: విశాల్ అబానీ.



# 'థాంక్యూ డియర్' టీజర్ లాంచ్

మహాలక్ష్మి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై పప్పు బాలాజీ రెడ్డి నిర్మాతగా తోట శ్రీకాంత్ కుమార్ రచన దర్శకత్వంలో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం థాంక్యూ డియర్. ధనుష్ రఘుముద్రి, హెబ్బా పటేల్, రేఖా నిరోషా ముఖ్యపాత్రలో కనిపిస్తూ వీర శంకర్, నాగ మహేష్, రవి ప్రకాష్, ఛత్రపతి శేఖర్, బలగం సుజాత, సంక్రాంతి ఫేమ్ శ్రీనివాస్ నాయుడు తదితరులు కీలకపాత్రలు ఈ చిత్రంలో పోషించనున్నారు. సుభాష్ ఆనంద్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందించగా పి ఎల్ కే రెడ్డి డిఓపిగా పనిచేశారు. కాగా సెన్సేషనల్ డైరెక్టర్ వివి వినాయక్ ఈ చిత్ర టీజర్‌ను లాంచ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వివి వినాయక్ మాట్లాడుతూ, రియల్ స్టార్ శ్రీహరి కుటుంబం నుండి వచ్చిన ధనుష్ రఘుముద్రి హీరోగా, హెబ్బా పటేల్, రేఖా నిరోషా హీరోయిన్లుగా నటిస్తూ ప్రేక్షకుల ముందుకు రానున్న థాంక్యూ డియర్ చిత్రం గొప్ప విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను. బాలాజీ నిర్మాతగా, శ్రీకాంత్ తోట దర్శ కత్వంలో ఈ చిత్రం రానుంది. శ్రీహరి ఆశీర్వాదాలతో ధనుష్ భవిష్యత్తులో గొప్ప స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నాను అన్నారు. హీరో ధనుష్ రఘుమూర్తి మాట్లాడుతూ, మా థాంక్యూ డియర్ చిత్ర టీచర్‌ను విడుదల చేసిన డైనమిక్ డైరెక్టర్ వివి వినాయకకి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఆయన టీజర్‌ను లాంచ్ చేయడం నాకు చాలా సంతోషకరంగా ఉంది అన్నారు. హీరోయిన్ రేఖ నిరోషా మాట్లాడుతూ, మా థాంక్యూ డియర్ సినిమా టీజర్‌ను డైరెక్టర్ వి వి వినాయక లాంచ్ చేయడం అనేది ఎంతో సంతోషకరంగా ఉంది. అందరూ మా సినిమాను సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను అంటూ ముగించారు. నటీనటులు: హెబా పటేల్, ధనుష్ రఘుముద్రి, రేఖ నిరోషా, వీర శంకర్, నాగ మహేష్, రవి ప్రకాష్, ఛత్రపతి శేఖర్, బలగం సుజాత, సంక్రాంతి ఫేమ్ శ్రీనివాస్ నాయుడు తదితరులు. బ్యానర్: మహా లక్ష్మి ప్రొడక్షన్స్, ప్రొడ్యూసర్: పప్పు బాలాజీ రెడ్డి, రైటర్: డైరెక్టర్ తోట శ్రీకాంత్ కుమార్ ఎడిటర్: రాఘవేంద్ర పెబ్బేటి మ్యూజిక్: సుభాష్ ఆనంద్ డి ఓ పి: పి ఎల్ కె రెడ్డి లైన్ ప్రొడ్యూసర్: బలిజ పునీత్ రాయల్ కో ప్రొడ్యూసర్: పి బి వి వి సత్య నారాయణ.



# 'పవర్' మూవీ ప్రారంభం

టాలీవుడ్ స్క్రీన్ పైకి యంగ్ అండ్ డైనమిక్ హీరో రాబోతున్నాడు. సాయికృష్ణ హీరోగా, దర్శకుడు వెంకటరమణ పసుపులేటి రూపొందిస్తున్న మూవీ పవర్. ఈ మూవీ తాజాగా ఘనంగా ప్రారంభమైంది. నాది పొగరు కాదురా... నా జాతికి ఈ దేవుడు ఇచ్చిన పవర్... అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో సాయికృష్ణ సినీ ఎంట్రీ ఇచ్చారు. మంగళగిరి పరిధిలోని ఆత్మకూరులో వంగవీటి రంగా విగ్రహం వద్ద ముహూర్తం షాట్‌తో చిత్రీకరణ ప్రారంభమైంది. ప్రారంభోత్సవంలో సాయికృష్ణ పర్సనాలిటీ, అభినయం అతిథులను ఆకట్టుకుని ప్రశంసలు అందుకున్నాయి. ఈ చిత్రంలో అరుణ్ విజయ్, సుజన, భాగ్యశ్రీ, ప్రజ్ఞ ప్రియతో పాటు సీనియర్ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం యువతను ఆకట్టుకునే శక్తివంతమైన కథాంశంతో, అద్భుతమైన సాంకేతిక విలువలతో రూపొం దుతోంది. సాయికృష్ణ హీరోగా ఈ చిత్రం టాలీవుడ్‌లో కొత్త ఒరవడిని సృష్టిస్తుందని చిత్ర యూనిట్ భరోసా వ్యక్తం చేసింది. సాంకేతిక బృందం వివరాలు: సంగీతం: శంకర్ మహదేవన్, సినిమాటోగ్రఫీ: బి. ఎస్. కుమార్, మేకప్: కుమార్, ఎడిటింగ్: నందమూరి హరి., పీ.ఆర్.ఓ: కడలి రాంబాబు, దయ్యాల అశోక్, సమర్పణ: ఎస్.ఐ.ఎఫ్.ఏ.ఏ, కథ, స్క్రీన్ ప్లే మాటలు దర్శకత్వం: వెంకటరమణ పసుపులేటి.



# మనం తినేది విషమా.. ఆహారమా?



చాలామంది వండుకునే తీరిక లేక తరచూ బయట తింటారు. జ్వర వచ్చిందని ఆసుపత్రికి వెళ్తే కలుషితాహారం, నీటి వల్ల వ్యాధు బారిన పడతారు. ఇది తీవ్ర స్థాయిలో కిడ్నీలపైనా ప్రభావం చూపిస్తాయి. మనలో చాలామంది సాయంత్రమైతే చాలు వేడివేడిగా తినాలని బయటకు వెళ్తుంటాం, నచ్చిన వంటకాలను ఇంటికే ఆర్డర్లు పెట్టుకుంటాం. కానీ వాటి రుచి గురించే తప్ప నాణ్యత, శుభ్రతల్ని పెద్దగా పట్టించుకోం. ఫలితంగా తీవ్ర అనారోగ్యాలు కొనితెచ్చుకుంటున్నాం.

**కలుషిత ఆహారంతో...** బ్యాక్టీరియా, వైరస్, రసాయనాలు వంటి హానికరమైనవి ఆహార ఉత్పత్తుల్లోకి చేరితే అవి కలుషితం అవుతాయి. ప్రాసెసింగ్, రవాణా, స్టోరేజ్, వండేటప్పుడు, నిల్వ చేసేటప్పుడు.. ఇలా ఎప్పుడైనా సరే ఈ పరిస్థితి ఎదురుకావొచ్చు. సరైన పరిశుభ్రతా పద్ధతులు పాటించకపోవడం, పరుగు మందుల వినియోగ, రుచి కోసం వాడే రసాయనాలు ఇందుకు దారి తీయొచ్చు. యూరోపియన్ యూనియన్ ఫుడ్ సేఫ్టీ అధికారుల నివేదిక ప్రకారం– మన దేశంలో సుమారు 527 రకాల ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారకమైన ఇథలీన్ ఆక్సైడ్ ఎక్కువగా ఉంటోందట. వీటిల్లో నిత్యం మనం వాడే పండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, గుడ్డు వంటివెన్నో ఉన్నాయి. ఇక, సరిగా ఉండకని మాంసం, సీఫుడ్‌లో ఉండే సాల్మోనెల్లా, కాంపిలోబ్యాక్టర్, ఈ–కొలీ వంటి బ్యాక్టీరియాలు జీర్ణాశయ ఆరోగ్యాన్ని పాడుచేస్తామయి. అలానే, ఆహార పదార్థాలను ఎక్కువ కాలం నిల్వ చేయడం వల్ల లేదా తేమతో వచ్చే బూజు (అఫ్లాటాక్సిన్) కొన్ని సార్లు ప్రాణానికి ప్రమాదకరంగా మారుతుంది. కాడ్మియం, సీసం.. వంటివి ఒంట్లో చేరితే, కాలేయం, మూత్రపిండాలు వంటి అవయవాలతో పాటు రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుంది. అవన్నీ మహిళల పునరుత్పత్తి సామర్థ్యంపైనా తీవ్ర ప్రభావం చూపుస్తాయి.

**వంటగది పాఠాలు...** ఫ్రిజ్‌లో పెడితే పదార్థాలు పాడైపోవు అనుకుంటారు చాలామంది. అందుకే కనిపించిందల్లా అందులోకి తోసేస్తారు . అవి చూడానడనికి రుచికీ బాగున్నా మన ఆరోగ్యాన్ని పాడు చేసే బ్యాక్టీరియా వాటిలో అభివృద్ధి చెదుతుంది. పాలు, పాల పదార్థాలు, మాంసం చేపలు.. వంటివాటిని బయట నుంచి తెచ్చిన రెండు గంటల్లోపే ఫ్రిజ్‌లో పెట్టేయాలి. ముఖ్యంగా గడ్డకట్టి పదార్థాలను చల్లటి నీటిలో/ మైక్రోవేవ్ అవెన్‌లో పెట్టి కరిగించడం సురక్షితం. అలాకాకుండా వాటంతటవే కరిగిపోతయానుకుంటే అది గది ఉష్ణోగ్రత వద్దకు చేరే సరికి ఆయా పదార్థాల్లోని బ్యాక్టీరియా రెండింతలవుతుంది. ఇది ఆరోగ్యానికి ప్రమాదకరం.

- వండిన ఆహార పదార్థాలను గది ఉష్ణోగ్రతలో ఆరు గంటల కంటే ఎక్కువ సమయం ఉంచకూడదు. ఫ్రిజ్‌లో నాలుగు రోజుల కంటే ఎక్కువ పెట్టినవి తినొద్దు. వేడివి అరవై డిగ్రీల సెల్సియస్ అంతకంటే ఎక్కువగా, చల్లటివి నాలుగు డిగ్రీల కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలి.
- అసలే వర్షాకాలం ఆకుకూరలపై చిన్న చిన్న



పురుగులూ, జీవలు గుడ్డుపెడతాయి. వండుకోవడానికి ముందు వాటిని ఉప్పు, పసుపు వేసి బాగా శుభ్రం చేసి ఆరబెట్టాకే ఫ్రిజ్‌లో పెట్టాలి. తరవాత మరోసారి కడిగి వండుకోవాలి. వంటకు శుభ్రమైన నీటినే వాడాలి. సురక్షిత మంచినీటి వ్యవస్థ లేనప్పుడు ఆ నీటిని మరిగించి వాడొచ్చు లేదంటే అతిసారం ముప్పు ముంచుకొస్తుంది.
- పచ్చి మాంసం, కోడిగుడ్లు, చికెన్, చేపలు, వంటివాటి నుంచి క్రిములు త్వరగా వ్యాపించే ప్రమాదం ఉంది. బాగా ఉడికించాకే తినాలి. వీటిని కోసేందుకు, వాడే కటింగ్ బోర్డులు, కత్తులు, పాత్రలు కడికి ఉంచాలి.
- వండకుండా నేరుగా తినే పండ్లు, ఇతర పదార్థాల పైకి బ్యాక్టీరియా, ఫంగస్ చేరితే ఆరోగ్యానికి చేటు కాబట్టి వంటకాలు, పండ్లూ విడివిడిగా పెట్టాలి. ప్యాకేజ్ ఫుడ్‌ని కొనుగోలు చేసినప్పుడు లేబుల్స్ పరిశీలించి తీసుకోవాలి.
- కోడిగుడ్లు కడిగి పెట్టకూడదు. కడిగితే పెంకులోని సన్నని రంధ్రాలనుంచి బ్యాక్టీరియా లోపలికి చేరి అపాయాన్ని తెచ్చిపెడుతుంది. కాబట్టి, వండే ముందే కడగాలి.



చెప్పడమే కాదు.. చేసి చూపిస్తారు. అదేశాలివ్వడమే కాదు.. అవసరాన్ని బట్టి ఆచరణలోకి దిగుతారు. సేన సూచించడమే కాదు.. ఆ సూచనల్ని తూ.చ. తప్పకుండా పాటించడంలో ముందుంటారు.. ఇలా పలురకాల స్ఫూర్తి మంత్రాల్ని పఠిస్తూ ఆదర్శమైన మార్గాన్ని అవలంబిస్తున్నారు కరీంనగర్ కలెక్టర్ సమేలా సత్పతి తాజాగా కరీంనగర్ జిల్లా. ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రశంసలు అందుకున్నారు.

ఎప్పటిలాగే కలెక్టరు కరీంనగర్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. ఆకస్మిక తనిఖీకి వచ్చారని ఆసుపత్రి వర్గాలంతా హడావుడిగా ఉన్నారు. సాదాసీదాగా వచ్చిన కలెక్టరు 'సైనస్‌తో ఇబ్బంది పడుతున్నా.. గతంలో పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించుకుంటే. శస్త్రచికిత్స చేయాలన్నారు.. మీరు చేయగలరా? అంటూ ఈఎన్‌టి వైద్యులను అడిగారు. మొదట ఆశ్చర్యపోయిన వైద్యులు చేస్తామని చెప్పడంతో ఇన్ పేషెంట్ గా మారారు ముక్కుకు సంబంధించి నాసల్ సెప్టోప్లాస్టీ ఫంక్షనల్ ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీని చేయించుకుని మూడురోజులు ఆస్పత్రిలో ఉండి కోలుకున్నాక ఇంటికి వెళ్లారు.

ఈ విషయమై తెలంగాణ ముఖ్యమంత్రి సహా పలువురు ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. ఇదొక్కటి కాదు: గడిచిన ఏడాదిన్నరగా విధినిర్వహణలో భిన్నమైన పాత్రలను పోషిస్తున్నారీ కలెక్టర్. అన్నింటా ఆమే. జిల్లాలోని ఏ సర్కారు బడి లేదా అంగన్‌వాడీ కేంద్రానికి ప్రాథమిక దశలోని విద్యార్థులు ఎ ఫర్ ఆపిల్ బి ఫర్ బాల్ అని చదివరు. ఎ ఫర్ ఆక్టివ్ బి ఫర్ బ్రైట్.. సి ఫర్ క్రియేటివ్.. డి ఫర్ డిలైట్ అంటూ జడ్ వరకు అర్థవంతమైన పదాలను లయబద్ధంగా వల్లెవేస్తూ కనిపిస్తారు. ఇలా వినసొంపైన పాటను సమేలా సత్పతి స్వయంగా రాయడమే కాదు! పాడారు వ్యక్తిత్వ వికాసాన్ని పెంచే కోణంలో రాసిన ఈ పాటకు సంగీతాన్ని జోడించి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల నృత్యాలతో కలిపి ఆకట్టుకునే వీడియోను రూపొందించారు. ఇటీవల లఖ్‌నవూలో ఉన్నతాధికారులకు నాయకత్వ లక్షణాలపై ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలోనూ ఈ వీడియోను ప్రదర్శించారు. మన కలెక్టరు స్ఫూర్తికి కితాబునిచ్చారు. తన కుమారుడు నైతిక్‌కు ఐదేళ్ల వయసున్నప్పుడు సరదాగా పాడిన ఆంగ్ల అక్షరాల పాటకు తనదైన సృజనాత్మకతను జడించారు. ఎన్నో విషయాల్ని తెలిపే పాఠంగా ఈ పాట మారిపోయింది.

**మహిళల ఆరోగ్యం కోసం...**

ఇక్కడి ప్రజలతో మమేకమయ్యేందుకు తెలుగు భాషను

# ఆదర్శ పంథాలో ఆమె..



రాయడమే కాదు వేగంగా చదివేలా శిక్షణ పొందారు. భద్రాచలంలో పనిచేసే సమయంలో కోయ భాషను నేర్చుకుని అక్కడి రచయితల్ని ప్రోత్సహించారు. కరీంనగరకు వచ్చిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశ్వవిద్యాలయం నుంచి ఉర్దూలో డిప్లొమాను పూర్తి చేశారు. ఇక జిల్లాలోని మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ 'ఆరోగ్య శుక్రవారం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు. రక్తహీనత బారినపడ్డ వారిని ఎప్పటికప్పుడు గుర్తిస్తూ పోషకాహారాన్ని అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు తన సొంత డబ్బుతో బూట్లు పంపిణి చేశారు. ఈ విద్యాసంవత్సరంలో బడి బాటతోపాటు 'విద్యావాహిని' అనే ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఊరూరా వాహనాలను పంపించి బడి మానేసిన పిల్లలను ప్రభుత్వం బడుల్లో చేర్పిస్తున్నారు. ప్రభుత్వ విద్యావిధానాన్ని బలోపేతం చేస్తున్నారు. చేసే ప్రతి పనితో అన్ని విభాగాల అధికారులు సిబ్బంది, ప్రజల మన్ననల్ని అందుకుంటున్నారు.

**ప్రజాసేవ కోసమే ఐఎఎస్ ..** 2015 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారికి పమేలా స్వస్థలం ఒడిశాలోని సునాబెడ కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేశారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఉద్యోగం సాధించి, ఇన్ఫోసిస్‌లో ఇంజినీర్ కొన్నాళ్లు పనిచేశారు. సోషియాలజీ, హ్యూమన్ రైట్స్‌ల్లో పేజీ చేశారు. శిక్షా ఓ అనుసంధాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ప్రొఫెసర్‌గానూ కొన్నాళ్లు పనిచేశారు. ప్రజలకు సేవ చేయాలంటే ఉన్నతాదికారిగా ఉండాలంటే సంకల్పంతో సివిల్స్ వైపునకు దృష్టి మళ్లించి అనుకున్నది సాదించారు. నాలుగో ప్రయత్నంలో 51వ ర్యాంకు సాధించి భద్రాచలం సబ్‌కలెక్టరుగా తొలి పోస్టింగ్ అందుకున్నారు. తరువాత వరంగల్‌లో కమిషనర్‌గా, ఆపై యాదాద్రి భువనగిరి జిల్లాలో కలెక్టరుగా సేవలందించారు. 2023 నవంబరు నుంచి కరీంనగర్ కలెక్టరుగా పనిచేస్తున్నారు.

# కాఫీ, టీ ఎంత తాగాలంటే!

కాఫీ, టీ మంచిది కాదనే మాట అనేకసార్లు వింటుంటాం కదూ! అయితే ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెనర్చ్ (ఔసిఎంఆర్) తాజాగా విడుదల చేసిన ఆరోగ్యసూత్రాలు ఇలా ఉన్నాయి.



- చాయ్ కానీ కాఫీ కానీ అదే మానేయ మనడం లేదు. కాకపోతే భోజన సమయంలో మంచిది కాదు. గంట ముందు లేదా తర్వాత తాగండి. కొందరు ఆహారం తీసుకునేటప్పుడు కాఫీ, టీలు తాగితే త్వరగా అరుగుతుందని, శరీరంలో పేరుకున్న నూనెను కరిగించేస్తుందని అనుకుంటారు అన్ని నిజం కాదు.
- అయితే కాఫీలో ఉండే టన్నిన్స్ ఐరన్స్ గ్రహించడగంలో తోడ్పడుతుంది. కనుక ఐరన్ లోపం ఏర్పడకుండా ఉంటుంది. ఎనీమియా రాదు. అయితే కాఫీ, టీల్లో కెఫిన్ ఉంటుంది కనుకన అది మోతాదు మించిన కొద్దీ మానసిక రుగ్మతలతో సహా అనేక అనారోగ్యాలువచ్చే అవకాశం ఉంది.
- పరగడుపున కాఫీ తాగడం చాలామందికి అలవాటు ఇది మంచిది కాదు, ఏమైనా తిన్న తర్వాతే తాగాలి.

# మురికి పోవాలంటే..

కొత్త దుస్తులు వేసుకునేటప్పుడు వాటిని అపురూపంగా చూసుకుంటాం. కానీ రాను రానూ వాటి విషయంలో శ్రద్ధ తగ్గిపోతుంటుంది. ఫలితంగా కొద్ది రోజులకే దుస్తులు



పాతవాటిలా మారిపోతాయి. ఇలా జరగకుండా దుస్తులు ఎక్కువ కాలం మన్నాలంటే, కొత్తవాటిలా మెరపిపోవాలంటే వాటిని ఉతికేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు,

**చల్లని నీటిలోనే..** చాలామంది మురికి ఎక్కువగా ఉండే బట్టలను వేడ నీళ్లలో నానబెట్ట ఉతుకు తుంటారు. బాగా మురికిగా ఉన్న వాటికి ఈ చిట్కా ఉపకరిస్తుంది. కానీ వాటితో పాటే మిగతా దుస్తుల్ని కూడా వేడనీటిలో ఉతకడం పొరపాటు. ఇలా చేయడం వల్ల వాటి నాణ్యత దెబ్బతింటుంది. కొన్ని దుస్తులకైతే దారాల పోగులు బయటకొచ్చేయడం, ముడుచుకు పోవడం. గమనించచ్చు. కాబట్టి రోజూ వేసుకునే దుస్తుల్ని చల్లటి నీటిలో నానబెట్టి ఉతకడం మంచిది.

**తిరగేసి ఆరేయాలి!** బట్ట ఉతికేటప్పుడు లోపల, బట్ట రెండువైపులా శుభ్రం చేయాలని గుర్తుంచుకోండి. అందుకే ముందు బయటి భాగం శుభ్రం చేసుకుంటే తర్వాత బట్టలు తిరగేసి లోపలి భాగం ఉతకచ్చు. అలాగే ఉతికిన బట్టల్ని తిరగేసి, ముడతల్లేకుండా ఆరేయాలి. ఇలా చేయడం వల్ల బట్టలు బాగా శుభ్రపడటమే కాకుండా ఎండకు రంగు కోల్పోకుండా ఉంటాయి.



# ఆ అమ్మలకు వరం

అద్దెగర్భం ద్వారా బిడ్డను పొందినా..తమ బిడ్డ ఆలనాపాలనా చూసు కోవాలని కలలుకంటారు తల్లిదండ్రులు. వీరు ప్రభుత్వోద్యోగులైతే, వారికి ప్రసూతి సెలవులు మంజూరు చేసే నియమం గత 50 ఏళ్లగా లేదు. తాజాగా చేసిన ఓ సవరణ ఇప్పుడు వాళ్ల పాలిట వరమైంది. సరోగసీ ద్వారా పిల్లలను కోరుకునే తల్లిదండ్రులను కమిషన్ పేరెంట్స్ అని పిలుస్తారు. అలా ఈ తల్లిదండ్రులకు కూడా ఇకపై ప్రసూతి సెలవులున్నాయి. ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటీసు ప్రకారం చైల్డ్ కేర్ లీవ్‌తో కూడిన కమిషన్ మదర్‌కు 180 రోజులు ప్రసూతి సెలవులు, ఆ కమిషన్ తండ్రికి 15 రోజుల పితృత్వ సెలవు మంజూరైంది. అయితే ఈ సవరణకు ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే అర్హులు అవుతారు. ఇప్పటి వరకు అద్దె గర్భంద్వారా బిడ్డను కన్న ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేసే నిబంధన లేదు. తాజాగా చేసిన ఈ సవరణతో కమిషన్‌కపుల్‌కు ఉపశమనం అందింది. అలాగే సరోగసీ ద్వారా పుట్టిన బిడ్డకు కమిషన్ తండ్రి తన పితృత్వ సెలవును ప్రసవించిన ఆరునెలల వ్యవధిలోవినియోగించు కోవాల్సి ఉంటుంది. సరోగసీని ఎందుచుకునే మహిళలు సహజంగా ప్రసవించే వారితో సానమైన ప్రసూతి ప్రయోజనాలను పొందే అవకాశాన్ని ఈ సవరణ అందించింది. అలాగే ప్రసుత్తం ఉన్న నిబంధనల ప్రకారం–మహిళ, ఒంటరి ప్రభుత్వోద్యోగులైన మగవారు తమ మొత్తం పదవీ కాలంలో 730 రోజుల వరకు పిల్లల సంరక్షణ సెలవు తీసుకోవచ్చు. తమ ఇద్దరి పిల్లల విద్య, అనారోగ్యం వంటి వివిధ అవసరాల కోసం ఈ సెలవులను వినియోగించు కోవచ్చు.

# బగలాముఖీ దేవి

ఆధ్యాత్మికం


బగలాముఖీ దేవి దశమహా విద్యలలో ఎనిమిదవ మహా విద్య. ఆమెను శత్రునిగ్రహా శక్తిగా, వాక్సంయమ శక్తిగా, సంకల్ప బలాన్ని బలపరచే శక్తిగా ఆరాధిస్తారు. "బగలాముఖీ" అనే నామం "దుశ్శక్తుల ఊపిరిని ఆపే" శక్తిగా వ్యాఖ్యానించ బడుతుంది. ఆమెను పీతాంబరా దేవి అని కూడా పిలుస్తారు, ఎందుకంటే ఆమె పసుపు రంగు వస్త్రాలను ధరించి పసుపుతో చేసిన పూజను ఆమోదిస్తారు. బగలాముఖీ రూపం అతి ప్రత్యేకమైనది. సాధారణంగా ఆమె కుడి చేతిలో శత్రువు యొక్క నాలుకను పట్టుకొని, ఎడమ చేతిలో గదను పట్టుకున్న విడిగా చిత్రించబడుతుంది. ఇది మాటల ద్వారానే చేసే దుష్టకార్యాలను అణిచే శక్తికి సంకేతం ఆమె రూపం హింసాత్మకంగా కనిపించి నా లోతైన అర్థం ఉన్న అధ్యాత్మిక శక్తిగా దర్శించాలి. బగళాముఖీ ఉపాసన ముఖ్యంగా న్యాయ పరమైన సమస్యలు, కోర్టు కేసులు, నిందలు, రాజకీయ అడ్డంకులు వంటి సమస్యల నుండి రక్షణ పొందేందుకు విశేషంగా ఆరాధించ బడుతుంది. ఆమెను పూజించడం వల్ల మనలో నిగ్రహాశక్తి, ధైర్యం, చిత్తశుద్ధి పెరుగుతాయని విశ్వాసం ఉంది. వ్యాకరణశక్తి వాక్పాటపం, ధైర్యసాహసాల కలయిక ఆమె ఆశీ్సలతో కలుగుతాయని ఉపాసకులు నమ్ముతారు. బగలాముఖీ దేవికి ప్రత్యేక మంత్రోపాసనలు ఉన్నాయి. '**ఓం హ్రీం బగలాముఖీ సర్వదుష్టానాంవాచం ముఖం పదం స్తంభయ జిహ్వాం కీళయ బుద్ధిం వినాశయం హ్లీః ఓం స్వాహా**' అనే మంత్రం ద్వారా స్థంభనశక్తిని కోరుతారు. ఈ మంత్రం జనాన్ని గురువు మార్గ దర్శనంలో చేయడం శ్రీయస్కరం. ఆమెను నవరాత్రులలో ముఖ్యంగా అష్టమినాడు విశేషంగా పూజిస్తారు. బగలాముకీ యంత్రాన్నీ పూజించడం పసుపుతో హోమం చేయడం, పసుపు వస్త్రాలు, పసుపు నైవేద్యంతో అర్చన చేయడం పంచాంగ విధానంలో స్థిరంగా కొనసాగుతున్న సంప్రదాయం. బగలాముఖీ అనుగ్రహం వల్ల భయాలను అధిగమించగలగడం, ఆత్మ విశ్వాసంతో విజయాన్ని సాధించగలగడం, సాధ్యమవుతుంది. ఆమెను ఉపాసన కేవలం శత్రునినగ్రహానికి కాదు మనస్సు స్థిరత. భావోద్వేగ నియంత్రణ, జీవిత లక్ష్యసాధనకు మార్గదర్శిని. ఆమె అనుగ్రహం వాకినసద్ధిని ప్రసాదించండి మాత్రమే కాదు. వికారాలపై విజయం సాధించడానికి మార్గాన్ని కూడా చూపుతుంది. బగలాముఖీ అనేది అంతర్గత శక్తి బలపరిచే ఆధ్యాత్మిక సాధన.

**- సి.హెచ్. ప్రతాప్**

# పనిలో ఉన్నా ప్రేమగా !

**'బిజీ' ఎంత చిన్న పదం! కానీ ఇద్దరి మధ్యా దూరానికి కారణమయ్యే ప్రధాన కారణాల్లో ఇదీ ఒకటంటే నమ్ముతరా? భార్యాభర్తలిద్దరూ సంపాదించక తప్పని రోజులివి. అలాగని పనిలోనే మునిగి తేలితే ప్రేమించిన వారు దూరమవుతారు. అలా కావొద్దంటే..**

ఇద్దరికీ రోజంతా పనితోనే సరిపోతుంది. క్షణం తీరిక దొరకదు అనే అనుకుందాం. సాయంత్రం కాసేపైనా మాట్లాడుకునే వీలు ఉంటుందిగా! ఆ సమయం భాగస్వామితో గడపండి. పనులు, ఆఫీసు, బంధువులు, స్నేహితుల సంగతులు అన్నీ పక్కన పెట్టేయండి. మీకు సంబంధించినవే మాట్లాడుకోండి. ఫోన్, టివిల జోలికీ వెళ్లొద్దు. ఒకరు మాట్లాడుతోంటే మరొకరు శ్రద్ధగా వినాలి. ఇది ఇద్దరి మధ్యా అన్యోన్నతను పెంచుతుంది. మనిషి ఎంత దూరంగా ఉన్నా.. టెక్నాలజీ మనసుల్ని దగ్గర చేస్తోంది కదాః దాని సాయం తీసుకోండి ఒక సమయం పెట్టుకోండి. వాయిస్ లేదా వీడియో కాల్‌లో తప్పక మాట్లాడు కోండి. కాస్త ఖాళీ దొరికినప్పుడు తిన్నావా? ఈ రోజు చాలా పనుంది, నువ్వెలా ఉన్నావ్ ఇలా చిన్నదైనా మెసేజ్ లేదా వాయిస్ మెసేజ్ పంపండి. ఓ పువ్వు, మొక్క, పెయింటింగ్, భవనం.. ఆ రోజు చూసినవాటిల్లో ఏది నచ్చినా ఫొటో,న వీడియోల రూపంలో పంచుకోండి. ప్రతిక్షణం తన గురించి ఆలోచిస్తున్నారన్న భావన ఎందుటివారికి ఎంత భరోసానిస్తుందో!



ఒక్కోసారి శరీరంలోని కొన్ని వ్యవస్థలు గాడి తిప్పితే ఆ ప్రభావం చర్మంపై కూడా ఉంటుంది. ప్రత్యేకించి రక్త ప్రసరణ వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోతే పలు రకాల చర్మ సమస్యలు ఉత్పన్నమవుతాయి. రక్త ప్రసరణ వ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉంటే శరీరంలో ఆక్సిజన్ సరఫరా శాతం క్రమంగా పెరుగుతుంది. శరీరంలోని హానికారక పదార్థాలు, విషతుల్యాలు తొలిగిపోతాయి. ఫలితంగా చర్మం లోలోపలి నుంచే నిగారింపును సంతరించుకుంటుంది అని సూచిస్తున్నారు సౌందర్య నిపుణులు. మరి వారు సూచిస్తున్నట్లు రక్త ప్రసరణ వ్యవస్థ పనితీరును మెరుగుపరుచుకుని, అందంగా మెరిసిపోవాలంటే ఏం చేయాలో తెలుసుకుందాం..

# అందానికి అయిదు చిట్కాలు..

**వ్యాయామం చేయండి..** వ్యాయామాలు, వర్కవుట్లను జీవనశైలిలో భాగం చేసుకుంటే శరీర ఆరోగ్యంతో పాటు చర్మంసౌందర్యాన్ని సంరక్షించుకోవచ్చు. వ్యాయామాలు చేయడం వల్ల హృదయ స్పందనల రేటు పెరుగుతుంది. ఫలితంగా శరీరంలో రక్త ప్రసరణ భాగుంటుంది. రన్నింగ్, యోగా, హై ఇంటెన్సిటీ ఇంటర్వల్ ట్రైనింగ్.. లాంటి వ్యాయామాలను వారంలో 5 రోజులు చొప్పున కనీసం 30 నిమిషాల పాటు చేస్తే రక్త ప్రసరణ వ్యవస్థ పనితీరు మెరుగవుతుంది.



**. హెల్దీ ఫుడ్....** చక్కెర ఉప్పు ఎక్కువగా ఉన్న పదార్థాలను ఆహారంగా తీసుకోకపోవడం ఎంతో ఉత్తమం. వీటి స్థానంలో ఆకుపచ్చని కూరగాయలు, సిట్రస్ పండ్లను డైట్‌లో భాగం చేసుకుంటే బాగుంటుంది. ఇందులో సమృద్ధిగా ఉండే ఫైబర్ రక్త ప్రసరణ వ్యవస్థ పనితీరును మెరుగుపరచడంతోపాటు శరీరంలో రోగ నిరోధక శక్తి పెంచుతుంది.



**ఫ్లూయిడ్స్ ఎక్కువగా...** ఎలాంటి రసాయన ఉత్పత్తులు వాడకుండా సహజమైన పద్ధతుల్లో అందంగా మెరిసిపోవాలంటే మంచినీటికి మించిన సాధనం మరొకటి లేదు. చర్మ సౌందర్య నిపుణులు కూడా ఎక్కువగా ఇదే మాట చెబుతుంటారు. శరీరంలో నీటి శాతం తగ్గడం వల్ల విషతుల్యాలు, హానికారక పదార్థాలు పెరిగిపోతాయి. ఈ ప్రభావం ఉండేలా జాగ్రత్త పడాలి. ఈ క్రమంలో మంచి నీటితో పాటు కొన్ని రకాల ఫ్రూట్‌జ్యూస్‌లను తీసుకున్నా మంచి ఫలితముంటుంది.

**ఫేషియల్ మసాజ్..** కొన్ని రకాల ఫేషియల్ మసాజ్‌ల వల్ల కూడా చర్మం సహజంగా మెరుపును సంతరించుకుంటుంది. ఈ మసాజ్‌ల వల్ల ముఖం, చర్మంపై ఉండే లింఫ్ గ్రంథులపై మర్దన జరిగి ఆయా భాగాల్లో ఉండే వ్యర్థాలు, విషతుల్యాలు తొలగిపోతాయి. అంతేకాదు. శరీరంలోని అన్ని భాగాలకు సక్రమంగా ఆక్సిజన్ అందుతుంది. ఫలితంగా చర్మం మృదువుగా, తాజాగా మారుతుంది. రోజూ కనీసం 10–15 నిమిషాల పాటు ఇలా ఫేషియల్ మసాజ్ చేసుకుంటే కొద్ది రోజుల్లోనే మంచి ఫలితాలు కనిపిస్తాయి. మసాజ్ కోసం జేడ్ రోలర్ వంటి పరికరాలను కూడా వాడచ్చు.



**ఆ అలవాట్లను దూరం చేసుకోండి!...** స్మోకింగ్, మద్యపానం లాంటి అలవాట్లు ఉన్నవారు వీలైనంతవరకు వాటికి దూరంగా ఉండడం ఉత్తమం. ఇవి రక్త ప్రసరణ వ్యవస్తపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయి. ప్రత్యేకించి పొగాకు సంబంధిత పదార్థాలు రక్త ప్రవాహానికి అడ్డుపడతాయి. ఫలితంగా రక్తపోటు గుండెపోటు లాంటి సమస్యలకు లోను కావడంతో పాటు చర్మం నిగారింపును కోల్పోతుంది.

# భారత్ 290 ఆలౌట్

## ఇంగ్లండ్‌తో అండర్19లో సూర్యవంశీ మెరుపు ఇన్నింగ్స్



**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్‌తో అండర్19లో భాగంగా రెండో వన్డేలో భారత్ 49 ఓవర్లలో 290 పరుగులకు ఆలౌట్ అయింది. ఇంగ్లండ్ బౌలర్ నాలుగు వికెట్లు పడగొట్టడంతో భారత్ 300 పరుగుల లక్ష్యాన్ని చేరుకోవాలనే ఆశలను దెబ్బతీసింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ టాస్ గెలిచి భారత్‌ను తొలుత బ్యాటింగ్‌కు అహ్వానించింది. అధికారికంగా తొలి బందికే ఆయుష్ మాత్రే వికెట్ కోల్పోయిన భారత్ తదుపరి కుదురుకుంది. వైభవ్ సూర్యవంశీ 45 పరుగులు, విహాన్ మల్హోత్రా 49 పరుగులు, చవ్డా 22 పరుగులు, అభిగ్యాన్ కుందు 32 పరుగులు, రాహుల్ కుమార్ 47 పరుగులు, కనిష్క చౌహాన్ 45 పరుగులతో రాణించడంతో ఓ మోస్తరుకు మించి భారీ స్కోర్ చేసింది. వైభవ్ సూర్యవంశీ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. తొలి వన్డేలో 19 బంతుల్లో 48 పరుగులు చేసిన అతడు నేటి రెండో వన్డేలో 45 పరుగులు చేసి ఔటయ్యాడు. దీంతో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో అర్హమైన అర్థ సెంచరీలను మిస్ చేసుకున్నాడు. వైభవ్‌తో పాటు, ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన ఆయుష్ మాత్రే ఈ మ్యాచ్‌లో నిరాశపరిచాడు. మాత్రే తానెదుర్కొన తొలి బంతికే డకౌటయ్యాడు. అయితే చివరి వరుస ప్లేయర్లు వెంట వెంటనే ఔట్ కావడతో భారత్ ఇన్నింగ్స్ 9 ఓవర్లలో 290 పరుగుల వద్ద ముగిసింది. ఇంగ్లండ్ బౌలర్లలో ఫ్రెంచ్ 4 వికెట్లు పడగొట్టగా, జాక్ హోమ్, అలెక్స్ గ్రీన్ తలో 3 వికెట్లు తీశారు. కాగా భారత్ అండ్ 19 జట్టు 5 వన్డేలు, 2 టెస్ట్ మ్యాచ్‌ల కోసం ఇంగ్లండ్‌లో పర్యటిస్తోంది. హోప్‌లో జరిగిన తొలి వన్డేలో భారత్ ఇంగ్లండ్‌పై 6 వికెట్లు తేడాతో ఘన విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 42.2 ఓవర్లలో 174 పరుగులకే కుప్పకూలగా, భారత్ కేవలం 24 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.

# సురుచి సంచలన విజయం

## పిస్టల్ ఈవెంట్‌లో మను ఓటమి



**న్యూఢిల్లీ:** గ్రూప్ ఎ షూటర్స్ జాతీయ సెలక్షన్ ట్రయల్స్‌లో సురుచి ఇందర్ సింగ్ ఒలింపిక్ డబుల్ మెడలిస్ట్ మను భాకర్‌ను ఓడించి సంచలనం సృష్టించింది. మహిళల 10 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఇందర్ గెలుపుసాధించింది. అలాగే నేవీ షూటర్ నీరజ్ కుమార్ 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ పురుషుల ఈవెంట్‌లో అద్భుతంగా రాణించాడు. డెహ్రాడూన్‌లో సోమవారం స్టార్ స్టడెడ్ ఫైనల్‌లో, సురుచి 245.6 స్కోరు సాధించింది. ఇది మను భాకర్ కంటే 1.1 పాయింట్లు మెరుగ్గా ఉంది. ఈ ఓటమి మను భాకర్‌కు చాలా నిరాశ కలిగించింది. భాకర్ 244.5 స్కోరుతో రెండవ స్థానంలో, రాహి సర్నోబత్ 223.1 స్కోరుతో మూడవ స్థానంలో నిలిచింది ఈ రోజు జరిగిన మొదటి ఫైనల్‌లో, సామ్రాట్ రాణా చివరి షాట్‌లో 10.5 స్కోరుతో మొదటి స్థానంలో నిలిచాడు, సౌరభ్ 9.6 మాత్రమే సాధించగలిగాడు. సామ్రాట్ 241.7 స్కోరుతో, సౌరభ్ మొత్తం 241.5 స్కోరుతో రెండవ స్థానంలో నిలిచాడు. ఆదిత్య మల్రా 217.8 స్కోరుతో మూడవ స్థానంలో నిలిచాడు. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3పి ఫైనల్‌లో నీరజ్ కుమార్ అద్భుతంగా రాణించి వరుసగా రెండు ట్రయల్స్ గెలిచాడు. ఈ నావికాదళ సైనికుడు 463 పాయింట్లు సాధించాడు, ఇది ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ కంటే రెండు పాయింట్లు మెరుగ్గా ఉంది. అలాగే ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతక విజేత అఖిల్ షెరాన్ 448.8 స్కోరుతో మూడవ స్థానంలో నిలవగా, పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత స్వప్నిల్ సురేష్ కుసాలే 438.4 స్కోరుతో నాల్గవ స్థానంలో నిలిచాడు.

# యుఎస్ ఓపెన్ వరల్డ్ ఛాంపియన్‌గా ఆయుష్

## మహిళల విభాగంలో రన్నరప్‌గా తన్వీ



**న్యూఢిల్లీ:** భారత్ స్టార్ ప్లేయర్ ఆయుష్ శెట్టి తొలి యుఎస్ ఓపెన్-2025 వరల్డ్ టూర్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. అలాగే ఈ వరల్డ్ టూర్‌లో మహిళల విభాగంలో ఫైనల్‌కు చేరుకున్న అతి పిన్న వయస్కురాలైన తన్వి శర్మ రన్నరప్‌గా నిలిచింది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో 20 ఏళ్ల ఆయుష్ మూడో సీడ్, కెనడా ఆటగాడు బ్రియాన్ యాంగ్‌ను 47 నిమిషాల్లో 21-18, 21-13 తేడాతో ఓడించాడు. అతను డెన్మార్క్‌కు చెందిన ప్రపంచ 85వ ర్యాంకర్ మాగ్నస్ జోహన్నెసెన్‌పై 21-17, 21-19 తేడాతో గెలిచి, ఆపై 16వ రౌండ్‌లో మన్నెపల్లి తరుణ్‌పై 21-12, 13-21, 21-15 తేడాతో విజయం సాధించాడు. క్వార్టర్ ఫైనల్స్‌లో ఆయుష్ ప్రపంచ 70వ ర్యాంకర్ కువో కువాన్ లిన్‌పై 22-20, 21-9 తేడాతో విజయం సాధించాడు. టోర్నమెంట్‌లో అతని అతిపెద్ద విజయం సెమీ ఫైనల్స్‌లో వచ్చింది, ఆయుష్ 67 నిమిషాల్లో టాప్ సీడ్, మరియు ప్రపంచ 6వ ర్యాంకర్ చౌ టియెన్ చెన్‌ను 21-23, 21-15, 21-14 తేడాతో ఓడించాడు. తైపీ ఓపెన్ సెమీఫైనల్లో అతను చెన్ చేతిలో ఓడిపోయాడు. అలాగే మహిళల సింగిల్స్ ఫైనల్లో తన్వి శర్మ 46 నిమిషాల్లో అమెరికాకు చెందిన టాప్ సీడ్ బీవెన్ జాంగ్ చేతిలో 11-21, 21-16, 10-21 తేడాతో ఓడిపోయి యుఎస్ ఓపెన్ 2025 వరల్డ్ టూర్ టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచింది. అన్‌సీడెడ్ టీనేజర్ యుఎస్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరుకున్న అతి చిన్న వయస్కురాలైన భారతీయు ప్లేయరుగా రికార్డు సృష్టించింది. ఆమె తొలి రౌండ్‌లో 21-19, 21-9 తేడాతో 2వ సీడ్ వియత్నామీస్ క్రీడాకారిణి న్గుయెన్ తుయ్ లిన్హ్‌పై వరుస సెట్ల విజయంతో తన ప్రచారాన్ని ప్రారంభించింది. రెండవ రౌండ్‌లో థాయిలాండ్‌కు చెందిన మాజీ జూనియర్ ప్రపంచ ఛాంపియన్ ఒపట్నిపుత్‌పేను 21-18, 21-16 తేడాతో ఓడించింది. అలాగే తన్వి మలేషియాకు చెందిన కరుపతేవన్ లెట్షానాను 21-13, 21-6 తేడాతో ఓడించింది. సెమీఫైనల్లో తన్వి 21-14, 21-16 తేడాతో ఉక్రెయిన్‌కు చెందిన ఏడో సీడ్ పోలినా బుహ్రోవాపై ఆధిపత్య విజయం సాధించింది.






# 3 ఫార్మాట్లలో నం 1 హీరోలు

## టాప్3లో కోహ్లీ, బుమ్రాకు స్థానం

**న్యూఢిల్లీ:** సంవత్సరాలుగా, ఆటలో దిగ్గజాలుగా నిలిచిన క్రికెటర్లు చాలామంది ఉన్నారు. క్రికెట్‌లో హీరోలు ఉన్నప్పటికీ, కొంత మంది మాత్రమే టెస్ట్, వన్డేలు, టీ20లతో సహా ప్రతి ఫార్మాట్లో ఐసిసి ర్యాకింగ్స్‌లో నంబర్ వన్ పొజిషన్‌లోకి వస్తారు. కొంతమంది ఆటగాళ్ళు టెస్ట్‌లో నం1 ర్యాంక్స్‌ను సాధిస్తే, మరికొందరు వన్డేలు, ఇంకొందరు టి20ల్లో నంబర్ వన్‌గా నిలుస్తారు. అయితే ఈ మూడు ఫార్మాట్లలోనూ ముగ్గురు క్రికెటర్లు మాత్రమే నంబర్ వన్ ర్యాంక్స్ సాధించగలిగారు. ఈ ఎలైట్ జాబితాలో ఉన్న ఆటగాళ్లలో కోహ్లీ, బుమ్రా స్థానం సంపాదించారు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్స్ క్రికెట్లో లెజెండ్‌గా పరిగణిస్తారు. తన కెరీర్లో 560 మ్యాచ్‌ల్లో 27483 పరుగులతో అన్ని ఫార్మాట్లలో అత్యధిక పరుగులు సాధించిన నాల్గవ ప్లేయర్‌గా ఉన్నాడు. టెస్ట్, వన్డేల్లో ఒక్కొక్కటి 13000 పరుగులతో, అతను ఆడిన 17 టీ20ల్లో 401 పరుగులతో రాణించాడు. ఫిబ్రవరి 2005లో ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ మధ్య జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో పాంటింగ్ 98 రన్స్ చేశాడు. ఈ ఫార్మాట్లో నంబర్ వన్ ర్యాంక్‌ను సాధించాడు. అంతేకాకుండా, రికీ 2005 నుండి 2007 వరకు వరుసగా మూడేళ్లు వన్డే ఫార్మాట్లో నంబర్1 బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. అతడు 2003లో తొలిసారిగా టెస్ట్‌లో నంబర్ ర్యాంకింగ్స్‌ను కూడా సాధించాడు. అలాగే స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ భారత్ నుండి అన్ని ఫార్మాట్లలో అత్యధిక ఐసీసీఐ ర్యాంకింగ్ పొందిన మొదటి ఆటగాడు. అతను తొలిసారిగా 2013 నవంబర్‌లో ఒడిఐ ఫార్మాట్లో నంబర్ వన్ ర్యాంకింగ్స్‌ను సాధించాడు. ఆ తర్వాత, 50 ఓవర్ల ఫార్మాట్‌లోనూ అగ్రస్థానంలో ఉన్నాడు. 2017, 2018, 2019, 2020లో వరుసగా నంబర్ 1 ఒడిఐ బ్యాట్స్‌మెన్‌గా కొనసాగాడు. వన్డేలతో పాటు, కోహ్లీ వరుసగా 2014, 2016 టి 20 ప్రపంచ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్స్‌ను గెలుచుకున్నాడు. అంతేకాకుండా రెండు ఏళ్లలో పొట్టి ఫార్మాట్లో నంబర్ వన్ బ్యాటర్‌గా నిలిచాడు. టెస్ట్ ఫార్మాట్‌లో కోహ్లీ వరుసగా 2018, 2019లో పొడవైన ఫార్మాట్లో నంబర్ వన్ బ్యాటర్ స్థానాన్ని దక్కించుకున్నాడు. ఇక భారత స్టార్ ఫాస్ట్ బౌలర్‌లో జస్ప్రీత్ బుమ్రా ఇప్పటివరకు తన తొమ్మిదేళ్ల అంతర్జాతీయ కెరీర్లో అనేక మైలురాళ్లను సాధించాడు. ఏళ్ల తరబడి భారత్ తరపున ముందంజలో ఉన్న ఫాస్ట్ బౌలర్‌గా, స్వింగింగ్ డెలివరీలకు ప్రసిద్ధి చెందాడు. జనవరి 2016లో అంతర్జాతీయంగా అరంగేట్రం చేసిన బుమ్రా, జనవరి 2018లో స్వల్ప కాలానికే టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో నంబర్ సాధించాడు. ఆ తర్వాత వన్డే ఫార్మాట్లో బ్యాట్స్మెన్లకు పీడకలగా మారాడు. 2018, 2019లో వరుసగా ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ వన్డే బౌలర్‌గా నిలిచాడు. టెస్ట్‌లో కూడా తనను తాను ప్రమాదకరమైన బౌలర్‌గా అభివృద్ధి చేసుకున్నాడు. 2023, 2024లో ఐసీసీ ర్యాంకింగ్స్ ద్వారా వరుసగా నంబర్ 1 టెస్ట్ బౌలర్‌గా నిలిచాడు. ఇప్పటికీ ఆ ఫార్మాట్లో ఆ నెంబర్ 1 స్థానాన్ని నిలుపుకొన్నాడు.

# రగ్బీ ప్రీమియర్ లీగ్ తొలి ఛాంపియన్‌గా చెన్నై బుల్స్

## ఫైనల్లో ఢిల్లీ రెడ్జ్‌పై 41-0 తేడాతో విక్టరీ

**న్యూఢిల్లీ:** రగ్బీ ప్రీమియర్ లీగ్ ఫైనల్‌లో చెన్నై బుల్స్ 41-0 తేడాతో ఢిల్లీ రెడ్జ్‌ను ఓడించి తొలి ఛాంపియన్‌గా నిలిచింది. లీగ్ తొలి సీజన్‌లో ఇది అతిపెద్ద విజయంగా రికార్డయింది. చెన్నై సెమీఫైనల్స్‌లో ఆపేసిన చోటు నుంచి పుంజుకుని, తొలి మ్యాచ్‌ల్లో ఢిల్లీ రెడ్జ్‌పై గట్టి దెబ్బలు తిన్నది. ఫైనల్‌లో వాఫోసే మాలికో తొలి ట్రైను సాధించాడు. ఫిలిపే సొతురాగా గోల్‌గా మార్చాడు. కొన్ని క్షణాల తర్వాత, జోసెవా తలకోలో అద్భుతమైన ఎత్తుగడను పూర్తి చేయడంతో రెడ్జ్ బుల్స్ దాడితో విలవిల్లాడింది. మరో ఐదు పాయింట్లతో గోల్‌గా మార్చింది. మొదటి అర్ధభాగం ముగిసేలోపు, బుల్స్ తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. టెర్రీ కెన్నెడీ మరో రెండు ప్రయత్నాలు చేసి రెడ్జ్‌ను అధిగమించాడు. మరియు గౌరవ్ కుమార్ కిక్ నుండి




మరో రెండు ప్రయత్నాలు జోడించాడు. హాఫ్ టైం ముగిసే సమయానికి, బుల్స్ పూర్తి నియంత్రణలో ఉండి, 24-0 ఆధిక్యంలో ఉంది. విరామం తర్వాత కూడా ఆధిపత్యం కొనసాగింది, కెన్నెడీ అతనికి సెట్ వేసిన తర్వాత షానవాజ్ అహ్మద్ లైన్ దాటాడు. ఫిలిప్ సొతురాగా మరో రెండు పాయింట్లు జోడించాడు. ఆట ముగియడానికి నాలుగు నిమిషాలు మిగిలి ఉండగా, ఆధిపత్యం చెలాయించే బుల్స్ 31-0 ఆధిక్యంలో ఉంది. ఇక హైదరాబాద్ హీరోస్ మూడో స్థానంలో నిలిచింది. బెంగళూరు బ్రేవ్‌హార్ట్స్ నుండి ఉత్సాహభరితమైన సవాలును ఎదుర్కొని, హైదరాబాద్ హీరోస్ 2025 రగ్బీ ప్రీమియర్ లీగ్‌లో మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. తొలి దశలో వెనుకబడిన హీరోస్ పూర్తి శక్తితో పోరాడి బ్రేవ్‌హార్ట్స్‌ను 17-12 తేడాతో ఓడించింది. బ్రేవ్‌హార్ట్స్ తరపున టోన్ షియు మరియు ఫిలిప్ వోకోరాచ్ ట్రైలు సాధించగా, అకుయిలా రోకోలిసోవా ఒక కిక్‌ను గోల్‌గా మలిచారు, అన్నీ మొదటి అర్ధభాగంలోనే. మొదటి అర్ధభాగంలో జోజి నసోవా ట్రై మరియు మాన్యుయెల్ మోరెనో గోల్ చేయడం ద్వారా తిరిగి పోరాటం ప్రారంభించిన హీరోస్ జట్టుకు, కెవిన్ వెకేసా మరియు భూపిందర్ సింగ్ ఆటను మార్చే ప్రయత్నాలను జోడించారు.

# క్షీణించిన పారిశ్రామిక ఉత్పత్తి

## మే నెలలో 1.2% మాత్రమే!

**న్యూఢిల్లీ, జూన్ 30:** భారత్ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ మే నెలలో 1.2శాతం ఉన్నట్లు రికార్డయింది. అదే గత ఏప్రిల్‌నెలలో 2.7శాతం కంటే తక్కువ నమోదయింది. కేంద్ర అర్థగణాంక పథక అమలు శాఖ సోమవారం వివరాలను విడుదల చేసింది. 2024 సెప్టెంబరు నెలలో నమోదయిన 3.1శాతం తర్వాత అతి తక్కువ శాతం నమోదు కావడం ఇదే ప్రథమం. గత ఏడాది ఇదేనెలలో పారిశ్రామిక ఉత్పత్తి కార్యకలాపాలు 5.9శాతంగా నమోదయ్యాయి. పారిశ్రామిక ఉత్పత్తి సూచీ మే నెలలో 156.6గా ఉంది. అంతకుముందు ఏడాది ఇదే నెలలో 154.7 పాయింట్లుగా ఉంది. అంటే సుమారు 2.6శాతం పెరిగింది. అంతకుముందు నెలలోచూస్తే మూడుశాతం ఉంది. అప్పటి నుంచి తగ్గింది. ఇదిలా ఉంటే గనుల తవ్వకాల పరంగా 0.1శాతం తగ్గింది. విద్యుత్ ఉత్పత్తికూడా 5.8శాతం క్షీణించింది. ఇక ఉత్పత్తి రంగాలపరంగా 23 కీలక రంగాల్లో 13 రంగాలు సానుకూల వృద్ధిని నమోదుచేస్తే మెషినరీ యంత్రసామగ్రి రంగం 11.8శాతం వృద్ధి నమోదుచేసింది. బేసిక్ మెటల్స్ 6.4శాతంగా ఉంది. ఇతర నాన్ మెటాలిక్ మినరల్ ఉత్పత్తులు 6.9శాతంగా ఉంది. సిమెంట్, గ్లాస్ వేర్, ఇతర కొన్ని ప్రత్యేక ఉక్కు ఉత్పత్తులు కూడా ఈరంగంలో వృద్ధిని నమోదు చేసాయి. భారీ యంత్రసామగ్రి ఉత్పత్తులు 14.1శాంగా ఉంది. మౌలికవనరులు నిర్మాణరంగం ఉత్పత్తులు 6.3 శాతం పెరిగాయి. ఇక ఇంటర్మీడియేట్ ఉత్పత్తులు 3.5శాతంగా ఉంది. ప్రాథమికఉత్పత్తులు 1.9శాతం క్షీణించాయి. ఇక వినియోగరంగ ఉత్పత్తులు, వినియోగరంగం కిందికిరాని కేటగిరీలో 0.7శాతం, 2.4శాతం చొప్పున క్షీణించాయి.



# జిఎస్టీ వసూళ్లు రూ.22.08 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, జూన్ 30:** వస్తుసేవల పన్ను వార్షిక పద్ధతిలో చూస్తే గడచిన ఐదేళ్లలో రెట్టింపు వసూళ్లు జరిగి ఆల్‌టైమ్ రికార్డుస్థాయిని నమోదు చేసాయి. 2024-25 సంవత్సరంలో 22.08 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. అదే 2021 ఆర్థిక సంవత్సరంలో అయితే 11.37లక్షల కోట్లు మాత్రమే వసూలు కాగా 2025 నాటికి 22.08 లక్షల కోట్లు వసూళ్లు జరిగినట్లు తేలింది. స్థూల జీఎస్టీ వసూళ్లు 2024-25 సంవత్సరంలోనే అత్యంత గరిష్టాన్ని తాకాయి. రూ.22.08 లక్షల కోట్లు వసూళ్లు జరిగితే 9.4శాతం వృద్ధిని నమోదు చేసాయి. నెలసరి సగటు వసూళ్లు 1.84 లక్షల కోట్లుగా ఉన్నట్లు తేలింది. 2024లో సగటున 1.68 లక్షల కోట్లు, 2022 సంవత్సరంలో సగటున 1.51 లక్షల కోట్లు నెలవారీగా వసూళ్లు నమోదయ్యాయి. ఎనిమిదేళ్లలో జీఎస్టీ పన్ను చెల్లింపు దారులు 65 లక్షలనుంచి 1.51 కోట్లకు పెరిగారు. జీఎస్టీ ప్రవేశపెట్టినప్పటి నుంచి కూడా సేవల పన్ను పటిష్టమైన వృద్ధిని నమోదు చేసింది. రెవెన్యూ వసూళ్లు, పన్ను బేస్‌ను కూడా విస్తరించింది. దీన్నిబట్టి చూస్తే భారత్ ఆర్థిక పటిష్టతను మరింతగా పెంచినట్లు తేలింది. పరోక్ష పన్నులు వరకూ చూస్తే మరింత పారదర్శకంగా ఉన్నట్లు తేలింది. జిఎస్టీ ప్రారంభించినప్పటి నుంచి సగటు వసూళ్లు 95 వేల కోట్లు తక్కువ కాకుండా వసూళ్లు జరిగాయి. 2017 జులై ఒకటవ తేదీని ప్రారంభించిన జిఎస్టీ ఇప్పటికి ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుంది. జిఎస్టీ మొత్తం 17 స్థానిక పన్నులు, 13 సెస్‌లు విలీనం చేయడం ద్వారా ఐదు అంచెల పన్నుల వ్యవస్థను ప్రవేశపెట్టారు. నెలవారీ జిఎస్టీ వసూళ్లు రికార్డుస్థాయిలో వచ్చింది. 2025 ఏప్రిల్‌నెలలోనే 2.37 లక్షల కోట్లు వసూ ళ్లు జరిగాయి. మేనెలలో చూస్తే 2.01 లక్షల కోట్లుగా ఉన్నాయి.




# నష్టాల్లో ముగిసిన స్టాక్ సూచీలు

**ముంబై, జూన్ 30:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల వరుస లాభాలకు బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతు కొనసాగుతున్నప్పటికీ.. ఫైనాన్షియల్, ఆటోమొబైల్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, రిలయన్స్ షేర్లు సూచీలను కిందకు లాగాయి. దీంతో నాలుగు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఓ దశలో 500 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 25,550 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 84,027.33 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,058.90) ఫ్లాట్‌గా ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 83,482.13 84,099.53 మధ్య చలించిన సూచీ.. చివరికి 452.44 పాయింట్ల నష్టంతో 83,606.46 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 120.75 పాయింట్ల నష్టంతో 25,517.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.74గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రాబ్యాంక్, మారుతీ సుజుకీ, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ట్రెంట్, ఎస్‌బీఐ, బీఈఎల్, టైటాన్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 67.58 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3299 డాలర్ల వద్ద కొనసాగింది.



# ఇన్నోవా హైక్రాస్‌కు ఫైవ్‌స్టార్ రేటింగ్..!

**ముంబై, జూన్ 30:** టయోటా ఇన్నోవా హైక్రాస్ కారు సరికొత్త రికార్డు సృష్టించింది. భారత్ ఎన్‌క్యాప్ (న్యూకార్ అసెస్‌మెంట్ ప్రోగ్రాం)లో ఎంపీవీ విభాగంలో ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించిన తొలికారుగా నిలిచింది. ఈ రేటింగ్స్ పరీక్షించి మూడు వరుసల సీట్లున్న కారులో ఈ స్థాయి స్కోరు సాధించింది కూడా ఇదే. దీంతో ఎంపీవీ విభాగంలో సురక్షితమైనదిగా నిలిచింది. ఈ పరీక్షల్లో స్ట్రాంగ్ హైబ్రీడ్, నాన్ హైబ్రీడ్ మోడల్ కార్లు పాల్గొన్నాయి. పెద్దల భద్రతకు సంబంధించి 32కుగాను 30.47 పాయింట్లు, పిల్లల రక్షణకు సంబంధించి 49కుగాను 45 పాయింట్లు సాధించింది. పెద్దలకు సంబంధించి ఫ్రంట్, సైడ్ క్రాష్ టెస్ట్ లో అత్యధికస్కోర్ దీనికి లభించింది. తల, కాళ్లు, నడుము కింద భాగానికి రక్షణ ఇచ్చింది. ఇక డ్రైవర్ ఛాతి, ఎడమ కాలుపై కూడా ప్రమాద తీవ్రతను అడ్డు కొంది. సైడ్ ఇంపాక్ట్ టెస్ట్‌లో దీనికి 16కు 16 పాయింట్లు లభించాయి. ఈ కారు బేస్ మోడల్ నుంచే ప్రయాణికుల భద్రతకు సంబంధించి చాలా ఫీచర్లను ఇచ్చారు. ఆరు ఎయిర్ బ్యాగ్ లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, ఏబీఎస్, హిల్ స్టార్ట్ అసిస్ట్, మూడు వరుసలకు సీట్‌బెల్ట్ రిమైండర్ ఇలా అన్ని వేరియంట్లకు ఉన్నాయి. ఇక హైఎండ్ మోడల్‌కు అడాస్, 360 డిగ్రీ కెమెరా వంటి ఫీచర్లు లభిస్తు న్నాయి. ఈ కారులో టయోటా ఫిఫ్త్ జనరేషన్ సెల్ఫ్ ఛార్జింగ్ స్ట్రాంగ్ హైబ్రీడ్ ఎలక్ట్రిక్ సిస్టమ్ ఇచ్చారు.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.